ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**

**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

బుధవారం, మార్చి 18, 2015,

ఇరవై మూడవ సమావేశం, సంపుటం–2, నంబరు–8,

**WEDNESDAY, THE 18th DAY OF MARCH, 2015,**

**TWENTY THIRD SESSION, VOLUME - 2, NO.8,**

*****

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**

**PUBLIC GARDENS,**

**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## బుధవారం, మార్చి 18, 2015.

# అధికార నివేదిక

---

## విషయ సూచిక

---

(1) సభా కార్యక్రమం – వాయిదా తీర్మానాలు

(2) ప్రశ్నోత్తరాలు

(3) సభా సమక్షంలో ఉంచే పత్రాలు

(4) అర్జీ సమర్పణ

(5) 2015–16 సంవత్సరపు వార్షిక బడ్జెట్ పై చర్చ కొనసాగింపు.

---

**ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL**

**WEDNESDAY, THE 18th DAY OF MARCH, 2015.**

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)

(HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

(1) **సభా కార్యక్రమం – వాయిదా తీర్మానాలు ః**

శ్రీ సి. రామచంద్రయ్య ః (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, స్పెషల్ స్టేటస్‌ను అమలుచేయాలని సిపిఐ వాళ్లు ఆంధ్రప్రదేశ్ అంతటా కేంద్రప్రభుత్వ సంస్థలను స్థంభింపచేసే కార్యక్రమంలో సిపిఐ జనరల్ సెక్రటరీ రామకృష్ణను అనంతపూర్‌లో అరెస్ట్ చేసి నేటికి 8 రోజులయ్యింది. ఇంతవరకూ అమీతుమీ లేకుండా ఉంది.

(సభ్యులు శ్రీ పి.జె చంద్రశేఖర రావు తమ స్థానంలో లేచి నిలబడి "హక్కుల కోసం ఉద్యమించడం నేరమా? సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రామకృష్ణను విడుదల చేయాలి – సిపిఐ" అనే ప్లకార్డును ప్రదర్శించసాగారు)

మిస్టర్ ఛైర్మన్ ః నాకు అడ్జర్న్‌మెంట్ మోషన్ ఇవ్వలేదు.

శ్రీ సి. రామచంద్రయ్య ః అందరి తరఫున ఇచ్చాము సార్.

మిస్టర్ ఛైర్మన్ ః అందులో మీ సంతకం లేదు. అనంతపురం జిల్లా మాజీ ఎం.ఎల్.ఏ మరియు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గురించి రెండురోజుల క్రితం శ్రీ పి.జె. చంద్రశేఖర రావు మెన్షన్ చేశారు.

శ్రీ సి. రామచంద్రయ్య ః అధ్యక్షా, అక్కడ పెద్ద టెర్రరిస్ట్ యాక్టివిటీస్ ఏమీ జరగలేదు. రాష్ట్రప్రభుత్వంకు స్పెషల్ స్టేటస్ ఇవ్వమని అక్కడ ప్రొటెస్ట్ చేశారు. ఆంధ్రరాష్ట్రంలో ప్రొటెస్ట్ చేసే హక్కు కూడా లేకుండా పోయింది. ఆడవారు కానీ, మగవారు కానీ ఎవరినైనా సరే తీసుకుపోయి లోపల వేయడం జరుగుతోంది. అరెస్ట్ చేయబడిన వ్యక్తి ఒక పార్టీ జనరల్ సెక్రటరీ, అతను చేసిన తప్పు ఏమిటి? ఒక రాష్ట్రం గురించి పోరాడడమా?

Dr.M. GEYANAND : (ఉపాధ్యాయ నియోజక వర్గం – కడప, అనంతపురం, కర్నూలు) Sir, it is a political act, not a criminal act. అది ఒక రాజకీయమైన చర్య. రాష్ట్రప్రయోజనాలను, రాయలసీమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని స్పెషల్ స్టేటస్ కావాలని ఆయన కోరడం జరిగింది. బెయిల్ ఇవ్వకపోవడం ఏమిటి? బెయిల్ హక్కు కాదా సార్?

మిస్టర్ ఛైర్మన్ ః లాస్ట్ టైమ్ కూడా మెన్షన్ చేశారు, రేపు సంబంధిత మినిస్టర్ వస్తారు, we will ask him to give reply.

శ్రీ సి. రామచంద్రయ్య ః రిప్లై ఏంటి సార్? యాక్షన్ తీసుకోమని చెప్పండి. వాళ్లు దానిని జస్టిఫై చేసుకుంటారా? లేదే! దానిమీద యాక్షన్ తీసుకోమని చెబుతున్నాము.

శ్రీ యనమల రామకృష్ణుడు ః అధ్యక్షా, ప్రజాస్వామ్యంలో పొలిటికల్ యాజిటేషన్స్ చేయడం అనేది Fundamental Right. దానిని ఎవ్వరూ కాదనేది లేదు. అక్కడ పరిస్థితులు ఏమిటో, ఎందుకు అరెస్ట్ చేశారో ఖచ్చితంగా తెలియదు. మా దగ్గర ఉన్న సమాచారం ప్రకారం బహుశః నాలుగు రోజుల క్రితమే అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసి కోర్టు రిమాండ్‌లో ఉన్న వ్యక్తి గురించి మనం చేసేది ఏం లేదు. పోలీస్ రిమాండ్‌లో

ఉంటే మనం ఏదైనా చేయడానికి ఉంటుంది, పోలీసులతో మాట్లాడుతాము. జుడీషియల్ రిమాండ్‌లో ఉంటే జుడీషియరీ చేయాలి తప్ప ప్రభుత్వం చేతిలో ఏమీ ఉండదు.

రెండవది, స్పెషల్ స్టేటస్‌కు సంబంధించినంత వరకూ కూడా మీలాగే మేము కూడా రిక్వెస్ట్ చేస్తున్నాము. అది కేంద్రప్రభుత్వ పరిధిలో ఉంది. పార్లమెంట్‌లో చేయాలి, లేదా కేంద్రప్రభుత్వం చేయాలి మన పరిధిలో లేదు. అది మన పరిధిలో ఉన్నంతవరకూ ఎంత ప్రయత్నిస్తున్నామనేది హౌస్‌కు తెలియజేయడానికి నాకేమీ అభ్యంతరం లేదు.

మిస్టర్ ఛైర్మన్ ః చంద్రశేఖర్ గారు , మంత్రిగారు చెప్పారు కదా! కూర్చోండి.

డా. ఎం. గేయానంద్ ః సార్, అది ఇంకా ఎఫ్ఐఆర్ స్టేటస్‌లోనే ఉంది.

MR. CHAIRMAN: That is the reason why the facts are available with the Home Minister. If it is a Judicial Remand and if he is in Judicial Custody what is the position we will know?

డా. ఎం. గేయానంద్ ః సార్, కోర్టు రెండు సార్లు బెయిల్ నిరాకరించింది.

మిస్టర్ ఛైర్మన్ ః నిన్న సంబంధిత మినిస్టర్ గారిని అడిగి ఉంటే బాగుండేది. ఈ రోజు వారు లేరు. ఈ రోజు తన బిజినెస్‌నంతటిని రేపటికి వాయిదా వేయమని కోరారు. రేపు ఆయన వచ్చాక తప్పకుండా అడుగుదాము.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు ః (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, లీడర్ ఆఫ్ ది హౌస్ ఇక్కడ ఉండడం అనేది కూడా అదృష్టం. నా మనవి ఏమిటంటే.... మన రాష్ట్రం రాజకీయాలకు అతీతంగా కేంద్రంతో కోరుతున్న అత్యంత ప్రధానమైన సమస్యల మీద.......

మిస్టర్ ఛైర్మన్ ః అది ఎవ్వరూ కాదనడం లేదండీ. లీడర్ ఆఫ్ ది హౌస్, ప్రభుత్వం కూడా అదే అంటున్నారు.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు ః అలా అంటూనే జైలులో వేస్తే ఎలా సార్? ఒకవైపు అలా చెబుతూనే మరోవైపు నాన్ బెయిలబుల్ సెక్షన్స్ క్రింద అరెస్ట్ చేస్తే ఎలా?

మిస్టర్ ఛైర్మన్ ః మీ ప్రశ్నలకు స్టేట్‌మెంట్ గాని, రిప్లై గానీ వస్తుంది.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావుః నేను కోరేదేమంటే, అనేక సందర్భాలలో సామాజిక ఉద్యమాలకు సంబంధించిన అనేక అంశాలలో ప్రభుత్వాలు కేసులు ఎత్తివేయడం లేదా ఉపసంహరించుకోవడం వంటి సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. అత్యంత ప్రధానమైనటువంటి సమస్య మీద ఆందోళన చేసిన నేపథ్యంలో కేసు ఉపసంహరించుకుంటామని ప్రభుత్వాన్ని చెప్పమనండి.

శ్రీ సి. రామచంద్రయ్య ః గతంలో మంత్రుల పైన ఉన్న కేసులను కొట్టివేసి, ఉపసంహరించారు. మేము ఏమీ మాట్లాడలేదు సార్.

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా, నాకు పూర్తిగా వివరాలు తెలియదు. ఈ విషయం గురించి హోం మినిస్టర్ గారికి తెలిసి ఉంటుంది. బెయిల్‌కు అప్లై చేశారు, కానీ రాలేదంటే బహుశః it is under the purview of the Court. కోర్టు పరిధిలో ఉన్న దానిని ప్రభుత్వం ఏం చేయాలనేదాని గురించి ఆలోచించాలి. రెండవది, గౌరవ సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర రావు, సి. రామచంద్రయ్య గార్లు అడిగినట్లు కేసు విత్‌డ్రా చేయాలంటే దానికి చాలా ప్రాసెస్ ఉంది. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాలి, మళ్లీ పి.పికి ఇవ్వాలి, పి.పి మళ్లీ కోర్టులో వేయాలి. Meanwhile, మాచేతులలో ఏమైనా ఉందంటే దేనివలన జరిగింది, ఎందుకు

జరిగిందనేది మినిస్టర్ గారిని అడుగుతాము. మినిస్టర్ గారు చెబుతారు. దాని ద్వారా ఒకవేళ గవర్నమెంట్ పరిధిలో ఏమైనా ఉందంటే ఖచ్చితంగా we will try to bear it out.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావుః అధ్యక్షా, తమరు చెప్పినట్లుగా నాలుగు రోజుల క్రితమే సభ దృష్టికి తీసుకురావడం జరిగింది. గత 8 రోజుల నుండి ఆయన జైలులో ఉన్నారు. నేను వ్యక్తిగతంగా కూడా ఈ విషయాన్ని హోంమినిస్టర్ గారి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఎఫ్ఐఆర్ స్టేటస్‌లోనే నాన్ బెయిలబుల్ సెక్షన్స్ పెట్టడం వలన బెయిల్‌కు రెండు సార్లు అర్జీ పెట్టినప్పటికీ బెయిల్ రాలేదు. నేను కోరేదేమంటే ఛార్జ్‌షీట్ ఫైల్ చేయలేదు కాబట్టి ప్రభుత్వం డైరెక్షన్ ఇచ్చినట్లయితే వారు కేసు ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. బెయిల్ సమస్య లేకుండా ఉంటుంది. ఏ అంశం గురించి అయితే ఆయన ఆందోళన చేసి, జైలులో పెట్టబడ్డాలో దానిని రాష్ట్రప్రభుత్వం సమర్థిస్తున్నది అనే ఒక సందేశం కూడా ప్రజలకు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇదేదో criminal attitude వల్ల చేసిందో, దొంగతనం చేసిందో కాదు. ఈ నేపథ్యంలో సభా నాయకులను కోరేదేమంటే మేము ఈ కేసులను ఉపసంహరిస్తాము, ప్రజలకోసం చేసిన ఈ ఆందోళనకు మేము సానుభూతితో సహకరిస్తామనే స్టేట్‌మెంట్ ఇవ్వకుండా జుడీషియరీలో ఉందని చెబుతున్నారు. జుడీషియరీలో ఉండి, ఛార్జ్‌షీట్ ఫైల్ చేసిన సంఘటనలలో కూడా కేసులు ఎత్తి వేసి ఉపసంహరించుకున్న విషయం గౌరవ మంత్రులకు తెలియనిది కాదు. దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించి, ఈ కేసులను పరిశీలించి మేము విత్‌డ్రా చేసుకుంటామని ఈ సభద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా,గౌరవ సభ్యుల మీద ఉన్న గౌరవంతో, సభమీద ఉన్న గౌరవంలో నిలబడి చెబుతున్నాను. నాకు వివరాలు తెలియవు. ఇప్పుడు కూడా ఏ రకమైన నోటీసు ఇవ్వకుండా అడిగారు కాబట్టి చెప్పాలనే ఉద్దేశంతో చెబుతున్నాను. We will definitely examine the matter under the provisions of the Law.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావుః అధ్యక్షా, మంత్రిగారు తమకు సంబంధం లేని విషయమని అంటున్నారు. నేను కోరేదేమంటే హోంమంత్రిగారిని సభలో ప్రకటన చేయమనండి.

MR. CHAIRMAN: Mr. Chandrasekhara Rao Garu what you have said is that he should have come under Rule-70 సెషన్ మొదలయ్యాక రావాల్సింది, కానీ రాలేదు. రూల్ 70 కింద రాలేదు. Still you have raised this point. రేపు ఆయన వచ్చినప్పుడు definitely he will come with a statement.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావుః వివిధ ఛానల్స్ ద్వారా ప్రభుత్వానికి తెలియపరిచాము.

శ్రీ యనమల రామకృష్ణుడు ః అధ్యక్షా, ఇప్పటికే టైం అవుతోంది, I will inform the concerned Minister, he will give reply to the point.

ఉ10.10

శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావు ః అధ్యక్షా, నేను దీనికి పూర్తిగా అసంతృప్తితో ఉన్నాను.

మిస్టర్ ఛైర్మన్ ః ప్రొలాంగ్ చేస్తే లాభమేంటో ఎవరికీ తెలీదు.

శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావు ః లాభమేంటి సార్, ప్రజలకు లాభం చేయాలి. వాళ్లకు ప్రత్యేక హోదా రావాలి. దానికోసం పోరాడిన వాళ్లను జైలునుంచి బయటకు తీసుకురావాలి. That is what we are asking.

MR. CHAIRMAN: That's alright, I am not allowing you.

శ్రీ సి. రామచంద్రయ్య ః అధ్యక్షా, మేము ప్రభుత్వానికి ఈ ఒక్క విషయం మాత్రమే అప్పీలు చేయడం లేదు.

మిస్టర్ ఛైర్మన్ ః  రామచంద్రయ్య గారూ దానిపైన మీరెందుకు మాట్లాడుతున్నారు.

శ్రీ సి. రామచంద్రయ్య ః  కాదు సార్ నేను చెబుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ ః  ఆయనేదో ఇచ్చారు, మీరేమో అడుగుతారు.

శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావు ః  నేనివ్వడమేంటి సార్? ...........

శ్రీ సి. రామచంద్రయ్య ః  అధ్యక్షా, ఏమిటిది? అందే దర్బార్ లాగా జరిగిపోతుంటే ఎలా? ఇక్కడ మేముండేదెందుకు? ప్రభుత్వంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే మేము కూడా అర్థం చేసుకుని చెప్పగలము.

మిస్టర్ ఛైర్మన్ ః  మీరు కూడా అలా అంటే ఎలా? You should have given a notice under Rule-70, then I should have been admitted.

శ్రీ సి. రామచంద్రయ్య ః  అధ్యక్షా, సామాన్య ప్రజానీకము, ప్రభుత్వ ఉద్యోగస్తులు........

MR. CHAIRMAN: There is an ambit for mentioning. You have given sufficient focus on this. Then, the Minister also came here.

శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావు ః  సార్ ఇది చర్చించవలసిన అంశమా?

SRI C. RAMACHANDRAIAH: We want tolerance levels to be increased from every side.

శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావు ః అధ్యక్షా, కేంద్రంలో ప్రత్యేకహోదా ఇవ్వాలా? లేదా? అని చర్చలలో పెట్టారు.  అది శీతల గిడ్డంగులలోకి వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నారు.  ఇక్కడ మేము ఆందోళన చేస్తే, మమ్మల్ని జైలులో పెడితే అర్థం ఏమిటి?  What message it will pass on to the people. Sir, my humble request to the Government is to withdraw the case and release the people who are fighting for the cause of the people. That is what I am asking.

శ్రీ యనమల రామకృష్ణుడు ః  అధ్యక్షా, I will inform the concerned Minister.

MR. CHAIRMAN: Mr. Chandrasekhara Rao Garu if you want the statement, you should have come long back ago under Rule-70 then I should have also allowed you. Why didn't you come? Even then, you have raised the issue. Last time, you have moved an adjournment motion and that has been disallowed.  ఒక సారి disallowed చేస్తే మళ్లీ రెయిజ్ చేయకూడదు. There is a rule but, still I have allowed you. Please, understand.

SRI C. RAMACHANDRAIAH: We are fully aware that it is disallowed but still we have done. What to do? ఏమి చేస్తారో, మాకు ముందుగానే తెలుసు.

MR. CHAIRMAN: Mr.C.Ramachandraiah Garu there is a legal aspect involved in it. Let the concerned Minister, Deputy Chief Minister holding Home portfolio will come and make a statement in the House.

SRI P.J. CHANDRASEKHARA RAO:  For the last 4-5 days....

**వాయిదా తీర్మానాలు ః**

MR. CHAIRMAN: Today, I have received three Adjournment Motions.

The Adjournment Motion given notice of by Sri D.V.Suryanarayana Raju Garu regarding apprehension of tribals due to permission given by Central Government for Bauxite Mining in Visakhapatnam Agency area, has been disallowed.

The Adjournment Motion given notice of by Sri P.J.Chandrasekhara Rao Garu regarding illegal detention of Sri K. Ramakrishna, C.P.I. State Secretary, Sri Jagadish, Sri Jaffar and others for the last one week by the police when they were protesting for implementation of special status to the State, has been disallowed.

The third and the last Adjournment Motion given notice of by Smt.T.Ratna Bai Garu regarding illegal detention of Sri K. Ramakrishna, C.P.I. State Secretary & Ex.MLA, Sri

Jagadish, Sri Jaffar and others for the last one week by the police when they were protesting for implementation of special status to the State and special packages to Rayalaseema and Uttarandhra, has also been disallowed.

SRI P.J.CHANDRASEKHARA RAO: With this, I am not satisfied Sir. I am making a walk out.

MR. CHAIRMAN: No, the Member is on his legs.

SRI P.J.CHANDRASEKHARA RAO: Sir, I am expressing my sincere protest by making a walk out. I request the Government to withdraw the case immediately. People will take seriously and consequences will not be favour of our progress.

(ఆ సందర్భంలో ప్రతిపక్ష పార్టీ సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావు సభలో నుంచి వాకౌట్ చేసి వెళ్లి పోయారు)

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, జనరల్ ప్రొసీజర్ ప్రకారం వాకౌట్ చేయకుండా చెప్పారు కనుక we will apply our mind to the procedure అన్నాము. ఒకసారి వాకౌట్ చేసిన తరువాత మేము ఆ విషయాన్ని consider చేయవలసిన, examine చేయవలసిన అవసరం ఉండదు. ఎందుకంటే వాళ్లే విషయాన్ని ముగించారు కాబట్టి.

SRI C. RAMACHANDRAIAH: Whatever you will do, it will have impact on your Government. Whether you will accept it or you will not accept it. Definitely, it will have an impact on your Government. ఈ బెదిరింపులు ఏమిటి సార్? మంత్రిగారు చెప్పారు మాకు సంతోషంగా ఉంది. I will convey it to the concerned Minister అన్నారు. వాళ్లలా వెళ్లిపోయారు కాబట్టి ఖచ్చితంగా చేయండి. మేము మంచి సలహాలు ఇస్తాము, వాళ్లు ఆచరించ వద్దని నేను కోరుకుంటున్నాను. అదే మాకు కావాలి.

మిస్టర్ ఛైర్మన్: రామచంద్రయ్యగారు, వాళ్లు చెప్పేది వినండి.

శ్రీ యనమల రామకృష్ణుడు : రామచంద్రయ్యగారూ మేము చెప్పమని అనడం లేదు. నేను ఉన్న సిస్టమ్ చెబుతున్నాను. ఒక సారి వాకౌట్ చేస్తే that question is over. నేను ప్రొసీజర్ చెబుతున్నాను కానీ, వేరే ఏమి కాదు.

(ఆ సందర్భంలో సభ్యులు డా.ఎం. గేయానంద్ సభలో నుంచి వాకౌట్ చేసి సభనుంచి వెళ్లిపోవడానికి సిద్ధపడ్డారు.)

మిస్టర్ ఛైర్మన్: డా.ఎం.గేయనంద్‌గారూ, మీకు అడ్జర్న్‌మెంట్ మోషన్‌తో సంబంధం లేదు మీరెందుకు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారు.

డా. ఎం. గేయానంద్: సార్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గారు మా అనంతపురానికి చెందిన వ్యక్తి.

మిస్టర్ ఛైర్మన్: అయితే ఒక సెంటెన్స్ అయినా రాసిపోవచ్చు కదా?

(తిరిగి డా.ఎం.గేయానంద్‌గారు తమ స్థానంలో కూర్చున్నారు.)

(సభలో సభ్యుల నవ్వులు)

మిస్టర్ ఛైర్మన్: రామచంద్రయ్యగారూ, లీడర్ ఆఫ్ ది హౌజ్ చెప్పిందేమిటంటే, He has explained the Parliamentary practices, conventions and rule position అంతే చెప్పారు. ఎందుకంటే ఆయన ఇంతకు ముందు స్పీకర్‌గా కూడా ఉన్నారు. He followed the rules, procedures, practices of the Parliamentary Practice.

SRI C. RAMACHANDRAIAH: No, the Leader of the House is representing the Government and not the Speaker.

MR. CHAIRMAN: Mr. Ramachandraiah Garu, you are so liberal in saying that it is a legal aspect. It is a matter of sub-Judice. They have to examine that point also. Please, try to understand.

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, నేను ఒకదానికి శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రిగా చెప్పాను. మరొకదానికి వేరే మంత్రిగా సమాధానం ఇచ్చాను.

శ్రీ సి. రామచంద్రయ్య : మీకు మంత్రిగా Different connotation ఉంది. కానీ అక్కడ కూర్చొని చెప్పడానికి, ఇక్కడ కూర్చొని చెప్పడానికి చాలా తేడా ఉంది.

MR. CHAIRMAN: Yes, Mr. Suryanarayana Raju Garu.

శ్రీ డి.వి.సూర్యనారాయణ రాజు : (స్థానిక సంస్థల నియోజక వర్గం – విశాఖపట్టణం) అధ్యక్షా, విశాఖపట్నం జిల్లాలో బాక్సైట్ తవ్వకాలకు కేంద్రప్రభుత్వం అనుమతినిచ్చిన, సందర్భంలో అక్కడ గిరిజనులు చాలా ఆందోళన చెందుతున్నారు. దీనిపై అసలు రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటి? దానిని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుంటున్నదా? అక్కడ తవ్వకాలను ప్రారంభిస్తారా? ఏదో ఒకటి కరెక్ట్‌గా తెలియజేస్తే అక్కడ ఆందోళన ఉండదని తమద్వారా ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను.

MR. CHAIRMAN: I have already disallowed your Adjournment Motion in my Chamber. I am to announce the House that two days training programme is being conducted by the IT Department in co-operation with the Google for providing digital literacy training programme for Hon'ble Members. The object is to reach internet to maximize connection to the people in the Members lounge in the Assembly buildings, soon after the adjournment of the House on 18th and 19th March, 2015. Therefore, all the Members are requested to bring their I-pad and Laptop during the training programme followed by the IT and Inaugural function on 18th today to participate in the training programme. Now, I will take up the Question Hour.

SRI C. RAMACHANDRAIAH: This is such an important issue which should have been allowed, adjournment motion accept చేసి ఉండాలి.

MR. CHAIRMAN: No, for an Adjournment Motion there should be a concerned Minister to answer. Why he has not given earlier? I do not know how you are supporting. I can understand. It has come three days back only, then he should have come with a Motion under Rule-70. Yes or not, even then you have taken liberal rule.

(2) **ప్రశ్నోత్తరాలు :**

## టైమ్ స్కేల్ ఉద్యోగులకు10వ పి.ఆర్.సి

ప్రశ్న నెం. 7924 (71)

సర్వశ్రీ ఎం.వి.యస్. శర్మ, కె.ఎస్.లక్షణరావు, డా.ఎం.గేయానంద్, ఎం.ఎల్.సి.లు,

గౌరవనీయులైన ఆర్థిక శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) 25-11-1993 కి ముందు వివిధ ప్రభుత్వ శాఖలలో నియమించబడిన టైమ్ స్కేల్ ఉద్యోగుల మొత్తం సంఖ్య ఎంత?

ఆ) ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించడానికి ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?

ఇ) మూలవేతనం, డి.ఎ, హెచ్.ఆర్.ఎ, సి.సి.ఎలపై 10 వ వేతన సవరణ సంఘం సిఫారసులను మరియు ఇతర సౌకర్యాలను ఈ టైమ్ స్కేల్ ఉద్యోగులకు వర్తింపజేయబడతాయా?

గౌరవనీయులైన ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు):

అ) "టైమ్ స్కేల్ ఉద్యోగులు" ఆ విధమైన ఉద్యోగ కేటగిరి లేదు.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) వర్తించదు.

డా. ఎం. గేయానంద్ : అధ్యక్షా, నా ప్రశ్న ప్రభుత్వం వారికి అర్థం కావడం లేదు కాబట్టి, కొంచెం వివరించి చెబుతాను. **25-11-1993**న ప్రభుత్వం ఒక జీవో తీసుకువచ్చింది. దానిలో అంతకు ముందు 5 సంవత్సరాల నుంచి కంటింజెంట్, ఎన్ఎంఆర్, డైలీ వేజస్ ఈ విధంగా రకరకాల కేటగిరీలలో పనిచేస్తున్నారు. ఐదేళ్ల సర్వీసు ఎవరైతే పూర్తిచేసుకున్నారో వాళ్లందరిని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. కాబట్టి రెగ్యులరైజ్ అయి ఆ రకంగా ఎంతమంది పనిచేస్తున్నారో తెలియజేయాలి. అయితే వారిలో ఒక్క రోజు తక్కువ అయినా కూడా వాళ్లని రెగ్యులరైజ్ చేయలేదు. ఈ రకంగా రెగ్యులరైజ్ చేయని వాళ్లు ఎంతమంది ఉన్నారు? వాళ్లందరికి కూడా చాలా మినిమమ్ శాలరీలు ఇస్తూ నడుపుతున్నారు. ఒక స్వీపర్‌కి పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంటులో రూ. 1600/ – లు జీతం ఇస్తున్నారు. ఇంకొకరికి శాలరీ వచ్చి రూ. 3000/ – లు ఇస్తున్నారు. దాదాపు ఇరవై వేల మంది ప్రభుత్వం లోని చాలా శాఖలలో పనిచేస్తూ చాలా దయనీయమైన జీవితం గడుపుతున్నారు. పి.ఆర్.సి ఒక రికమెండేషన్ చేసింది. ఈ రకమైన వాళ్లు ఎవరెవరు ఉన్నారో, వాళ్లందరికి కూడా మిగిలిన ఉద్యోగులతో సరిసమానంగా అలవెన్సెస్, ఇతరత్రా సౌకర్యాలు ఇవ్వాలని సిఫారసు చేసింది.

ఉ.10.20

ముఖ్యమైన విషయము సార్, ఇక్కడ ఉన్న స్పిరిట్‌ను మినిష్టర్ గారు తీసుకొని వాళ్లందరి విషయములో consider చేయాలని కోరుతున్నాను. గత ప్రభుత్వంలో కూడా దీనికి సంబంధించినటువంటి ప్రాసెస్ ఒకటి జరిగింది. కాబట్టి దాని మీద ఇంకొంచెం ముందుకు నడిపి ఏదైనా చర్య తీసుకుంటే ఈ రూ.1500, 1600లతో 25 ఏళ్లుగా పనిచేసినటువంటి వారు ఎవరైతే ఉన్నారో వాళ్లందరికి న్యాయం చేసినవాళ్లవుతారు. కాబట్టి దాని గురించి చెప్పవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, మేము ఉద్యోగుల పట్ల ఏ విధమైనటువంటి సానుభూతితో ఉన్నామో గౌరవసభ్యులకు తెలుసు. గౌరవ సభ్యులు ఇంతకు ముందు అడిగిన ప్రతి ఒక్కటి చేయడం జరిగింది తప్ప వాటిని తిరస్కరించడం జరగలేదు. ఇందులో రెండు రకాలు ఉన్నారు ఇంత వరకు క్వాలిఫై అయిన వాళ్లందరిని కూడా ప్రభుత్వాలు క్రమబద్ధీకరణ చేసేసారు. ఇంక ఇప్పుడు ఉన్నటువంటి వారు ఆ రోజు నాటికి క్వాలిఫికేషన్ ఉన్న కూడా పోస్టులు ఖాళీ లేవు. ఇప్పుడు కొన్ని పోస్టులు ఖాళీ వచ్చి ఉండవచ్చు . అందుచేత పాజిటివ్ గానే నిర్ణయం తీసుకొని ఏవరైతే క్వాలిఫై అయిన వాళ్లు ఉన్నారో వాళ్లందరిని కూడా క్రమబద్ధీకరణ చేశాయి. పిఆర్‌సి రికమెండ్ చేసినా, ఎలిజిబుల్ కానీ వారిని క్రమబద్ధీకరణ చేయడం కష్టతరమైన పద్ధతి. కాబట్టి We are going to examine each and every case in detail. గౌరవ సభ్యులు వివరాలు అడిగారు. అ వివరాలను నేను గౌరవ సభ్యులకు అందజేస్తాను.

డా. ఎం. గేయానంద్ : సార్, ఎవరైతే ఉద్యోగులు ఉన్నారో వారు అతి తక్కువ వేతనంతో బ్రతుకుతున్నారు. ఒక్కొక్కరి వేతనం రూ.1600లు మాత్రమే ఉన్నది. ప్రభుత్వానికి కూడా ఇది చాలా తలదించుకోవలసిన విషయము అవుతుంది. కాబట్టి వాళ్లు తప్పని సరిగా దాని మీద చర్య తీసుకొని ఈ సమావేశాలు అయ్యేలోగానే ఏమి చేస్తారో చెబితే బాగుంటుందని తెలియజేసుకుంటున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడు ః వాళ్లు చాలా కష్టాలలో ఉన్నారు అందులో ఎలాంటి సందేహం లేదు. వాళ్లకంటే ఎక్కువ కష్టాలలో ఆర్థిక పరంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది. అందుచేత వీలైనంతవరకు సహాయం చేయడం జరుగుతుంది. తరువాత మనకు రూల్స్ అన్నీ ఒప్పుకోవాలి. అవన్నీ కూడా పరిశీలించిన తరువాత అర్హులైన వారిని వీలైంతవరకు absorb చేయడానికి చూస్తాము. అర్హులు కానీ వారికి పిఆర్‌సి రెకమెండ్ చేసినా కూడా మేము ఏమి చేయలేము.

ఛైర్మన్ః మహమ్మద్ జానీ please put your question.

## రాష్ట్రంలో స్మార్ట్ విలేజ్‌లు

ప్రశ్న నెం. 7895 (72)

శ్రీ మహ్మద్ జానీ, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన ఆర్థిక శాఖా మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో స్మార్ట్ విలెజ్‌లను ఏర్పాటు చేసే యోచన ప్రభుత్వానికి ఉన్నదా,

ఆ) అయినచో, జిల్లాల వారీగా స్మార్ట్ విలేజ్‌లుగా అభివృద్ధి చేసేందుకు ఇప్పుడు వరకు ఎంపికైన గ్రామాలు ఎన్ని ?

ఇ) ఆ గ్రామాలలో ఈ పథకం క్రింద చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాల ఏమి?

ఈ) కేటాయించిన నిధుల వివరాలు ఏమి?

గౌరవనీయులైన ఆర్థిక శాఖామాత్యులు (శ్రీ యనమల రామకృష్ణుడు):

అ) అవునండి.

ఆ) అభివృద్ధి కోసం మొత్తం 12918గ్రామ పంచాయతీలు, 3393 వార్డులను గుర్తించడమయింది. గ్రామాలు, వార్డుల సంఖ్యను జిల్లా వారీగా అనుబంధం-1గా సభా సమక్షంలో ఉంచడమయింది.

ఇ) రాష్ట్రంలో స్మార్ట్ విలేజ్ , స్మార్ట్ వార్డును సాధించడానికి 20 బదలాంచదగని అభివృద్ధి వాగ్దానాలను చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివరాలను అనుబంధం -2 గా సభా సమక్షంలో ఉంచడమయింది.

ఈ) ఆయా శాఖలు వివిధ పథకాల క్రింద కేటాయించిన నిధులను 20 బదలాంచదగని అభివృద్ధి వాగ్దానాలను సాధించడానికి ఒకే చోటకి చేర్చడవవుతుంది.

అనుబంధం - 2

## స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ సాధించే దిశగా స్మార్ట్ విలేజ్ - స్మార్ట్ వార్డ్

### 20 అభివృద్ధి వాగ్దానాలు (బదలాంచదగని)

1. మరుగుదొడ్డి, రక్షిత మంచినీరు, నిరంతర విద్యుత్తుతో అందరికీ గృహాలు.
2. ప్రతి కుటుంబం బహుముఖ జీవనోపాధి అవకాశాలు మరియు / లేదా సూక్ష్మ - వ్యవస్థలను కలిగి ఉండటం.
3. బ్యాంకు, మార్కెట్ అనుసంధానంతో స్వయం సహాయక బృందాలు, యువతకు నైపుణ్యాల అభివృద్ధి, గ్రామ వ్యవస్థను అందుబాటులో ఉంచడం.
4. బహిరంగ విసర్జనకు స్వస్తి పలకడం.
5. ఘన / ద్రవ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను నిర్వహణలో ఉంచడం.
6. నివారించదగు అన్ని మాతృ సంబంధ మరణాలు, శిశు మరణాలకు స్వస్తి చెప్పడం.
7. నూటికినూరు శాతం సంస్థాగత ప్రసవాలు.
8. 12వ తరగతి వరకు బాలురు, బాలికలలో బడిమానివేసే వారు లేకుండా చేయడం.
9. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, గ్రామ పంచాయతీ / వార్డు బిల్డింగులలో మరుగుదొడ్ల నిర్వహణ, తాగదగ్గ నీరు, విద్యుత్తును అందుబాటులో ఉంచడం.
10. పౌష్టికాహార లోపం లేకుండా చేయడం (9 సంవత్సరాలలోపు వయసు బాలలు).
11. బాల్యవివాహాలు జరగకుండా చూడటం (18 సంవత్సరాలలోపు వయస్సు బాలికలు)
12. ప్రతి క్షేత్రానికి భూసార పటిష్టత కార్డు, అత్యవసర సూక్ష్మ - పౌష్టిక అంశాలను అధికం చేయడం, పశుసంపద, వృక్షాలతో విస్తరణ.
13. గ్రామంలోని ప్రతి కుటుంబం బ్యాంకు ఖాతా / ప్రధానమంత్రి జన్‌ధన్ బ్యాంకు ఖాతా నిర్వహణను కలిగివుండటం.
14. ప్రతి గ్రామ పంచాయతీ / వార్డు, ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన తన సొంత క్రియాశీల అభివృద్ధి ప్రణాళికను కలిగి వుండటం.
15. ప్రతి గ్రామ పంచాయతీ / వార్డు తన భౌగోళిక సరిహద్దులు అంతటా పచ్చని చెట్లను కలిగివుండటం.
16. ప్రతి గ్రామ పంచాయతీ / వార్డు నీటి పరిరక్షణ నిర్వహణ, ఇంకుడు గుంతల వ్యవస్థను కలిగివుండటం.
17. ప్రతి గ్రామ పంచాయతీ / వార్డు సమాచార కేంద్ర నిర్వహణ, కంప్యూటర్ ల్యాబ్, మీ-సేవా కేంద్రాన్ని కలిగివుండటం.
18. ప్రతి గ్రామ పంచాయతీ / వార్డు టెలికాం / ఇంటర్నెట్ అనుసంధానాన్ని కలిగివుండటం.
19. కనీసం 2/3 హాజరులో, సంవత్సరానికి 4 సార్లు గ్రామసభ / వార్డు సభ నిర్వహణ.
20. ప్రతి గ్రామ పంచాయతీ / వార్డు సమస్యల నివారణ వ్యవస్థను కలిగివుండటం.

శ్రీ మహ్మద్ జానీ ః (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, (ఇ) ప్రశ్నకు సమాధానంలో చూసినట్లయితే 'రాష్ట్రంలో స్మార్ట్ విలేజ్ , స్మార్ట్ వార్డును సాధించడానికి 20 బదలాంచదగని అభివృద్ధి వాగ్దానాలను చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది అన్నారు . ఏ విధంగా 20 డిపార్టుమెంట్‌లను అభివృద్ధి చేస్తుందో మినిష్టర్‌గారు సమాధానం చెప్పవలసినదిగా కోరుతున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడు ః అధ్యక్షా, 20 చాలా పెద్ద లిస్టు ఉంది. ఆ లిస్టును గౌరవ సభ్యులకు నేను అందజేస్తాను. వీటికి కావలసినటువంటి నిధులు ఏ క్యాటగిరీ ఏ డిపార్టుమెంటు కిందకు వస్తుందో ఆ డిపార్టుమెంటు నుంచి పూల్ చేసి స్మార్ట్ విలేజ్, స్మార్ట్ వార్డును డెవలప్ చేస్తామని తెలియజేస్తున్నాను. వివరాలను అనుబంధం –2 లో ఇవ్వడం జరిగింది. 20 Development Commitments, Non-Negotiable

అని ఉన్నాయి. వీటికి ఒక్కొక్క డిపార్టుమెంట్ నుంచి ఒక్కొక్క యాక్టీవిటీ ఉంటుంది. అందుచేత వీటన్నింటిని కూడా పూల్ చేసి స్మార్ట్ విలేజ్ స్మార్ట్ వార్డుగా డెవలప్ చేస్తాము.

శ్రీ పి.జె. చంద్ర శేఖర రావు : స్మార్ట్ విలేజ్, స్మార్ట్ వార్డు డెవలప్‌మెంట్‌లో గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ దీంట్లో ప్రజాప్రతినిధులు, ఎం.పి.లు, ఎమ్.ఎల్.ఎలు, ఎమ్.ఎల్.సిలు భాగస్వాములు కావాలని వారు అభిప్రాయపడినారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులుగా ఉన్నటువంటి ఎమ్.ఎల్.ఎలుగా, ఎంఎల్‌సిలుగా మా పాత్ర ఏమిటి? మా పరిమితులు ఏమిటి? మాకు ఉన్నటువంటి బాధ్యతలు ఏమిటి అన్నటువంటి విషయం మీద మంత్రి గారు కొంత వివరణ ఇస్తే మా ఇన్‌వాల్వ్‌మెంట్‌ని ఎలా choose చేసుకోవాలి, ఎలా చేయగలుగుతాము, అక్కడ ఉన్నటువంటి అధికారులతో కలిసినప్పుడు మేము పరిధులను అతిక్రమించకుండా ఉండడానికి మా బాధ్యతలను జయప్రదంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుంది కాబట్టి ఆ వివరణను దయచేసి మంత్రిగారు ఇవ్వవలసినదిగా కోరుతున్నాను.

శ్రీ సింగం బసవ పున్నయ్య : (శాసనసభ నియోజక వర్గం) స్మార్ట్ విలేజ్ అంటే ఏమిటి? అసలు మాకు అర్థం కావడం లేదు.

ఛైర్మన్: అది తరువాత చెబుతారు.

శ్రీ యనమల రామకృష్ణుడు : స్మార్ట్ విలేజ్ అయితే గ్యాప్ అనాలిసిస్ చేసిన తరువాత ఆ విలేజ్‌లో కానీ, వార్డులో కానీ ఏవైతే చేయవలసిన పనులు ఉంటాయో అవన్నీ కూడా పూర్తి చేసి ఒక అందమైనటువంటి విలేజ్‌గా తయారు చేయాలి. ఒక అందమైనటువంటి వార్డుగా తయారు చేయాలి. అందు చేత దానికి పబ్లిక్ సహకారం అడిగాము. Representatives యొక్క సహకారం అడిగాము. అదేవిధంగా సి.ఎస్.ఆర్ క్రింద కంపెనీలను కూడా అడగటం జరిగింది. అదే విధంగా గవర్నమెంట్ తరఫున కొంత contribute ఇస్తాము. ఆ విధంగా contribute చేసినట్లయితే ప్రతివార్డు, ప్రతి విలేజ్ కానీ స్మార్ట్ విలేజ్‌గా స్మార్ట్ వార్డుగా తయారైతే రాష్ట్రం మొత్తం కూడా స్మార్ట్‌గా తయారవుతుంది. గౌరవ సభ్యులు చంద్రశేఖర్‌రావు అడిగిన దానికి ప్రతి పబ్లిక్ representatives కూడా వాళ్లకు నచ్చినటువంటి ఒక విలేజ్‌ను వార్డును అడాప్ట్ చేసుకోమన్నాము. వారికి ఉండేటువంటి influence తోటి లోకల్‌గా ఉండేటువంటి వాలంటరీ ఆర్గనైజర్స్‌ను కూడా దీంట్లో involve చేయాలి. వారు ఏదైనా ఫైనాన్స్ చేయగలిగితే వాళ్లు కూడా చేయవచ్చు. మేము కూడా పర్స్యూ చేసి గవర్నమెంటు తరఫున చేస్తాము. ఎవరైతే అడాప్ట్ చేసుకుంటారో వాళ్లే దానికి పూర్తి బాధ్యత వహించాలి. ఈ వివరాలన్నీ కూడా గౌరవసభ్యులకు పంపిస్తాము.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా ఇప్పుడు సొంత నియోజవర్గంలో చేసుకోవచ్చా? సొంత ఊరు అయినా ఫర్వాలేదా? మంత్రి గారు చెప్పిందేమంటే వాళ్లు సొంతంగా కొంత పెట్టుకొని కొంత సహకారాన్ని తీసుకొని కొంత ప్రభుత్వ పరంగా చేస్తామని చెప్పినట్టున్నారు. ఉదాహరణకు ఒక చిన్న ఊరు ఉంది. ఆ చిన్న ఊరులో ఒక లక్ష రూపాయలు మేము పెడతామనుకోండి ఒక రూ.20లక్షలు కావలసి వచ్చింది. పంచాయతి నుంచి కొంత తీసుకోవచ్చా? రెండవది గవర్నమెంట్ నుంచి ఏదైనా కమ్యూనిటీహాల్ కానీ, లైబ్రరీ కానీ , లేకపోతే ఏదైనా వాటర్ స్కీమ్ కానీ చేయడానికి దత్తత తీసుకోవడం అంటే అన్నీ సౌకర్యాలను ఆ ఊరికి కల్పించాలి. దానికి డబ్బు కేటాయింపులు అనేటువంటిది ఏవిధంగా చేసుకోవాలి? దత్తత తీసుకునే వాళ్లు సొంతంగా పెట్టుకోవాలా ? ప్రభుత్వానికి ఏమి హామి ఇవ్వాలి? మీరు ఏర్పాటు చేస్తారా?

శ్రీ ఆర్. రెడ్డపరెడ్డి : (నామినేటెడ్) Peoples Representative Participation అంటే గవర్నమెంటు వచ్చిన తరువాత డి.ఆర్.సి మీటింగులు లేవు. లెజిస్లేటర్లు, District Officers తో మీటింగులు కూడా లేవు.

జిల్లా పరిషత్ మీటింగులో మాట్లాడితే జెడ్.పి.సిలు ఏమో మీరు శాసనసభలో, శాసన మండలిలో మాట్లాడండి ఈ మీటింగులలో మాకు అవకాశం ఇవ్వండి అంటున్నారు. DRC was serving a very useful purpose ఎందుకంటే They were bringing the District problems, Mandal problems to the attention of the District Officers in the presence of the District Incharge Minister. ఇప్పుడు ఆ ఫోరమే పోయింది. దాని వల్ల జిల్లాలో చర్చించుకోవలసిన అంశాలన్నిటికి కూడా అవకాశం లేకుండా పోతుంది. శాసనమండలిలో కూడా ఆ అవకాశం రాదు. కాబట్టి ప్రభుత్వం జిల్లా అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేస్తే మనకు మాట్లాడే అవకాశం వస్తుంది. ఈ స్మార్ట్ విలేజ్ ఈ పథకాలన్నీ కూడా చర్చించి జిల్లా ఆఫీసర్లలో ఉండే indifference to Public Representatives పోతుంది. వాళ్లు కూడా బాధ్యతాయుతంగా సమాధానము చెప్పే విధంగా వ్యవహరిస్తారు.

ఉ. 10.30

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీమతి నన్నపనేని రాజకుమారిగారు చెప్పిన ట్లుగా, స్వంత గ్రామాలను దత్తత తీసుకోవడానికి ఏమీ అభ్యంతరం లేదు. ఇంతకు ముందు నేను జవాబు లోనే చెప్పాను. ప్రభుత్వానికి సంబంధించినంతవరకు ఈ 20 Non- Negotiable Development Commitments ఏవైతే ఉన్నాయో, వాటిని ప్రభుత్వం కొంతవరకు పూర్తిచేస్తోంది. అయితే, ఇక్కడ ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, ప్రజలను భాగస్వాములను చేయాలి. అలాగే, సిఎస్ఆర్ క్రింద కొన్ని కంపెనీలను, వాలంటరీ ఆర్గనైజేషన్స్‌ను కూడా భాగస్వాములను చేయాలి. వీరందరినీ భాగస్వాములను చేయడం ద్వారా ప్రభుత్వం పైన ఆర్థికంగా కొంత భారం తగ్గుతుంది. అందుచేత ఆ విధంగా ప్రజలను సమీకరి స్తున్నాం. పబ్లిక్ రెప్రజెంటేషన్ స్థానికంగా రెవ్యూ చేయవచ్చు. కొంతవరకు ఆర్థికంగా పూర్తి చేయడం వలన అవి కూడా ఎప్పుడో అప్పుడు ఉపయోగపడతాయి. వాటన్నింటిని ఎప్పటికప్పుడు రెవ్యూ చేయడానికి సర్పంచులకు, ఎం.ఎల్.ఎ.లు, ఎం.ఎల్.సి.లకు గాని అందరికీ స్థానికంగా ఉండే అవకాశం ఉంటుంది. ఆ విధంగా చేయడం వలన ప్రభావవంతంగా అనుకున్న సమయంలో అనుకున్నట్లుగా అన్నీ చేయడానికి అవ కాశం ఉంటుంది. ఇక మరొక అంశం ఏమిటంటే, డిడిఆర్‌సిలు పెట్టకూడదనే నిర్ణయం తీసుకున్నాము. There would not be any DRC's for future. దానికి ప్రధానమైన కారణం జిల్లా పరిషత్తులు ఉన్నాయి కాబట్టి, వాటిల్లో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తే బావుంటుంది. అందుచేత పేరలల్ బాడీ, డిడిఆర్‌సి వద్ద నేది ప్రభుత్వం సూత్రప్రాయంగా అనుకున్నాం.

డా. ఎం. గేయానంద్ : అధ్యక్షా, గత ప్రభుత్వంలో అభివృద్ధి నియోజక వర్గ నిధులు ఉండేవి. అయితే, గత ప్రభుత్వంలో కేటాయించిన నిధులు కొన్ని మంజూరయినవి కూడా ఉన్నాయి. మా అనంత పురంలో చాలా కారణాల వల్ల వాడుకోలేదు. అందుకు మంత్రివర్యులు శ్రీ గంటా శ్రీనివాసరావు కూడా ఒక కారణం. ఎందుకంటే, వారు ముందే రాజీనామా చేసేశారు. గతంలో ఆయన ఇన్‌ఛార్జ్ మినిస్టర్‌గా ఉండే వారు. ఆయన ఉన్నప్పుడే మేము సంతకం పెట్టించినా బిల్లు కాలేకపోయింది. అందువలన ఆ నిధులు ఆగిపోయాయి. నా రిక్వెస్టు ఏమిటంటే, గత ప్రభుత్వంలో కాన్‌స్టిట్యూషనల్ నిధుల క్రింద మంజూరయిన కొన్ని నిధులు ఆగిపోయి ఉన్నాయో, వాటిని తిరిగి ఈ స్మార్ట్ విలేజ్ పథకాలలో ఉపయోగించుకోవడానికి తగిన ప్రణాళికలు చేయవలసిందిగా తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, పాత ఏసిడిపికి సంబంధించినంతవరకు కూడా నిధులు పేమెంటు చేయాలనే ఒక నిర్ణయం తీసుకున్నాం. ఎస్‌డిఎఫ్ అంటే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ముఖ్య మంత్రిగారి దగ్గర ఉండేది. ఇవన్నీ ప్రతిపక్ష సభ్యులు సి. రామచంద్రయ్య గారికి తెలుసు. వాటికి సంబంధించిన నిధులు సుమారు రూ.174కోట్లు మా దగ్గర ఉన్నాయి. అలాగే, ఏసిడిపి క్రింద సుమారు

రూ.104కోట్లు బాకీలు ఉన్నాయి. ఎంత బాకీలు ఉంటే, అంత ఎస్‌డిఎఫ్ క్రింద నిధులు తీసుకుని ఇచ్చేయమని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయబోతున్నాము. త్వరలోనే వారికి ఆదేశాలు ఇస్తాము. మా దగ్గర నుంచి ఫైలు వెళ్ళింది. ముఖ్యమంత్రిగారి దగ్గర అప్రూవల్ గురించి ఆ దస్త్రం ఉంది. ఆ అప్రూవల్ రాగానే జిల్లా కలెక్టర్లు అందరికీ ఆదేశాలు జారీచేస్తాము. అలాగే, ఏసిడిపి పనులు సుమారు 50 శాతం వరకూ పెండింగ్ ఉన్నాయో, వారందరికీ చెల్లించ మన్నాము. ఇంకా ప్రారంభం కాని వాటిని మాత్రం లెక్క లోకి తీసుకోవద్దని చెప్పాము. అయితే, ఈ సంవత్సరం మాకుండే ఆర్థిక ఇబ్బందుల వలన ఏసిడిపి గ్రాంట్లు ఇవ్వడం లేదు కానీ, ఎస్‌డిపి సుమారు రూ.500కోట్లు బడ్జెటులో కేటాయించాము.

MR. CHAIRMAN : Next Questions No. 73, 74 Postponed at the request of the Hon'ble Members.

## ముస్లిం బాలికల వివాహాలకు గాను ఆర్థిక సహాయం

ప్రశ్న నెం. 7951(75)

సర్వశ్రీ సి. నారాయణ రెడ్డి, ఆదిరెడ్డి అప్పారావు, మేకా శేషుబాబు, ఎం.ఎల్.సి.లు.,

గౌరవనీయులైన సమాచార, పౌర సంబంధాలు, మైనారిటీల సంక్షేమం మరియు సాధికారత శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) పేద ముస్లిం బాలికల వివాహాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం ప్రకటించిన విషయం వాస్తవమేనా?

(ఆ) అయితే, సమకూర్చిన మొత్తం పరిమాణం మరియు లబ్దిదారుల సంఖ్య ఎంత?

(ఇ) ముస్లిం సమాజం సంక్షేమం కోసం తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన సమాచార, పౌర సంబంధాలు, మైనారిటీల సంక్షేమం & సాధికారత శాఖ మంత్రి (శ్రీ పల్లె రఘునాథరెడ్డి):

(అ) అవునండీ.

(ఆ) 2014-15 సంవత్సరానికి, ముస్లిం బాలికల సామూహిక వివాహాలను నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.59.86 లక్షల మొత్తాన్ని సమకూర్చడమయింది. ఆ మొత్తంలో, వైఎస్ఆర్ కడప జిల్లాలో 21 సామూహిక వివాహాల కోసం రూ.5.85 లక్షలు ఖర్చు చేయడ మయింది. మిగిలిన జిల్లాలలో సామూహిక వివాహాల నిర్వహణ ప్రాసెస్‌లో ఉంది.

(ఇ) ముస్లిం సమాజం సంక్షేమం కోసం ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకుంటున్నది.

1. ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్, ట్యూషన్ ఫీజు నిర్వహణ క్రింద ముస్లిం మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను సమకూర్చుతున్నది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది.
2. ముస్లింల సంక్షేమం కోసం బ్యాంకు అనుసంధాన సబ్సిడీ పథకం
3. ముస్లిం సమాజం కోసం మైనారిటీ సంక్షేమ హాస్టళ్ళు, నైవాసిక పాఠశాలలను ఏర్పాటు చేయడమయింది.
4. నిరుద్యోగ మైనారిటీ యువతకు 36 ఉర్దూ కంప్యూటరు శిక్షణా కేంద్రాలు, 36 ఉర్దూ గ్రంథాలయాలను ఏర్పాటు చేయడమయింది.
5. కర్నూలు, గుంటూరు, విశాఖపట్టణంలలో పోటీ పరీక్షలకు హాజరవ్వడం కోసం మైనారిటీల విద్యాభివృద్ధి కేంద్రం ముస్లిం మైనారిటీలకు శిక్షణ ఇస్తున్నది.

శ్రీ సి. నారాయణ రెడ్డి : (స్థానిక సంస్థల నియోజక వర్గం – వైఎస్ఆర్ కడప) అధ్యక్షా, పేద ముస్లిం మహిళలకు పెళ్ళిళ్లు చేయడం అది ఒక వరం లాంటిది. గతంలో ఈ ప్రభుత్వం మేనిఫెస్టోలో రూ.50,000లు చేస్తామని చెప్పడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం కూడా వారికి రూ.50,000లు కేటాయించింది. ఈ ప్రభుత్వం కూడా మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.50,000లు చేసి మరింత మంది పిల్లలకు అవకాశం కల్పించాలని కోరుకుంటున్నాను.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి : అధ్యక్షా, జీ.వో.ఆర్.టి. నెం. 123 ద్వారా 24-4-2012వ తేదీన మైనారిటీ సంక్షేమ శాఖ రాష్ట్రంలోని పేద, ముస్లిం బాలికల వివాహాల కోసం ఇచ్చే సహాయాన్ని రూ.15,000 నుంచి రూ.25,000లకు పెంచడం జరిగింది. ఇప్పుడు ఈ రాష్ట్రప్రభుత్వం కూడా మైనారిటీ బాలికల పట్ల సానుభూతితో నలుగురు సభ్యులతో కూడిన ఒక కమిటీని వేయడం జరిగింది. వారి వివాహాన్ని ఏ విధంగా చేయాలో పలు సూచనలను చేయమని కోరితే, ఆ కమిటీ 3 సూచనలు చేసింది. అందులో ఒకటి రూ.25,000ల నుంచి రూ.50,000లకు పెంచాలనే సూచన. రెండవది, ఆ ఇచ్చే సొమ్ము వారి సామానుల కొనుగోలుకు కాకుండా, పేద ముస్లిం మహిళ యొక్క బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేయమని చెప్పడం. మరొకటి సామూహిక వివాహాలు కేంద్రంలో ఒకే చోట నిర్వహిస్తున్నారు కాబట్టి, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు రాలేరు, వారికి కొంత ఇబ్బందికరంగా ఉంటుంది కాబట్టి, వారికి ఇండివిడ్యువల్‌గా ఇవ్వాలనే సూచన చేయడం జరిగింది. ఈ సూచనలు ప్రభుత్వం యొక్క పరిశీలనలో ఉన్నాయి. ప్రభుత్వం కూడా రూ.25,000ల నుంచి రూ.50,000లు చేసే ఆలోచనతో ముందుకు వెడుతోంది. కమిటీ సిఫారసు చేసిన సూచనలను తు.చ. తప్పకుండా అమలు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు వెడుతోంది.

శ్రీ మహ్మద్ జానీ : అధ్యక్షా, బెంగాల్‌లో ముస్లిం బాలికల వివాహాల కోసం రూ.50,000లు ఇస్తామని జీవో ఇచ్చి, ఆ డబ్బులు ఇస్తున్నారు. ఈ విధానం మనం కూడా పెడితే సబబుగా ఉంటుంది. కాబట్టి, రూ.50,000లను పెంచమని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి : అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన సూచనను గుర్తుపెట్టుకుంటాము. తప్పకుండా ఆయన చెప్పిన సూచనలను ప్రభుత్వం అమలుచేస్తుంది.

డా. ఎం. గేయానంద్ : అధ్యక్షా, రాయచోటిలో ముస్లిముల హై స్కూల్ ఉంది. వాళ్ళు జూనియర్ కళాశాల కావాలని అడుగుతున్నారు. అలాగే, కర్నూలు, అనంతపురంలలో కూడా ఈ సమస్య ఉంది. ఎక్కడైతే మైనారిటీ హైస్కూల్ ఉందో, అక్కడ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి : అధ్యక్షా, ముస్లిం మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు చిత్తూరు, కర్నూలులోను, గుంటూరులో మహిళా జూనియర్ కళాశాలలు, మహిళా పాఠశాలలు ఉన్నాయి. అదేవిధంగా, అనంతపూర్, కర్నూలు, కృష్ణా, నెల్లూరులో బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. సభ్యులు చెప్పిన ప్రదేశాలలో రాయచోటి మిగిలిన ప్రాంతాలలో కొన్ని కండిషన్లు ఉన్నాయి. బాలికల సంఖ్య, అక్కడి ఫీజిబులిటీ మొదలైనవన్నీ పరిగణనలోకి తీసుకుని, తప్పకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసు కుంటుంది.

## గ్రామీణ ప్రాంతాలకు మినీ బస్సులు

ప్రశ్న నెం.8165 (76)

శ్రీ మెట్టు గోవింద రెడ్డి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన రవాణా, రోడ్లు & భవనాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) గ్రామీణ ప్రాంతాలలో పల్లెవెలుగు, మినీ బస్సులను ఎక్కువ సంఖ్యలో సమకూర్చడానికి ప్రతిపాదన ఏదైనా ఉందా?

(ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన రవాణా, రోడ్లు & భవనాల శాఖ మంత్రి (శ్రీ సిద్ధా రాఘవరావు):

(అ) అవునండీ.

(ఆ) గ్రామీణ రూట్లలో నడపడానికి 2014-15 సంవత్సరంలో రాష్ట్రంలో 22 పల్లెవెలుగు బస్సులను పెంచడానికి ఆమోదం ఇవ్వడమయింది. అంతేకాకుండా, 2014-15 గిరిజన ఉప-ప్రణాళిక క్రింద మరో 12 మినీ బస్సులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమయింది.

ఉ.10.40

శ్రీ మెట్టు గోవిందరెడ్డి : అధ్యక్షా, ప్రభుత్వం వారు 2015-2016 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలు చేశారు. అయితే, 2014-2015 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 22 పల్లెవెలుగు బస్సులను పెంచడానికి ఆమోదించామని మంత్రి గారు సమాధానంలో చెప్పారు. అయినా, అది లెక్కలోకి కూడా రాదు. మినీ బస్సుల విషయానికి వస్తే, ఇప్పటికే గ్రామాల్లో ఆటోరిక్షాలు ఎక్కువున్నాయి. 6 మంది కూర్చోవాల్సిన ఆటోల్లో, 30, 40 మంది కూర్చుంటున్నారు. ప్రతిరోజూ యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. మా రాయదుర్గం నియోజకవర్గంలో నెలలో నలుగురు చనిపోయారు. అందువల్ల, గ్రామీణ ప్రాంతాల్లో మినీబస్సులు చాలా అవసరం.

మరొక విషయమేమంటే, స్కూల్ టైములో బస్సులు ఉండటం లేదు. ఉదయం 9 గంటలకు స్కూలుంటే, పొద్దున్నే 6 గంటలకే బస్సుంటే, పిల్లవాళ్లు 6 గంటలకే వెళ్లి కూర్చోవాల్సి వస్తోంది. సాయంత్రం 7 గంటలకు రిటర్న్ బస్సులు ఉంటున్నాయి. పిల్లలకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉంటున్నాయి కాబట్టి, ప్రభుత్వం ఆదాయంతో సంబంధం లేకుండా స్కూలు టైముకే బస్సులు నడిపేలా చూడాలి. ఈ అకడమిక్ ఇయర్ ఎలాగూ అయిపోయింది కాబట్టి, వచ్చే అకడమిక్ ఇయర్ నుండైనా తప్పనిసరిగా ప్రతి గ్రామం నుండి స్కూలు టైముకే బస్సులు నడిపేందుకు ఏమన్నా ప్రతిపాదలు మీ వద్ద ఉన్నాయా? ఆ విషయంలో తీసుకున్న చర్యలేమిటో తెలియజేయాల్సిందిగా మంత్రి గారిని మీ ద్వారా కోరుతున్నాను. ముందే చెప్పినట్లుగా, మినీబస్సులు కూడా చాలా అవసరం. ఎందుకంటే, గ్రామీణ ప్రాంత రోడ్లపై ఆటోలకు ఆల్టర్నేట్‌గా పెద్ద బస్సులు నడపడం కష్టం కాబట్టి, మినీ బస్సులైతే లాభదాయకంగా ఉంటుంది, కొంత మేరకు ఖర్చులు కూడా తగ్గుతాయి కాబట్టి, ప్రతి మండల హెడ్‌క్వార్టర్‌కు, ప్రతిస్కూలుకు పోయే విధంగా మినీబస్సులను ఏర్పాటు చేయాల్సిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః అధ్యక్షా, ఇప్పుడు పరిస్థితి ఎట్లా ఉందంటే – రోడ్డు లేకపోతే బస్సులు రావడం లేదు. బస్సులు రావడం లేదు కాబట్టి, ఆటోలు నడపాల్సి వస్తోంది. బస్సుకన్నా ఆటోచార్జీలు తక్కువ కాబట్టి, జనం ఆటోలు ఎక్కుతున్నారు. బస్సు రోడ్డు మీద దించి వెళుతుంది. ఆటో ఇంటి దాకా వచ్చి దించి వెళుతుంది. ఇది రాష్ట్రంలో ఉన్న ప్రధానమైన సమస్య. దీని మూలంగా ఏమౌతోందంటే, ఆర్టీసీ బాగా నష్టపోతోంది. కాబట్టి, రోడ్లు మరియు భవనాల శాఖ కూడా ప్రస్తుతం రవాణా శాఖామాత్యుల గారి శాఖ క్రిందకే వస్తుంది కాబట్టి, ముందు రోడ్లు బాగు చేయిస్తే గాని అక్కడ బస్సులు

పోవు. వర్షాకాలం కాబట్టి, వేసవి వచ్చినందున యుద్ధప్రాతిపదికన దెబ్బతిన్న రోడ్లని బాగు చేయించాలని మీ ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

రెండవదేమంటే, రోడ్లు బాగుంటే బస్సు వెళుతుంది. ఆటోకన్నా బస్సు చార్జీ ఎక్కువ అనే భావన కూడా ప్రజల్లో ఉంది గనుక ఆ చార్జీలను ఏమన్నా తగ్గించే ఆలోచన ఉందా? బస్సుల్లేక ఆ ఊర్లకి టీచర్లు కూడా వెళ్లడం లేదు. పిల్లలు కూడా స్కూళ్లకు వెళ్లని పరిస్థితి ఉంటోంది. అందువల్ల, ఆటోల్లో 20, 30, 40 మంది ఎక్కుతున్నారంటే, అది గోతాంలో మొక్కజొన్న కంకుల్ని కుక్కినట్లుగా ఉంటోంది. ఎన్ని యాక్సిడెంట్లు జరుగుతున్నాయో చెప్పడానికి కూడా వీల్లేదు. దీన్ని కంట్రోలు చేసే పద్ధతి ఏమన్నా ఉందా? అసలు, ఆటోలకు పర్మిషన్లు ఎవరిస్తున్నారు? ఎట్లా ఇస్తున్నారు? ఆటోలకు పర్మిషన్లు ఇవ్వకపోతే యూనియన్ల వారు గొడవ చేస్తున్నారు. పోనీలే అని పర్మిషన్లు ఇస్తే, ఇలా ఎంతమందిని పడితే అంతమందిని ఎక్కించుకుంటున్నారు. కనీసం, ఇంత మంది ఎక్కకూడదనే నిబంధనలన్నా ఉండాలి. అలాగే, రోడ్లను బాగు చేయాలి, గ్రామాలకు బస్సులను నడపాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ శిద్ధా రాఘవరావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ మెట్టు గోవిందరెడ్డి గారు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతున్నాను. అధ్యక్షా, రాష్ట్రంలో మొత్తం 12,204 బస్సులుంటే, అందులో 6,000 పల్లెవెలుగు బస్సులు. అంటే 50 శాతం బస్సులు పల్లె వెలుగుకు కేటాయించడం జరిగింది. మేము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో సుమారు 200 పల్లెవెలుగు బస్సులు ప్రవేశ పెట్టడం జరిగింది. ఎందుకంటే, గత ప్రభుత్వంలో రోడ్లు బాగా డ్యామేజ్ అవ్వడం మూలంగా, రోడ్లు సరిగ్గా లేవనే కారణంతో చాలా సర్వీసులు ఆపివేయడం జరిగింది. మేము అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో మా ముఖ్యమంత్రి గారు ఏమన్నారంటే – ఆర్టీసీకి నష్టం వచ్చినా ఫర్వాలేదు, గ్రామీణ ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయమని వారు ఆదేశాలివ్వడం జరిగింది. దాంట్లో భాగంగా కొన్ని డిపోలు కూడా మేము ఓపెన్ చేశాము. పల్లెవెలుగు బస్సులు కూడా ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలో ఉన్న బస్సుల్లో 50 శాతం బస్సులు పల్లె వెలుగుకు కేటాయించాము. ఇటీవల ఈ సంవత్సరంలోనే 709 బస్సులు మనకు రావడం జరిగింది. అందులో 494 బస్సులు పల్లె వెలుగు సర్వీసులకు, ఎక్స్‌ప్రెస్ బస్సులు 294, తెలుగు వెలుగు బస్సులు 13, ఎక్స్‌ప్రెస్ బస్సులు 12, డీలక్స్ 116, సూపర్ లగ్జరీ 103, సప్తగిరి 11, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ 30, జెఎన్ఎన్‌యూఆర్ఎం 30 చొప్పున బస్సుల కేటాయింపులు చేశాము. ఇవేకాకుండా, ఈ నెల, వచ్చే నెలలో దాదాపు 300 బస్సులు రాబోతున్నాయి. పాత బస్సులన్నీ ఆపేసి, కొత్త బస్సులు ఇవ్వాలని భావిస్తున్నాము. పల్లె వెలుగు బస్సులను అన్ని గ్రామాలకు పంపిస్తాము, ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రయత్నం చేస్తాము.

అలాగే, గౌరవ సభ్యురాలు శ్రీమతి నన్నపనేని రాజకుమారి అడిగిన విషయానికి సంబంధించి, ముందు రోడ్ల మరమ్మతులు పూర్తి చేసుకుని, బస్సులు తిప్పండని వారన్నారు. వాస్తవానికి రోడ్ల మీద మేము గత 9 నెలల నుండి ప్రతిచోటా బీటీ లేయర్ వేసుకోవడం వంటి ప్రయత్నాలన్నీ చేస్తున్నాము. ఈ సంవత్సరం కూడా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాము. ముఖ్యమంత్రి గారు కూడా రోడ్ల మీద బాగా దృష్టి పెట్టడం జరిగింది. అందువల్ల మేము కూడా ఆలోచిస్తున్నాము. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నాయి కాబట్టి, కొన్ని రోడ్లను బిపిటి, మరికొన్ని రోడ్లను పిపిపి, యాన్యుటీ పద్ధతిలో చేపట్టాలని ప్రణాళికలు తయారు చేసుకుని, రాబోయే రోజుల్లో రోడ్లని డెవలప్ చేసుకుని ముందుకు వెళతాము.

ఈ మధ్య కాలంలో గౌరవ సభ్యులు చెప్పిన ప్రకారం ఆటోలకు సంబంధించిన యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయి. దీని మీద కూడా మొన్న మీటింగ్ పెట్టి, స్పెషల్ డ్రైవ్ చేపట్టి, సుమారు 25,000 కేసులు నమోదు చేయడం జరిగింది. కేసులు నమోదైన వాటిలో ఆటోలే 8,000 ఉన్నాయి. వీటి మీద కూడా స్పెషల్ డ్రైవ్ పెడుతున్నాం. యాక్సిడెంట్స్ జీరో పర్సంట్ కోసం ప్రయత్నం చేస్తున్నాము. రోడ్లు

బాగు చేయడంతోబాటు, బస్సులు మొదలైనవి అన్నీ కూడా గ్రామాలకిచ్చి ఆదుకుంటాము. స్కూల్ టైంకు బస్సులు కావాలని గౌరవ సభ్యులు అడగడం జరిగింది. తప్పకుండా వాటిని కూడా పరిశీలించి, సంబంధిత డిపో మేనేజర్లకు ఆదేశాలిచ్చి, స్కూల్ టైమింగ్స్‌కు బస్సులు నడపాలని ఆదేశాలిస్తాము.

శ్రీమతి పి.శమంతకమణి : అధ్యక్షా, మినిస్టర్ గారు టైం ప్రకారం బస్సులు నడుపుతామని చక్కగా చెప్పడం జరిగింది. కొన్నిచోట్ల టైం ప్రకారం అనేది కాదు గానీ, రావాల్సిన చోటకి బస్సులు రావడం లేదు. ఒక హైస్కూలు ఉంటే, ఆ హైస్కూలుకు సంబంధిత గ్రామాల నుండి విద్యార్థులు రావడం జరుగుతోంది. ముఖ్యంగా కుట్లూరు మండలంలో, ఎల్లుట్ల అనే మారుమూల గ్రామముంది. అక్కడొక హైస్కూలు ఉంది. ఆ హైస్కూలుకు 60 మంది ఆడపిల్లలు దగ్గర్లోని మడుగుపల్లి, మడ్డిపల్లి వంటి చుట్టుప్రక్కల గ్రామాల నుండి వెళతారు. వారికి సాయంకాలం పూట బస్సు రానందువల్ల, అక్కడ నుండి ప్రైవేటు క్లాసు ముగించుకుని, చీకట్లో వాళ్లు నడుచుకుంటూ ఇళ్లకు రావడమంటే ఎంత దారుణంగా ఉంటుందో ఆలోచించండి. చాలాసార్లు మేము ఆర్ఎం గారికి చెప్పాము. కానీ, దాని మీద స్పష్టమైన చర్యలేమీ తీసుకోవడం లేదు. ఇప్పటికే, 60 మంది ఆడపిల్లలు చీకట్లో నడుచుకుంటూ రావడం, సైకిళ్ల మీద రావడం జరుగుతోంది. కాబట్టి, దయచేసి హైస్కూళ్లు ఉన్నచోట టైం ప్రకారం బస్సులు నడిచే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ సింగం బసవ పున్నయ్య: అధ్యక్షా, పల్లెవెలుగు అని పల్లెటూళ్లలో నడిపే బస్సులున్నాయి కదండీ. పల్లెటూళ్లలో పేదవారు ఎక్కువ మంది ఉంటారు గనుక, వాళ్లకు ఛార్జీలు లేకుండా తీసుకువచ్చే ప్రపోజల్ ఏమన్నా ఉందా? అని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ మెట్టు గోవిందరెడ్డి: అధ్యక్షా, విద్యాశాఖామంత్రి గారు కూడా ఇక్కడే ఉన్నారు. ఆయనకు నేను మనవి చేసేదేమంటే – ఆర్టీసీ, ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు రెండూ కలిసి కరెక్టుగా స్కూళ్లకు బస్సులు పోయే విధంగా చూస్తే బాగుంటుంది. ఆర్టీసీపైన భారం తగ్గించే విధంగా, విద్యార్థులకు ఇచ్చే పాసులపై ప్రత్యేకంగా 50 శాతం రాయితీని విద్యాశాఖ భరించినట్లయితే, ఆర్టీసీ కూడా బ్రహ్మాండంగా నడుస్తుంది. ఇప్పటికే ఇస్తున్న పాసులు కొన్ని ఉన్నాయి. ఇప్పుడున్న ఎడ్యుకేషన్ సిస్టంలో, జూన్ నాటికి స్కూళ్ల తెరిచే సమయానికి బస్సులు కరెక్టుగా అన్ని స్కూళ్లకు పోయే విధంగా ప్లాన్ చేయాలి. ఎందుకంటే, ప్రభుత్వం ఎడ్యుకేషన్ మీద రూ.18,000 కోట్లు ఖర్చుపెట్టి, ఫస్ట్ ప్రయారిటీ ఇస్తోంది కాబట్టి, పిల్లల చదువు ముఖ్యం కాబట్టి, సమయానికి స్కూళ్లకు బస్సులు వెళ్లేలా విద్యాశాఖ, ఆర్టీసీ వారు కలిపి చర్యలు తీసుకుంటే బాగుంటుందని మనవి చేస్తున్నాను.

శ్రీ శిద్ధా రాఘవరావు: అధ్యక్షా, గౌరవ సభ్యురాలు శ్రీమతి పి.శమంతకమణి గారు అడిగినట్లు, ఎల్లుట్ల హైస్కూలు దగ్గర సమస్య ఉంది. ఇదే కాదు. రాష్ట్రంలో అన్ని చోట్ల ఇలానే ఉందని గౌరవ సభ్యులు అడుగుతున్నారు. మా ఆర్టీసీ ఎండీ గారు ఇక్కడే ఉన్నారు. వారితో చెప్పి, ఆర్ఎంలందరితో మాట్లాడి ఎక్కడెక్కడైతే హైస్కూళ్లు, కాలేజీలు ఉన్నాయో అక్కడ ఉదయం, సాయంత్రం టైమింగ్స్ మెయింటెయిన్ చేసి, బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని నేను వారికి ఆదేశాలివ్వడం జరుగుతుంది. వాళ్లు భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ముందుకు తీసుకువెళతారు. అలాగే, సభ్యులు శ్రీ సింగం బసవపున్నయ్య గారు గ్రామాల్లోని పేద వాళ్లను ఫ్రీగా పల్లెవెలుగు బస్సుల్లో తీసుకువెళ్లాలని చెబుతున్నారు. ఆర్టీసీ విషయానికివస్తే, పేదవాళ్లకైనా, గొప్పవాళ్లకైనా ఒక పద్ధతి ప్రకారం వెళ్లవలసిన అవసరముంది. వారికి అన్ని విషయాలూ తెలుసు. ఏదేమైనా ఆర్టీసీని పటిష్టం చేసి, ఇటు పల్లెవెలుగు బస్సులు గానీ, అటు లగ్జరీ బస్సులు గానీ, ఓల్వో బస్సులు గానీ కొత్తవి ప్రవేశపెట్టి, ప్రజా రవాణాకు ఇబ్బందులు కలుగకుండా ఈ రాష్ట్ర

ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుని ముందుకు పోతుందని సభాముఖంగా తెలియపరుస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

ఉ. 10.50, 11.00

డా. ఎం. గేయానంద్ : అధ్యక్షా, విద్యా శాఖతో కో-ఆర్డినేట్ చేసుకొని వచ్చే విద్యా సంవత్సరంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులందరికి బస్సులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ శిద్దా రాఘవరావు : అధ్యక్షా, గౌరవ సభ్యులు గేయానంద్ గారు చెప్పినట్లు తప్పకుండా విద్యా శాఖతో కో-ఆర్డినేట్ చేసుకొని భవిష్యత్తులో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్లాన్ చేసుకుంటామని తెలియజేస్తున్నాను.

MR. CHAIRMAN : Question Nos. 8145 (77) & 7931(78) postponed at the request of the Members. Now, Question No. 8062 (79)

## ఉపాధ్యాయుల కొరత

ప్రశ్న నెం. 79 (8062)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి, ఎం.ఎల్.సి,

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ గంటా శ్రీనివాసరావు) :

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, ఈ హాలు ఎంత కూల్‌గా ఉందో అంత కూల్‌గా మంత్రి గారు సమాధానం చెప్పారు. మొదటి ప్రశ్నకు లేదని, రెండవది ఉత్పన్నం కాదని అన్నారు. ఎన్నికల సమయంలో మంత్రి గారిని కూడా గ్రామాలలోని ప్రజలు టీచర్ల గురించి అడిగే ఉంటారు. గ్రామాలలోని పాఠశాలలను చూస్తే అక్కడ కొన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులే లేరు. సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల ఆయా సబ్జెక్టులలో పిల్లలకు మార్కులు తక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు కొంచెం చదువుకున్న వారైతే ఆ సబ్జెక్టుల గురించి వారి పిల్లలకు చదువు చెబుతారు. చదువులేని తల్లిదండ్రులైతే ఆ పిల్లలకు చెప్పే వారెవరూ ఉండరు. అప్పుడు ఆ పిల్లలకు మార్కులు కూడా తగ్గిపోతాయి కాబట్టి గ్రామీణ ప్రాంతాలలో కాని, మండల కేంద్రాలలో ఉన్న పాఠశాలల్లో కాని తప్పనిసరిగా అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండేటట్లు చూడాలి. సమస్య ఎక్కడుందంటే.. ఇంతకుముందు కూడా చెప్పాను. ఆర్ అండ్ బి శాఖకు, విద్యా శాఖకు అనుబంధం ఉంది. రోడ్లు సరిగా లేకపోవడం వల్ల బస్సులు గ్రామీణ ప్రాంతాలకు తిరగడం లేదు. బస్సులు లేకపోవడంతో ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలల్లో పనిచేయడానికి ఇష్టపడడం లేదు. గ్రామాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న మాట వాస్తవం. వాళ్ల బదిలీ విషయంలో రాజకీయ నాయకులే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, వారు గ్రామీణ ప్రాంతాలలో పని చేయకుండా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు మున్సిపల్ పాఠశాలల్లో

పనిచేయడానికి వస్తామంటే మున్సిపల్ శాఖ మంత్రి గారు ఒప్పుకోరు. పంచాయతీ పాఠశాలల్లో పనిచేయడానికి టీచర్లకు నచ్చచెప్పే పరిస్థితిలో ప్రజాప్రతినిధులు లేరు. ఉపాధ్యాయులు లేకపోవడమనే అలవాటు గత ప్రభుత్వంలో ఏదైతే ఉందో కొత్త ప్రభుత్వం వచ్చినా కూడా భర్తీ చేయలేనటువంటి పరిస్థితి ఉంది. ఒకవేళ అక్కడకు బదిలీ చేసినా వారు అక్కడ పనిచేయలేని పరిస్థితి ఉంది. అందువల్ల, భార్యాభర్తలు ఒకచోట పనిచేసే విషయంలోనైనా కొంత కాంప్రమైజ్ అవచ్చు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని పట్టణ ప్రాంతాలలోనే ఉంచండి. ఎవరైతే కొద్దిగా ఓపిక ఉన్నవాళ్లు, వెళ్లగలిగిన వారు, చిన్న వయస్సులో ఉన్న వారిని ఎంపిక చేసి గ్రామీణ ప్రాంతాలలో పనిచేసేటట్లు చర్యలు తీసుకోవాలి. కచ్చితంగా గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలల్లో, మండల కేంద్రాలలోని పాఠశాలల్లో, పంచాయతీ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది కాబట్టి ఆ కొరతను తీర్చవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ మెట్టు గోవింద రెడ్డి : (స్థానిక సంస్థల నియోజక వర్గం – అనంతపురం) అధ్యక్షా, ఉపాధ్యాయుల కొరత లేదని మంత్రి గారు చెబుతున్నారు. మేము గ్రామాలకు వెళితే ముందుగా చెప్పేది టీచర్లు లేరని. ఒక స్కూల్లో 365 మంది పిల్లలుంటే ఒకే ఒక టీచరున్నారు. కొన్ని స్కూళ్లల్లో 100 మంది విద్యార్థులుంటే అక్కడ ఐదారుగురు టీచర్లుంటారు. అదేమంటే.. ఉపాధ్యాయులు అక్కడ పని చేయడానికి ఇష్టపడాలి, రూల్సు, రెగ్యులేషన్స్ చూచుకొని చేయాలని అనేక రకాలైన సమస్యలు ప్రస్తావిస్తారు. ఆ విధంగా కాకుండా, ఒక రకమైన నిష్పత్తిని నిర్ణయించి వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా అన్ని రకాల పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండే విధంగా చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, మంత్రి గారిని ఆకస్మిక తనిఖీలు చేయమనండి. అప్పుడే ఉపాధ్యాయుల హాజరు ఉందా, లేదా అనేది తెలుస్తుంది. మంత్రి గారు చెబుతున్నది తప్పు అని అనను కాని, రికార్డులలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండి వారు పాఠశాలలకు వెళ్లకపోవచ్చు. కాని, గ్రామీణ ప్రాంతాలలో టీచర్లు లేరనే ఫిర్యాదులు చాలా ఉన్నాయి. మంత్రి గారు పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేయాల్సిన అవసరముంది.

శ్రీ గంటా శ్రీనివాసరావు : అధ్యక్షా, రాజకుమారి గారు, గోవిందరెడ్డి గారు చెప్పిన విషయాలలో కొంత వాస్తవం ఉంది. అయితే, కొత్తగా ఏర్పడిన ఈ ప్రభుత్వం విద్యకు ఎంత ప్రాధాన్యాన్ని ఇస్తుందో సభ్యులు గమనించే ఉంటారు. బడ్జెట్‌లో ఎక్కువ నిధులను విద్యా రంగానికే కేటాయించడం జరిగింది. రాష్ట్రాన్ని ఒక నాలెడ్జ్ రాష్ట్రంగా, ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని, అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని మన ముఖ్యమంత్రి గారు నారా చంద్రబాబునాయుడు గారు చెప్పడం జరిగింది. అవసరమైతే ఇంకా ఎక్కువ నిధులను మంజూరు చేస్తామని చెప్పడం జరిగింది. Right to Education Act ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికలకు సంబంధించి టీచర్, విద్యార్థుల నిష్పత్తిని కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ప్రాథమిక పాఠశాలల్లో 1:30, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1: 35 ఉండాలని చెప్పింది. ఒక టీచర్‌కు 30 మంది పిల్లలు, ఒక టీచర్‌కు 35 మంది పిల్లలు ఆ పాఠశాల స్థాయిని బట్టి ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం నార్మ్స్ పెట్టింది. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయులు, పిల్లల నిష్పత్తిని చూస్తే.. ప్రాథమిక పాఠశాలల్లో 1:22 నిష్పత్తి ఉంది. అంటే, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నార్మ్స్ ప్రకారం 1:30 అయితే, మన రాష్ట్రంలో 1:22 నిష్పత్తి ఉంది. ప్రాథమికోన్నత పాఠశాలలను తీసుకుంటే 1:20 ఉంది. ఉన్నత పాఠశాలలను తీసుకుంటే 1:24 ఉంది. ఏ విధంగా తీసుకున్నా, జాతీయ స్థాయిలో రైట్ టు ఎడ్యుకేషన్ చెప్పిన దాని కన్నా ఇంకా బెటర్‌గానే మన దగ్గర రేషియో ఉంది. అయితే, ఇంతకుముందు గౌరవ సభ్యులు గోవింద రెడ్డి గారు ఒకచోట 300 మంది పిల్లలుంటే ఒక టీచర్ ఉన్నారని చెప్పారు. అలాగే, రాజకుమారి గారు కూడా చెప్పారు. మనకు కూడా కొన్ని ఇబ్బందులున్నాయి. కొన్ని పాఠశాలల్లో పిల్లలు

ఎక్కువ ఉన్న దగ్గర టీచర్లు తక్కువగా ఉన్నారు. పిల్లలు తక్కువగా ఉన్నచోట టీచర్లు ఎక్కువగా ఉన్నారు. ఆరుగురు టీచర్లుంటే పది మంది పిల్లలున్న పాఠశాలలు కూడా ఉన్నాయి. కొన్ని ఇబ్బందులు ఉన్న మాట వాస్తవం. గత సంవత్సరమే రేషనైలేజేషన్ చేయాల్సి ఉంది. ఎక్కడైతే ఎక్కువ మంది టీచర్లున్నారో వారిని తక్కువ టీచర్లు ఉన్న చోట సర్దుబాటు చేయాలని నిర్ణయం తీసుకున్నా, గత సంవత్సరం సమైక్య రాష్ట్ర ఉద్యమం వల్ల రేషనలైజేషన్ జరగలేదు. కచ్చితంగా రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు ఈ రేషనలైజేషన్‌ను పూర్తి చేస్తాము. ఎక్కడైతే ఎక్కువ మంది టీచర్లున్నారో వారిని తక్కువగా ఉన్న చోటకు పంపడంతో పాటు ఈ సంవత్సరం మనం డిఎస్సీ నోటిఫికేషన్‌ను కూడా ఇస్తున్నాం. దాదాపు 10343 మంది టీచర్లను కొత్తగా రిక్రూట్ చేస్తున్నాం. రేపు మే మాసంలో వారికి పరీక్షలు నిర్వహిస్తాం. జూన్ నెలకల్లా వారి నియామకపు ప్రక్రియ పూర్తి అయి, వారందరికి పోస్టింగులు ఇవ్వడం జరుగుతుంది. ఇవి కాకుండా, దాదాపు 7221 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను నియమించుకోవడానికి అనుమతించాము. ఎక్కడైతే టీచర్ల కొరత ఉందో అటువంటి చోట్ల వీరిని నియమించుకోమని ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. దానిని బేస్ చేసుకొని ఇప్పటికే దాదాపు 6347 మందిని నియమించారు. ఇప్పుడు ఎక్కడైతే టీచర్ల కొరత ఉందని చెప్పారో భవిష్యత్తులో అటువంటి కొరత లేకుండా రేషనలైజేషన్ ద్వారా నార్మల్‌గా ఉండే విధంగా చేస్తాము. తరువాత, డిఎస్సీ పోస్టింగులు కూడా వస్తున్నాయి. ఇంకా, ఎక్కడైనా కొరత ఉంటే ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా వాటి భర్తీకి అవసరమైన చర్యలు తీసుకుంటాము. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని తప్పకుండా మెయిన్‌టెయిన్ చేయాలి. ఎందుకంటే.. మంచి విద్య కావాలంటే పాఠశాలల్లో టీచర్లు కచ్చితంగా ఉండాలి. టీచర్లు లేకుండా మనం వారికి ఏమి చెప్పినా ఉపయోగం ఉండదు కాబట్టి తప్పకుండా మెయిన్‌టెయిన్ చేస్తాం. వచ్చే విద్యా సంవత్సరానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా గ్రామీణ ప్రాంతాలలోని అన్ని రకాల పాఠశాలల్లో పిల్లలకు తగిన విధంగా టీచర్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం. అలాగే, గోవింద రెడ్డి గారు చెప్పిన ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి కూడా పాఠశాలల టైమింగ్స్‌కు అనుగుణంగా, అంటే పాఠశాల ప్రారంభమయ్యే సమయానికి, మూసి వేసే సమయానికి కచ్చితంగా బస్సులు తిరిగే విధంగా మేము ఒకసారి ఆర్ అండ్ బి మంత్రి గారితో కూర్చొని కో-ఆర్డినేట్ చేసుకుంటామని తెలియజేస్తున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, మంత్రి గారు చెప్పిన సమాధానం చాలా సంతృప్తికరంగానే ఉంది కాని, పిల్లలు లేకుండా టీచర్లు ఎక్కువ ఉన్నారని చెప్పిన విషయంలో అలా ఎందుకు జరుగుతుందని ఏమైనా వెరిఫై చేశారా అని అడుగుతున్నాను. ఎందుకు అడుగుతున్నానంటే.. అక్కడ దగ్గరలో ప్రైవేటు పాఠశాలలు ఉండి ఉండాలి. ఇప్పుడు ప్రైవేటు స్కూల్సు విరాజిల్లుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు కూనారిల్లుతున్నాయి. ఎందుకంటే.. తల్లిదండ్రులకు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాలని మోజు ఉంది. రెండవది, అక్కడ టీచింగ్ బాగున్నా, లేకపోయినా ఇక్కడ టీచర్లు లేరు కాబట్టి అటువైపు మొగ్గు చూపుతున్నారు. టీచర్లు ఉన్న చోట కూడా పిల్లలు రావడం లేదంటే కారణం ఏమిటి? చంద్రబాబునాయుడుగారు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా డ్రాపవుట్స్‌ను తగ్గించడానికి విద్యా కమిటీలను వేసి పిల్లలను స్కూల్సుకు తీసుకురావడానికి ఎంతో ప్రోత్సహించారు. అలాగే, ఇప్పుడు కూడా ఏమైనా విద్యా కమిటీలను వేస్తున్నారా? అలాగే, ఎందుకు అక్కడ పిల్లలు తక్కువ, టీచర్లు ఎక్కువ ఉన్నారో చెప్పవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు : అధ్యక్షా, ప్రాథమిక విద్యకు సంబంధించి నిన్న సాయంత్రం గౌరవ ముఖ్యమంత్రి గారు దాదాపు గంటన్నర పాటు రెవ్యూ చేయడం జరిగింది. ఎందుకు ప్రైవేటు స్కూలు విరాజిల్లుతున్నాయని చూస్తే.. రాజకుమారి గారు చెప్పినట్లుగా మనదగ్గరున్న టీచర్లు స్టాండర్డ్ లేక కాదు. వాస్తవానికి, డిఎస్సీలో ఎవరికైతే ఉద్యోగం రాదో వారే ఈ ప్రవేటు స్కూల్సులో ఉపాధ్యాయులుగా పని

చేస్తున్నారు. మామూలుగా పెద్ద వాళ్లు ఒక జోక్ చెబుతారు. ఫెయిల్ అయిన వారు పాఠశాలలను పెడితే, పాస్ అయిన వారు దానిలో ఉపాధ్యాయులుగా పని చేస్తారని. అలా కాకుండా, కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ ఎక్సలెంట్. కాకపోతే, క్లోజ్ సూపర్‌విజన్ లేకపోవడంతో, వాళ్ల మీద అజమాయిషీ లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. అయితే, performance లింక్డ్‌గా కచ్చితంగా మోనిటర్ చేయాలని అనుకుంటున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నుండి 3, 5, 8 తరగతులు చదువుతున్న పిల్లలకు కూడా పరీక్షలు పెట్టబోతున్నాం. Detention ఉండదు కాని assessment ఉంటుంది. ఒకవేళ ఆ పిల్లలకు సరిగా మార్కులు రాకపోతే అంతకు ముందు అక్కడ టీచ్ చేసిన టీచర్లు ఎవరు, ఎలా చెబుతారు మొదలైన వాటిపై ఎప్పటికప్పుడు అసెస్ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నాం. గతంలో చూస్తే.. విద్యా వ్యవస్థలో మూవ్‌మెంట్ ఉన్నట్లు కనపడుతుంది కాని ముందుకు కదిలేది కాదు. భవిష్యత్తులో అటువంటి ఇబ్బంది లేకుండా దీనికి ఒక విజిబిలిటీ వచ్చే విధంగా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురాబోతున్నాము.

శ్రీ బి. చెంగల్ రాయుడు : (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, రాజకుమారి గారి ప్రశ్నకు, మంత్రి గారి సమాధానానికి రెండింటికి పాస్ మార్కులు వచ్చాయి. టీచర్ల కొరత ఉందా అని అడిగితే లేదని మంత్రి గారు చెప్పారు. కాని, దాదాపు 10300 మంది టీచర్లను రిక్రూట్ చేసుకుంటున్నామని చెప్పారు. ఖాళీలు లేకపోతే రిక్రూట్‌మెంట్ ఎందుకు? ఖాళీలు ఉంటేనే కదా రిక్రూట్‌మెంట్ చేసేది. రెండవది, స్కూల్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులను భర్తీ చేయడం లేదు. ఐదారు మండలాలకు ఒక ఇన్‌స్పెక్టర్ ఉంటున్నారు. వాళ్ల మీద తనిఖీలు లేవు. దాదాపు 20 శాతం స్కూల్సును మూసి వేశారు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, ఏ ప్రభుత్వం మూసి వేసిందో చెప్పమనండి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కొన్ని స్కూల్స్‌ను మూసివేశారు.

శ్రీ బి. చెంగల్ రాయుడు : అమ్మా, మా ప్రభుత్వంలో అని కాదు, ఈ ప్రభుత్వంలో అని కాదు.

టీచర్లను రేషనలైజ్ చేస్తామని మంత్రి గారు చెప్పారు. అది శుభవార్త. ఒక వేళ స్కూల్సును మూసివేస్తే ఎన్ని స్కూల్సును మూసి వేశారు?

శ్రీమతి పమిడి శమంతక మణి : (శాసనసభ నియోజక వర్గం) మేము మూసివేయలేదు. మీ ప్రభుత్వంలోనే మూసి వేశారు.

(అంతరాయం)

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, నన్ను చెప్పనివ్వడం లేదు. నేను అడిగే దానికి మంత్రి గారు జవాబు ఇస్తారు. రాజకుమారి గారూ.. మీరు ఎందుకు మాట్లాడతారు?

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : రాజకీయ దురుద్దేశంతో విమర్శలు చేస్తుంటే మంత్రి గారు ఎందుకు సమాధానం చెబుతారు. మేమే సమాధానం చెబుతాము.

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, పిల్లల విద్యకు సంబంధించి రాజకీయ దురుద్దేశాలు ఏమి ఉంటాయి?

స్కూలు ఇన్‌స్పెక్టర్ల పోస్టులు లేనిదాని వల్ల ఐదారు మండాలలకు ఒక ఇన్‌స్పెక్టరు ఉండడం వల్ల పాఠశాలలపై సూపర్‌విజన్ ఉండడం లేదు. ఖాళీలు లేవంటున్నారు. ఇప్పుడు ఉన్నాయని అంటున్నారు. ఇస్తామని అంటున్నారు. విద్యా వాలంటీర్లు అని అంటున్నారు. వీటికి సంబంధించి కొంత న్యాయపరమైన

ఇబ్బంది వస్తుంది. స్కూలు ఇన్‌స్పెక్టర్ల పోస్టులను ఎప్పటి లోపు భర్తీ చేస్తారు. మంత్రి గారి దగ్గర ఏమైనా సమాచారం ఉంటే చెప్పవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు : అధ్యక్షా, సీనియర్ సభ్యులైన శ్రీ బి. చెంగల్ రాయుడు గారు నేను చెప్పిన జవాబును అపార్థం చేసుకున్నారు. నేను క్లియర్‌గా చెప్పడం జరిగింది. దాదాపు 7221 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను నియమించుకోవడానికి అనుమతించాం. రూల్సు ప్రకారం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ పర్మినెంట్‌గా ఉండకూడదు కాబట్టి వచ్చే విద్యా సంవత్సరం నుండి వారుండరు. రేషనలైజేషన్ చేసిన తరువాత కూడా ఇంకా తక్కువ ఉంటే మెయిన్‌టెయిన్ చేయడం కోసం ఆ ప్లేస్‌లో డిఎస్సీ ద్వారా 10300 వేల మందిని రిక్రూట్ చేసుకుంటున్నాము. ఇప్పుడు డిఎస్సీ పెడుతున్నామంటే ఆ పది వేల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కాదు. దానికి అవసరమైన అడ్జస్ట్‌మెంట్లు చేశాము. విద్యా వాలంటరీలకు కూడా అర్హతలను నిర్ణయించి, ప్రొసీజర్ ప్రకారం వారిని నియమించుకుంటున్నాము.

డా. ఎం. గేయానంద్ : అధ్యక్షా, హైస్కూల్స్‌లో అన్ని సబ్జెక్టులకు టీచర్లు ఉంటున్నారు కాని, హిందీ సబ్జెక్ట్‌కు ఉండడం లేదు. హిందీ సబ్జెక్టును అక్కడున్న పి.టీ టీచర్లే చెబుతుంటారు. ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగితే, హిందీ టీచర్ లేరని చెబుతుంటారు. హిందీ టీచర్లకు చాలా తీవ్రమైన కొరత ఉంది. అలాగే, సబ్జెక్ట్ టీచర్ల కొరత కూడా ఉంది. ఒక సబ్జెక్ట్ మరొక సబ్జెక్ట్ టీచర్ చెబుతూ అక్కడ ఉండే టీచర్లే అడ్జెస్ట్ చేసుకుంటుంటారు. హైస్కూల్స్‌లో టీచర్లు బాగానే ఉన్నారు కాని అక్కడక్కడా సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడమనేది చాలా క్రిటికల్‌గా ఉంది. సబ్జెక్ట్ టీచర్లు, హిందీ టీచర్ల భర్తీ గురించి ఏమి చర్యలు తీసుకుంటారని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను. అలాగే, ప్రతి హైస్కూల్లోను విద్యార్థుల సంఖ్యను బట్టి సబ్జెక్టుకు కనీసం ఒకరిద్దరు టీచర్లు ఉండేటట్లు చూడాలి. మంత్రి గారు రేషియో గురించి చెప్పారు. కాని, ఆ రేషియో అనేది deceiving. వాస్తవ పరిస్థితి ఏమిటో చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు : అధ్యక్షా, గేయానంద్ గారు బాగా అనుభవమున్న వారు. దీనిలో డిసీవింగ్ ఏమీ లేదు. దీనిలో ఉన్న వాస్తవం ఏమిటంటే.. ఒక స్కూల్లో ఒక టీచరుంటే వంద మంది విద్యార్థులుండవచ్చు. ఐదుగురు టీచర్లున్న చోట కేవలం పది మంది పిల్లలే ఉండవచ్చు. కాని, ఓవరాల్‌గా మనకున్న టీచర్లు, విద్యార్థుల సంఖ్యను తీసుకుంటే వచ్చిన యావరేజ్‌ను బట్టి రేషియోను చెప్పాను. దీనిలో దాచిపెట్టేది ఏమీ లేదు.

డా.ఎం. గేయానంద్ : అధ్యక్షా, మంత్రి గారు చెప్పిన రేషియోను బట్టి చూస్తే అంతా సక్రమంగానే ఉన్నట్లు అనిపిస్తుంది. క్రింది స్థాయిలో ఉన్న హైస్కూళ్లలో చాలా సమస్యలున్నాయి.

శ్రీ గంటా శ్రీనివాసరావు : అధ్యక్షా, సక్రమంగా లేదు కాబట్టే రేషనలైజేషన్ చేస్తున్నాం. ఎక్కడైతే టీచర్ల కొరత ఉందో వాటిని సరిచేసిన తరువాత, డిఎస్సీ నియామకపు ప్రక్రియ పూర్తి అయిన తరువాత, ఇంకా ఏమైనా లోపాలుంటే తప్పకుండా ఎగ్జామిన్ చేసి చర్యలు తీసుకుంటాము.

MR. CHAIRMAN : Last Question i.e. Question No.8176 postponed at the request of the Member. అంగన్‌వాడీల జీతాల పెంపు గురించి వాళ్లు చేస్తున్న ఆందోళనపై మంత్రి గారి స్టేట్‌మెంట్.

శ్రీమతి పీతల సుజాత : అధ్యక్షా...

శ్రీ మహ్మద్ జాని : అధ్యక్షా, ఆ స్టేట్‌మెంట్‌ను సర్క్యులేట్ చేయాలి.

శ్రీమతి పీతల సుజాత : దయచేసి సభ్యులు సహకరించాలి. నేను చెప్పుతున్నాను కదా.

అధ్యక్షా, అంగన్‌వాడీ కార్యకర్తలందరూ జీతాలు పెంచమని గత కొద్ది రోజులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారు. అదే విధంగా, నిన్న వారు హైదరాబాద్ వచ్చి ధర్నా చేయడం జరిగింది. అంగన్‌వాడీ కార్యకర్తలందరికి ఈ సందర్భంగా సభ ద్వారా అపీల్ చేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారు నిన్న అసెంబ్లీ నుండి అపీల్ చేశారు. ఇప్పుడు రాష్ట్రం విడిపోయిన పరిస్థితులలో, మనకున్న ఆర్థిక ఇబ్బందుల రీత్యా ఇబ్బందికరమైన పరిస్థితిలో రాష్ట్ర పరిస్థితి ఉంది. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికి కూడా అంగన్‌వాడీ కార్యకర్తలు జీతాలు పెంచమని ఆందోళన చేస్తూ, వాళ్ల బాధను మాకు తెలియజేస్తున్నారు. వాళ్లకు తప్పనిసరిగా న్యాయం చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. నిన్న గౌరవ ముఖ్యమంత్రి గారితో అంగన్‌వాడీ సంఘ నాయకులు కూడా కలిసి మాట్లాడారు. ప్రభుత్వం సానుకూలంగా ఉంది. చిత్తశుద్ధితో ముందుకు వెళుతోంది. వారి సమస్యల పరిష్కారం కోసం మా ప్రయత్నం మేము చేస్తున్నాము. తప్పకుండా వారికి సహకరిస్తామని సభా ముఖంగా తెలియజేస్తున్నాను. మరొకసారి వాళ్లందరిని పిలిచి మాట్లాడి, వాళ్ల న్యాయపరమైన కోర్కెలు తీర్చడానికి మా వంతుగా పని చేయడానికి, వారికి న్యాయం చేయడానికి సహకరిస్తామని సభా ముఖంగా తెలియజేస్తున్నాను. గౌరవ అంగన్‌వాడీ కార్యకర్తలందరు కూడా మా విజ్ఞప్తిని మన్నించి తప్పనిసరిగా ప్రభుత్వానికి సహకరించాలని, అర్థం చేసుకోవాలని మరొకసారి అపీల్ చేస్తున్నాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : అధ్యక్షా, గౌరవ మంత్రి గారు, అలాగే నిన్న ఇక్కడ హాజరైన మంత్రివర్గ సభ్యులు ముఖ్యమంత్రి గారి దగ్గర ఈ విషయాన్ని ప్రస్తావించి, వారిని కన్విన్స్ చేసి, గేయానంద్ గారి నాయకత్వానా అంగన్‌వాడీ నాయకులను పిలిచి, మాట్లాడి, వారికి విశ్వాసం కలిగించి, వారు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షను విరమింపచేసే దానిలో గౌరవ మంత్రులు చూపించినటువంటి చొరవ పట్ల మీ అందరికి అంగన్‌వాడీ కార్యకర్తల వైపు నుండి, నా వైపు నుండి ధన్యవాదాలు తెలియపరుస్తున్నాను. ఇదే సందర్భంగా, ఐఎంఆర్, ఎంఎంఆర్‌లో దక్షిణ భారత దేశంలోనే మనం అత్యంత దయనీయమైన పరిస్థితిలో ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి గారు కార్యకర్తల దృష్టికి తీసుకురావడం జరిగింది.

ఉ. 11.10

కార్యకర్తలు కూడా వారికి కొన్ని విషయాలు చెప్పాలని ప్రయత్నం చేయడం జరిగింది. మన రాష్ట్ర మానవాభివృద్ధి సూచికలను ముందుకు తీసుకువెళ్లే అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నటువంటి అంగన్‌వాడీ కార్యకర్తలకు మన రాష్ట్రంలో ఉన్నటువంటి ఆర్థిక ఇబ్బందులను అడ్డం పెట్టి మౌలికమైన అంశాలమీద రాజీపడే ధోరణి నుండి బయటకు వచ్చి వారిని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించి, వారికి సరైన న్యాయం అందించాలని ముందుగా నేను కోరుతున్నాను. అలాగే, మన రాష్ట్రంలో ఉన్నటువంటి అంగన్‌వాడీ సంఘాలకి, కార్యకర్తలకు ప్రభుత్వానికి మధ్యలో అనుసంధానం చేసే సరైన మెకానిజమ్ లేదు. ఆ సంఘాలను గుర్తించడం, జిల్లా స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలోను మూడు నెలలకో, ఆరు నెలలకో, ఏడాదికో ఏదో ఒక సందర్భంలో ఒకసారి వారిని కూర్చోబెట్టి వాళ్ల సమస్యలు ఏమిటో తెలుసుకుని అధికారికంగా టార్గెట్స్ పెట్టి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అనధికారికంగా sector meetings, project meetings జరుగుతున్నాయే గానీ, అకౌంటబిలిటీ ఉండే పద్ధతిలో సంఘాలతోటి, సంఘాల యొక్క బాధ్యులతోటి సమావేశాలు పెట్టడానికి ప్రభుత్వం నిరాకరించడం వంటి కారణాలు అనేకం ఉన్నాయి. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి నిన్న మేము చేసిన ఆందోళనకు సహకరించినటువంటి కాంగ్రెస్, వైయస్ఆర్ కాంగ్రెస్, పిడిఎఫ్ పార్టీలు, ఇతర ఎమ్ఎల్‌సిలకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. గయ్‌మని లేచి నోరు మూయించే శక్తి ఉన్నప్పటికీ కూడా ఈ ఇష్యూలో ఉన్న సమంజసత్వాన్ని గమనించి మా నన్నపనేని రాజకుమారి గారూ, శమంతకమణి గారూ కూడా వారి మౌనంతో మాకు మద్దతు తెలియపరచినందుకు మా ధన్యవాదాలు. తెలుగుదేశం పార్టీ ఎమ్ఎల్ఏలు, ఎమ్ఎల్‌సిలు, మినిస్టర్లు కూడా

భౌతికంగా, రాజకీయంగా మాతో నడవకపోయినా మానసికంగా మాతోటి ఉన్నారు. ముఖ్యమంత్రిగారిని కన్విన్స్ చేయడంలో కీలకమైన పాత్ర పోషించారు. ముఖ్యంగా మా మంత్రిగారు మహిళ. వారు తీసుకోవలసినదానికంటే ఎక్కువ చొరవ తీసుకున్నందువల్లనే ఇవన్నీ సక్సెస్ అయ్యాయి కాబట్టి వారందరికీ పేరుపేరునా అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సంఘాల వైపు నుండి సభాముఖంగా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

డా. ఎమ్.గేయానంద్ : సార్, మీకు మొదట ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. రెండు రోజులుగా మేము ఈ అంశాన్ని తమ దృష్టికి తీసుకువచ్చినప్పుడు ప్రభుత్వానికి తగిన విధంగా సూచనలు ఇస్తున్నారు. అదే విధంగా ఈ సమస్య పట్ల ఇక్కడున్న అన్ని పార్టీల వాళ్ల సభ్యులు, మంత్రులు కూడా సానుకూలంగా ఉన్నారు. కాబట్టి, వారందరికీ నేను ధన్యవాదాలు చెబుతున్నాను. నిన్న వేలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఇక్కడకు వచ్చినప్పుడు నేను వెళ్లాను. నన్ను కూడా అక్కడ అరెస్ట్ చేశారు.

మిస్టర్ ఛైర్మన్ : నేను కూడా రెవ్యూ చేశాను. తరువాత రిలీజ్ చేశారని తెలిసింది.

డా. ఎమ్. గేయానంద్ : అవును సార్. తరువాత నేను కూడా వెళ్లి ముఖ్యమంత్రిగారిని కలిశాను. వారు పాజిటివ్‌గా రెస్పాండ్ అయ్యారు. తప్పకుండా ఈ సమస్యలపట్ల సానుకూలంగా ఈ ప్రభుత్వం ఉందని చెప్పారు. అసోసియేషన్ వాళ్లని కూడా పిలిచి మాట్లాడతామని అన్నారు. శ్రీనివాసరావుగారు ఇతర మంత్రులు కూడా అక్కడ ఉన్నారు. అయితే, ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి కాబట్టి వీలైంత త్వరగా చేస్తామని ముఖ్యమంత్రిగారు చెప్పారు. మంత్రిగారికి నా విన్నపమేమంటే, సిఎమ్ గారు ఏవైతే మాకు హామీలు ఇచ్చారో, ఆ హామీలను అమలు చేయడానికి అవసరమైన official procedures ను పూర్తిచేసి వీలైతే ఈ సమావేశాలలోపే దానిపై ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలని కోరుతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, పది సంవత్సరాల నుండి మేము అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పట్ల స్పందించడం జరిగింది. పార్టీ పరంగా కూడా అనేకసార్లు జిల్లాలలో మరియు ఇందిరా పార్కు వద్ద కమ్యూనిస్ట్ సోదరులు శ్రీ పి.జె. చంద్రశేఖర రావు గారితో, రమాదేవిగారితో పాటు మేము కూడా పాల్గొన్నాము. గుంటూరు, బెజవాడ, ప్రకాశం జిల్లాలలో అనేకచోట్లకు నేను వెళ్లాను. నేను మొదటినుండి సంఘసేవ చేస్తూ రాజకీయాలలోకి వచ్చినదానిని కాబట్టి మహిళలతో సత్సంబంధాలు కలిగి ఉన్నాను గనక వారు నాకు స్వయంగా ఫోన్ చేయడం నేను వెళ్లడం జరిగేది. నిన్న ఒక్క రోజు నేను వెళ్లలేకపోయాను. రాజకీయంగా నాకు టెన్షన్ ఉండడం వల్ల నేను స్వయంగా వెళ్లలేకపోయాను. నాకున్న పర్సనల్ సమస్య కారణంగా వెళ్లలేకపోయాను తప్ప అధికారంలో ఉన్నాను కాబట్టి వెళ్లకపోవడం కాదు. గత అయిదు రోజుల నుండి ముఖ్యమంత్రిగారి వద్ద గంటా శ్రీనివాసరావుగారు, ఇతర మంత్రులు ఉండి ఎలా చేద్దామని చర్చించుకోవడం జరిగింది. సమస్య రెండు విషయాలలో వచ్చింది. ఒకటి పోలీసులు కొట్టించారని, రెండవది....

మిస్టర్ ఛైర్మన్ : ఇప్పుడవన్నీ ఎందుకు? ధన్యవాదాలు చెప్పి ముగించండి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : జిల్లాలలో జరిగిన విషయంపై కూడా వెంటనే స్పందించి అక్కడ ఏమీ అలజడులు సృష్టించకూడదు, వారిని ఇబ్బంది పెట్టకూడదని ముఖ్యమంత్రిగారు మరియు మంత్రులు చొరవ తీసుకోవడం వల్ల ఈ అంశం విజయవంతమైనది. వారి సమస్య పరిష్కారమైనందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాను. ఏ విధమైన అవాంఛనీయమైన సంఘటన జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. అందరికీ ధన్యవాదాలు.

మిస్టర్ ఛైర్మన్ ః సభ తరఫున ధన్యవాదాలు. సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వానికి సూచన. Now, Tea Break for 15 Minutes.

(Then, the House adjourned at 11.16 a.m.)

ఉ. 11.50

**AFTER TEA BREAK, THE HOUSE RE-ASSEMBLED AT 11:55 A.M.**

**(THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)**

* * *

MR. CHAIRMAN: Now Item No.II

All the papers listed in the agenda are deemed to have been laid on the Table of the House.

(3) **PAPERS LAID ON THE TABLE OF THE HOUSE:**

1. A copy of the Notification issued in G.O.Ms.No.389, Revenue (Land Acquisition) Department, dated 20th November, 2014, as required under Section 111 of the Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act, 2013.
2. A copy of the Thirtieth Annual Report of the Andhra Pradesh Handicrafts Development Corporation Limited for the year 2010-2011, as required under Section 619-A (3) of the Companies Act, 1956.

(4) **అర్జీ సమర్పణ ః**

డా.ఎం.గేయానంద్: అధ్యక్షా, బద్వేల్‌లో ఒక సి.ఎస్.ఐ. చర్చి ఉంది. 56 సంవత్సరాలుగా ఉన్న ఆ చర్చికి సంబంధించిన కొంత భూమి అక్కడ ఉంది. దానివెనుక శ్రీమాన్ ఆసుపత్రి అనే ఒక ఆసుపత్రి ఉంది. ఆ ఆసుపత్రికి దారికోసం ఈ చర్చి స్థలాన్ని తీసుకోవాలని చూస్తున్నారు. అధికారులు కూడా దానికి సహకరిస్తున్నారు. సి.ఎస్.ఐ. చర్చికి సంబంధించిన ఆస్థుల రక్షణ కోసం వారిచ్చిన పిటిషన్‌ను తమరిద్వారా నేను సమర్పిస్తున్నాను.

(పిటిషన్‌ను సమర్పించడమైనది.)

(5) **బడ్జెటుపై చర్చ కొనసాగింపు ః**

శ్రీమతి పమిడి శమంతకమణి: అధ్యక్షా, 2015-16వ సంవత్సరానికి సంబంధించి మన ఆర్థికవ్యవస్థ గురించి, గౌరవనీయులు, ఆర్థికశాఖామంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారు ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి మాట్లాడడానికి నాకు అవకాశం ఇచ్చిన తమరికి ముందుగా నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈసభలో ఉన్న సభ్యులంతా ఎంతో అనుభవం కలిగిన వారు. వారు రాజకీయపరంగానే కాక కుటుంబ పరంగా కూడా చాలా అనుభవజ్ఞులు.

అధ్యక్షా, కొత్తగా కాపురానికి వెళ్లినపుడు ప్రతి దంపతులు కూడా వారి స్థోమత మరియు సంపాదనను బట్టి మధ్యతరగతి కుటుంబీకులయితే సత్తుగిన్నెలు కొనుక్కుంటారు. రెండు లేక మూడు సంవత్సరాల తర్వాత స్టీలుగిన్నెలు కొనుక్కుంటారు. ఆ తరువాత ఫర్నీచరు, మరో 10 లేక 12 సంవత్సరాల తర్వాత ఇల్లు కట్టుకోవాలనే ఒక ఆలోచన ఉంటుంది. ఎందుకంటే, వారి స్టేటస్ కూడా పెరుగుతుంది. వారి కోరికలను అనుసరించి, వారి పిల్లలు పెద్దయ్యేకొద్దీ, వారియొక్క బడ్జెట్ పెంపుదలకు భార్యాభర్తలిద్దరూ కృషిచేయడం జరుగుతూ ఉంటుంది. ఇప్పుడు మనరాష్ట్రం కూడా కొత్త కాపురం లాంటిది. దానిలో ఎటువంటి

అసత్యం లేదు. ఒక నాయకుడిగా, నడిసముద్రంలో ఉన్న పడవకు నాయకుడిగా ఈనాడు మన ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబునాయుడు గారు స్వయంకృషితో, నిరంతర ఆలోచనతో ఈరాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఆయన పాటుపడుతున్న సమయంలో పెద్దలుగా మనమంతా మన రాజకీయ అనుభవాన్ని, మేధస్సును ఉపయోగించి మంచి సలహాలిచ్చి ఈ ప్రభుత్వాన్ని ముందుకు తీసుకుపోవడానికి భావితరాలకు ఒక మంచి రాష్ట్రంగా నిర్మాణం కావడానికి, వారి భవిష్యత్తు బంగారు బాట కావడానికి మనమందరం కారకులమే, మనందరి సలహాలు అవసరమే. అంతేకానీ, మీరేదో ఇప్పుడు వచ్చినారు, మాకోరికలన్నీ ఈ విధంగా ఉన్నాయి, మీరేమీ తీర్చడంలేదు. మీరేమీ మీద వేసుకోవడంలేదని అంటే ఏవిధంగా ఉంటుంది? మీ భుజాన మేము కూర్చుంటాము. అనంతపురం నుంచి హైదరాబాదు వరకూ మమ్మల్ని మోయండని అంటే ఎవరైనా మోస్తారా? ఎవ్వరూ మోయలేరు.

మ.12.00

మానవమాత్రులైనవారు ఎవ్వరూకూడా ఆ బరువు బాధ్యతలు నిదానంగా చేపడ్తారుకానీ ఏదో అనాలి, మేము ప్రతిపక్షంలో ఉన్నామని అనాలంటే అనేది సరికాదు. ప్రతి ఒక్కరూ ఇక్కడ ఉన్నవారందరూ కూడా సీనియర్సే కాబట్టి ఈయొక్క రాష్ట్ర పరిస్థితిని బట్టి చేపట్టిన బడ్జెట్‌ను అనుసరించి రాబోయే దినాలలో ఏ పథకాలు ఏ విధంగా నడుస్తాయి? ఏ విధంగా నడిపించాలి? ఆ నడిపించడానికి మంచి, మంచి సలహాలు ఇవ్వమని నేను నా సోదర సభ్యులందర్నీ కోరుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖర్‌రావు: చెప్తే వినే దృష్టిలేదు ప్రభుత్వానికి.

శ్రీమతి పమిడి శమంతకమణి : ఎందుకుండదు. మీరు ఊరికనే ఉన్నదే చెప్తూ ఉంటారు. గతంలో కూడా ఇట్లే మాట్లాడి ఉంటే బాగుండేది. ఈపొద్దు ఢిల్లీలో నాయకులంతా మేలుకున్నారు. మేము రైల్వే జోన్ ఇస్తామన్నాము, అదిస్తామని అంటూ ఉన్నారు. మరి రాసియ్యకూడదా అప్పుడే. అంతా అయిపోయినాక ఇప్పుడు మాత్రం అన్నీ మాట్లాడతారు. ఏదో పెళ్ళంతా అయ్యాక మేళం పెట్టినట్లు.

మన రాష్ట్ర బడ్జెట్ రూ. 1,13,049కోట్లు, ప్రణాళికేతర వ్యయం రూ.78,637కోట్లు, ప్రణాళికా వ్యయం 34,412కోట్లని మన ఆర్థికశాఖమంత్రిగారు చెప్పారు. రెవెన్యూ రిసీట్స్ రూ.90,125కోట్లు అన్నారు. మనం ఒక్కసారిగా ఆలోచనచేస్తే మన రాష్ట్రం సమైక్యంగా ఉన్నప్పుడు రెవెన్యూ మిగులు రూ. 344కోట్లయితే విడిపోయినాక మన రాష్ట్ర మిగులులోటు ఎంతంటే రూ. 14,242.58. ఆ లోటును పూడ్చుకుని ఈరోజు 2015-16 రెవెన్యూ లోటు రూ.7299.79 అంటే, ఒక్క సంవత్సరానికే ఇంత లోటును మనం పూడ్చుకుని ముందుకు వస్తున్నాము అంటే మన ముఖ్యమంత్రిగారు నిరంతర కృషికి తార్కాణమని చెప్పవచ్చు.

శ్రీ ఎం.సుధాకర్‌బాబు : వ్యాట్ ఇంకొక పదిరూపాయలు పెంచండి వస్తాయి.

శ్రీమతి పమిడి శమంతకమణి : అయ్యా, కూర్చొని వినే ఓపిక ఉంటే కూర్చో. లేదంటే నేను తిరగబడతా మళ్ళా. జాగ్రత్త. తిరగబడితే మళ్ళా బాగుండదు. లేకపోతే నిద్రపో.

అధ్యక్షా, ఆర్థికశాఖమంత్రిగారి బడ్జెట్ అంచనా చూశాక మన రెవెన్యూ రిసీట్స్ 2014-15కి రూ. 84,066.90 అయితే 2015-16కల్లా రూ.90,125కోట్లకు పెరుగుతుందని అనుకోవడం నిజంగా చాలా హర్షణీయమైన విషయమే. మనందరికీ తెలుసు రెండు నెలలు రాష్ట్ర ప్రజలందరూకూడా వీధినపడి ఈ రాష్ట్రాన్ని విభజన చేయవద్దు. అన్నదమ్ములుగా ఉన్నాం. ఒకటిగా ఉన్నాం. అందరమూకూడా బంధువులుగా కలిసి ఉన్నాం. ఈరోజు మా పిల్లల భవిష్యత్తు ఏమిటని ఆడ, మగా అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరూకూడా రెండునెలలుగా రోడ్డుకు ఎక్కారు. వృద్ధులు, అనేకరంగాల కులవృత్తులు కలిగిన

వారంతా వచ్చి అయ్యో తల్లీ చేయద్దు విభజన. విభజనవల్ల చాలా అన్యాయమైపోతామని కూడా చెప్పడం జరిగింది.

శ్రీ ఎం.సుధాకర్‌బాబు : (శాసనసభ నియోజక వర్గం) నేను లెటర్ ఇస్తేనే విభజన చేశారని అంటున్నాడు మీ నాయకుడు.

శ్రీమతి పమిడి శమంతకమణిః నువ్వు మాట్లాడేటప్పుడు నేను కూడా మాట్లాడతాను. నేను చెప్పాకదా నువ్వు నిద్రపో అని.

శ్రీ ఎం.సుధాకర్‌బాబుః ఇలా రౌడీయిజం చేయద్దు మామీద. భయపెట్టద్దు.

శ్రీమతి పమిడి శమంతకమణిః అధ్యక్షా, మామూలుగా అయితే ఒక చిన్న మధ్యతరగతి కుటుంబంకానీ, ఒక పది ఎకరాలు, ఇరవై ఎకరాలు భూములున్నవారు కానీ విడిపోయేటప్పుడు పెదనాయననో, మేనమామల్నో పిలిపించుకుని, కూర్చోబెట్టుకుని పెద్దోడికి ఏ ఇల్లు ఇవ్వాలి, చిన్నోడికి ఏ ఇల్లు ఇవ్వాలి, పెద్దోడికి ఏ పక్కనున్న భూమి ఇవ్వాలి, చిన్నోడికి ఏ పక్కనున్న భూమి ఇవ్వాలనేది నిర్ణయించడం మామూలుగా మనమందరమూ కూడా చూస్తున్న విషయమే. మనం చేస్తున్న విషయమే. కానీ విడిపోవడమనేది అనాలోచిత చర్య కాకుండా, ఏ న్యాయమూ చేయకుండా మీకు ఇది ఇస్తున్నామని చెప్పుకోకుండా విభజనచేశారు.

(ప్యానెల్ ఛైర్మన్ శ్రీ మెట్టు గోవిందరెడ్డి అధ్యక్షస్థానం వహించారు)

అధ్యక్షా, మీరు ఆ స్థానంలో కూర్చున్నందుకు, మీరు ఆ స్థానంలో ఉన్నప్పుడు నేను ఉపన్యాసం చేయడానికి చాలా సంతోషంగా ఉంది. ఇద్దరమూ అనంతపురం జిల్లా వాసులమే.

శ్రీ బి.చెంగల్‌రాయుడుః మెట్టుగోవిందరెడ్డిగారు మాట్లాడినప్పుడు మీరు అధ్యక్షస్థానంలో కూర్చుందురు.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, ఎంత లోటు బడ్జెట్ ఉన్నా అన్ని రంగాలు అభివృద్ధి చెందాలి. ఈ రాష్ట్రం అభివృద్ధిమార్గంవైపు నడవాలనే ఒక మంచి ఆలోచనతో చేయబడిన ఈ బడ్జెట్‌ను నేను అభినందిస్తున్నాను.

వెంట్రుకలు ఉన్నమ్మ ఏ కొప్పు అయినా పెట్టచ్చు అని రాయలసీమ పక్క ఒక సామెత ఉంది. ఈరోజు తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ వ్యత్యాసాలు చూస్తే మొత్తం బడ్జెట్ మనది రూ.1,13,049కోట్లయితే వాళ్ళది రూ.1,15,689కోట్లు. ప్రణాళికేతర వ్యయం రూ.78,637కోట్లు మన ఆంధ్రప్రదేశ్‌ది అయితే, రూ.63,306కోట్లు తెలంగాణాది. ఆ విధంగా వేసుకుంటూ వస్తే ఆర్థికలోటు మనకు రూ.17,584కోట్లయితే, వాళ్ళ ఆర్థిక మిగులు రూ.531.30. అంటే వాళ్ళకూ, మనకూ పోల్చినప్పుడు విస్తరి నిండా వారికి భోజనముంది. ఈరోజు మనం విస్తరిలో భోజనం తెచ్చుకోవాల్సిన అవసరం మనకుంది. మరి ఈ రకంగా ఆలోచన చేసినప్పుడు నిన్ననే సోదరుడు చంగల్‌రాయుడుగారు కూడు, గుడ్డ, నీడ గురించి మాట్లాడారు. మనిషన్నాక కూడు, గూడు, బట్టలు అవసరమే. మరి కూడు ఉండాలంటే మడక దున్నాలి. వ్యవసాయం చెయ్యాలి. ఈరోజు మరి బృహత్తర ప్రణాళిక ఒకటి మన ముఖ్యమంత్రిగారు ఆలోచన చేసి అన్ని రంగాలు కూడా ముందుకు రావాలనే ఒక సదుద్దేశంతో ఏడు మిషన్లు ప్రాథమిక రంగం, సామాజిక సాధికారత, విజ్ఞానం–నైపుణ్యకల్పన, పట్టణాభివృద్ధి, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, సేవా రంగమనే ఏడు మిషన్లను తీసుకురావడం జరిగింది. వీటిని ప్రచార మాధ్యమాలుగా 'పేదరికంపై గెలుపు', 'పొలం పిలుస్తోంది', 'బడి పిలుస్తోంది', 'నీరు–చెట్టూ', 'స్వచ్ఛ ఆంధ్ర'

ఈ ప్రచార మాధ్యమాలద్వారా ముందుకు తీసుకురావడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాదు 'నీటి సరఫరా', 'రహదారి', 'విద్యుచ్ఛక్తి', 'సహజవాయువు', 'ఫైబర్ ఆప్టిక్' అనే అయిదు గ్రిడ్‌లు కూడా మన ముందుంచుతున్నారు.

మిస్టర్ ప్యానెల్ ఛైర్మన్ : మీరు 10నిమిషాలు మాట్లాడాల్సి ఉంది కానీ అప్పుడే 15నిమిషాలు అయిపోయింది. త్వరగా ముగించండి.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, ఇవి మొదలు. ఇంకా మాట్లాడవలసింది చాలా ఉంది. మీరు అధ్యక్షస్థానంలో ఉన్నారని నేను సంబరపడుతుంటే ఒకటేసారి సమ్మర్ కటింగ్ అంటే ఎట్లా?

శ్రీ బి.చెంగల్‌రాయుడు : నిన్న మీరు అంటా ఉన్నారే అదే అంటున్నారు గోవిందన్న.

శ్రీమతి పమిడి శమంతకమణి : ఏంలేదు. నేను మీకు గంటన్నర సమయమిచ్చాను. థ్యాంక్స్ చెప్పే పోవాలి. అధ్యక్షా, మరి వ్యవసాయమన్నప్పుడు దూరదృష్టి కలిగిన మా ముఖ్యమంత్రిగారు, గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అనంతపురం జిల్లాను కరువుజిల్లాగా దృష్టిపెట్టుకుని ఆరోజు ఆయన నష్టపరిహారం ఇవ్వడం జరిగింది. వ్యవసాయం మీద ఆయనకు దృష్టిలేదని చాలామంది అన్నారు. ఆరోజు ఇచ్చిన నష్టపరిహారం ఈరోజుకు కూడా అనంతపురం రైతులు అనుభవిస్తున్నారు.

మ.12.10

రాష్ట్రాన్ని వ్యవసాయ రంగంపై ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవైపుకి తీసుకువెళ్లాలి, వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని ఒక ఉద్దేశంతో సుదీర్ఘ పాదయాత్ర చేసిన తరువాత రైతుల రుణమాఫీ చేయడం జరిగింది. మొదటి విడత కింద రూ.50వేల రూపాయలు లోపు రుణమాఫీ మాచేతుల మీదుగానే చేయడం జరిగింది. పల్లెల్లోకి వెళ్లినప్పుడు రూ.49,500లు రుణమాఫీ చేసినప్పుడు ఆ రైతు కళ్లల్లోని ఆనందాన్ని మేము చూడగలిగాము.

(మిస్టర్ డెప్యూటి ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

రెండవవిడత కింద కూడా రూ. 1.50లక్షల వరకు ఋణాలు తీసుకున్న వాళ్లకు ఋణమాఫీ చేయడానికి ఈ రోజు ముఖ్యమంత్రిగారు ముందుకు వచ్చారు. పిండికొద్దీ రొట్టె లాగా మనం ఈ రోజు ఉన్నాం కాబట్టి, వ్యవసాయానికి అనుబంధంగా ఈ రోజు నీటిపారుదలను తీసుకురావడానికి మన ముఖ్యమంత్రిగారు వాటర్‌గ్రిడ్, ఇరిగేషన్ మీద చాలా ఆలోచనలు చేస్తున్నారు. ఈరోజు పోలవరంను జాతీయం చేయడమే కాకుండా నదుల అనుసంధానం మీద దృష్టి పెట్టి పట్టిసీమ, తాడిపూడి, హంద్రీనీవా, గాలేరునగరి, వెలిగొండ, వంశధారలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి వాటిని సఫలీకృతం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వాటిని పూర్తి చేసి తొందరలోనే వ్యవసాయానికి కావాల్సిన నీళ్లను ఇవ్వడానికి కూడా ఈ రోజు ప్రభుత్వం ఆలోచనలో ఉంది. నాణ్యమైన వ్యవసాయానికి కావాల్సిన అనేక పథకాలను ప్రవేశపెట్టి, వాటికి కావాల్సిన నిధులను కూడా ప్రభుత్వం కేటాయించడం జరిగింది. పిల్లలకు తల్లిదండ్రులు, అవ్వతాతలు మంచిపేర్లు పెట్టి చక్కగా పిలుచుకున్నట్లుగానే ఆరోజు హంద్రీ-నీవా, సుజలస్రవంతి, గాలేరునగరీ, తెలుగు గంగ అని మహానుభావుడు శ్రీ యన్.టి రామారావుగారు మంచి పేర్లు నామకరణం చేయడం జరిగింది. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ఒక్కసారి చూస్తే అదేదో సొంత తల్లిదండ్రుల ఆస్తి అన్నట్లుగా చాలావాటికి పేర్లు మార్చడం జరిగింది. అప్పటినుండి చాలా మంది ముఖ్యమంత్రులు మారారు. వాళ్లు ఎవ్వరూ వాళ్ల నాన్నగారి పేర్లు పెట్టుకోలేదు. మా అనంతపురానికి వచ్చే సరికి శ్రీరాం రెడ్డి సుజల స్రవంతి అని, శ్రీరాం రెడ్డి నీటిపథకం అని, అనంత వెంకట రెడ్డి నీటి పథకం అని ఈ రకమైన పేర్లు పెట్టుకోవడం జరిగింది. వారు చనిపోయి ఎక్కడున్నారో కానీ వాళ్ల ఆత్మ మాత్రం క్షోభిస్తుంది. సరైన

విధానంలో ఎక్కడా కూడా కాలువలను మళ్లించలేదు. వాటికి పైపులైను పెట్టి, వాటి కనెక్షన్ సరిగా లేక, మధ్యమధ్యలో విరిగిపోయి, పైకి నీళ్లు వెదజల్లుతూ, ఎక్కడా కూడా ఏ ప్రాంతానికి నీటి సౌకర్యం లేకుండా పోయింది. దానిని దృష్టిలో ఉంచుకుని ఈ రోజు మన ముఖ్యమంత్రి గారు తగు శ్రద్ధ తీసుకోవడం వలన, నీటిపారుదల శాఖామంత్రి శ్రీ ఉమామహేశ్వర రావు గారి కృషి వలన జీడిపల్లి రిజర్వాయరు నుండి అనంతపురం జిల్లాకు మంచినీరు రావడంతో అనేక చెఱువులు,కుంటలు, వాగులు నీటితో నిండాయి. మార్చి నెల వచ్చినా సరే ఎండాకాలంలో చెరువులలో నీళ్లు ఉన్నాయి. దానికి సంబంధించిన బోర్లలో నీటి శాతం ఎక్కువగా ఉంది. ప్రజలందరూ కూడా ఎంతో సంతోషంగా ఉన్నారు, ప్రభుత్వాన్ని ఎంతో హర్షిస్తున్నారు. అవన్నీ కూడా ఈ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు. పట్టిసీమ ద్వారా గోదావరి నుండి వృ థాగా సముద్రంలో కలుస్తున్న నీటిని అనుసంధానం చేసి కృష్ణాకు రావడం, కృష్ణానుండి శ్రీశైలం రావడం, అక్కడి నుండి మన రాయలసీమకు నీళ్లు రావడానికి కృషి చేస్తుంటే ఈనాడు దానిని వక్రీకరించి మాట్లాడుతున్నారు. చేసిన పాపం అంతా చేసి పాపాల భైరవుడిగా చంద్రబాబునాయుడు గారిని ఈ రోజు అనడం భావ్యం కాదు. ఒక ప్రక్క తింటూనే తిమ్మరాయపాలెం పాడుతూనే ఉన్నారు.

శ్రీ ఎం. సుధాకర్ బాబుః చంద్రబాబు నాయుడు గారిని పాపాల భైరవుడని మీరే అన్నారు. అక్కడ రికార్డు అయ్యింది.

శ్రీమతి పమిడి శమంతకమణిః అవును, అనుభవిస్తున్నాము. మీరు చేసిన పాపం అంతా మేము అనుభవిస్తూ, మీతో అనిపించుకుంటున్నాము. మా ఖర్మ ఇలా ఉంది.

శ్రీ బి. చెంగల్ రాయుడుః శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు గారిని పాపాల భైరవుడని మీరే అన్నారు. కావాలంటే రికార్డులు చూడండి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః పాపాల భైరవుడని మీరు అంటున్నారు, మీ పాపాలన్నీ మాకు అంటగట్టారని శమంతకమణి గారి ఉద్దేశం.

శ్రీమతి పమిడి శమంతకమణిః నిన్న పార్లమెంటు సమావేశాలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా టీవీలో చూశాము. చేసిందంతా చేసి, ఒక లక్షాధికారి కూడా తనకు సంబంధించిన వారికి ఒక వీలునామా రాసి పెట్టిపోతాడు. మరి ఇక్కడ అటువంటి వీలునామా కాదు కదా, ఎక్కడా కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఈ రకమైన సౌకర్యాలు కల్పించాలి, విధివిధానాలు ఈ విధంగా ఉండాలని పేర్కొనలేదు. గత ప్రభుత్వం రైల్వే జోను అన్నారు, మరొకటి అన్నారు, అవేమీ చేయకపోగా కనీసం రాజధాని గురించి కూడా ఆలోచన చేయలేదు. ప్రతిపక్ష సభ్యులని కాదని చెప్పమనండి.

శ్రీ ఎం. సుధాకర్ బాబు : అధ్యక్షా.........

MR. DEPUTY CHAIRMAN: Please take your seat.

శ్రీ ఎం. సుధాకర్ బాబు : అధ్యక్షా మా పేరు చెప్పి కామెంట్ చేస్తున్నారు.

శ్రీమతి పమిడి శమంతకమణి : జరిగిందే చెబుతున్నాను. మేమేం అబద్ధం చెప్పడం లేదు.

MR. DEPUTY CHAIRMAN: Please continue.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, రాజధాని గురించి, భూసేకరణ గురించి నిన్న ఎంత పెద్ద రాద్ధాంతం చేశారు? ఒక ఎంపీ గారు అన్నారు, మాకు తెలంగాణా వచ్చిన తరువాత ఎన్నికలలో గెలిచిన తరువాత బంగారు తెలంగాణా కోసం మా ముఖ్యమంత్రి గట్టిగా ప్రయత్నం చేస్తున్నారని అన్నాడే గాని, ఎక్కడైనా అమ్మ సోనియా అని గాని, మా దేవత సోనియా అని గాని ఎక్కడైనా ఒక మాట మాట్లాడారా?

మాట్లాడరు. అయిపోయింది, వాళ్లు బాగా బంగారు తట్టలో మణులు పొదిగి, చేతికి ఇచ్చారు, కానీ, మన చేతికి చిప్ప ఇచ్చారు, ఈ చిప్ప పట్టుకుని మనం రాజధాని కట్టుకోవాలి. ఈ రకంగా మన యొక్క రాష్ట్రపరిస్థితి అధ్వాన్న పరిస్థితిలోకి తీసుకువచ్చి ప్రతీ ఒక్కరూ కూడా ఈ రోజు శ్రీరంగనీతులు మాట్లాడుతున్నారు. కూడు, గూడు అన్నారు. ఇప్పుడు గూడు గురించి మాట్లాడుకుందాము. సొంత గూడే లేదు, రాజధానే లేదు, మరి కూర్చోడానికి ఒక కుర్చీ, ఆఫీసు లేదు. మనం ఎక్కడుంటున్నాము. ఇంత అధ్వాన్న స్థితికి తీసుకువచ్చిన తరువాత ఇంత సంక్షోభానికి మన రాష్ట్రాన్ని తీసుకువచ్చాక, సంక్షేమం ఎలా ఉంటుంది? ఈ రోజు గత ప్రభుత్వాన్ని దృష్టిలో ఉంచుకుని చూస్తే కట్టుకోని వాడు పాపాత్ముడు, తిననివాడు పాపాత్ముడు అన్నట్లుంది. మంజూరు చేసిన ఇళ్లు ఏవీ కట్టుకోకుండా ఒక్కొక్కరు 10,11 ఇళ్లకు బిల్లులు చేసుకోవడం జరిగింది. ఈ విషయం ఇక్కడున్న పెద్దలందరికీ తెలియదా? నిన్న మా సోదరుడు అన్నాడు, ఆ విధంగా చేసినవారిని అరెస్ట్ చేయండి వక్కలు వేసుకుని వెళ్లి తుపుక్కుమని ఉమ్మి వద్దామని అన్నాడు. అప్పుడే ఊసి ఉండి ఉంటే ఈ రకంగా అన్యాయంగా, అక్రమంగా, అవినీతి పరంగా డబ్బులన్నీ మెక్కేవాళ్లు కాదు. మస్తుగా తిన్నారు, సుస్తుగా అవినీతి చేశారు. గూడులో జరిగిన విషయం అది. ఈ రోజు ఇల్లు కట్టాలంటే ఎవరికి ఇస్తారు? ఏ పేదవాడి పేరు చూసినా సరే అప్పుడే ఇచ్చినట్లుంది. ఎవరిని చూడు వారి పేరుమీద, వాళ్ల కొడుకు పేరుమీద, కోడలి పేరు మీద ఉన్నట్లు రికార్డులలో ఉన్నాయి.

మ.12.20

ఈ రోజు గృహాలను ఆధార్‌కార్డుతో ఎందుకు అనుసంధానం చేస్తున్నారు, ఎందుకు పరిశీలిస్తున్నారు అని అంటున్నారు. చెయ్యకుండా ఏమి చేయాలి? ఎవరికి ఇవ్వాలి? శ్రీ బి. చెంగల్‌రాయుడు గారికా, శ్రీమతి పి.శమంతకమణికి ఇవ్వాలా? అప్పుడే పుట్టిన మనవరాలి పేరిట కూడా ఆ రికార్డులో ఉంది. కానీ ఎక్కడ ఒక ఇల్లు కూడా కట్టలేదు. అన్నింటికి బిల్లులు తీసుకోవడం జరిగింది.

శ్రీ ఎం. సుధాకర్ బాబు : (మైక్‌లేకుండా) అధ్యక్షా, వారు అబద్ధాలు చెబుతుంటే వినాల్సిందేనా? అన్నీ అబద్ధాలే చెబుతున్నారు....

Mr. DEPUTY CHAIRMAN : No, next I will give you time. Please take your seat. Next you will be given an opportunity. Let her complete.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, గృహనిర్మాణానికి సంబంధించి రూ.897/- కోట్లు ఇవ్వడం జరిగింది. ఆధార్‌కార్డు అనుసంధానంగా ఈ రోజు మిగిలిపోయిన పాపము అమాయకమైన పేదవారికి ఇళ్లివ్వడమనే బృహత్తర పథకము మనముందు ఉన్నది. అంతేకాదు ...

శ్రీ బి. చెంగల్ రాయుడు : ఒక ఇల్లు కూడా ఇవ్వకుండా ఉంటే ఎలా ?

శ్రీమతి పమిడి శమంతకమణి : ఏమి చేస్తాము, ఎవరికని ఇల్లు ఇస్తాము, పుట్టబోయే పిల్లోడు పేరు మీద కూడా రిజిష్టరు అయి ఉంది.

మిస్టర్ డెప్యూటి ఛైర్మన్ : శ్రీ బి.చెంగల్‌రాయుడు గారు, మీ వాళ్లు ఇంకా మాట్లాడటానికి అవకాశం ఉన్నవారు ముగ్గురు ఉన్నారు, అప్పుడు చెప్పండి, let her complete. Please wind up. త్వరగా పూర్తి చేయండి.

శ్రీమతి పమిడి శమంతకమణి : మేధస్సు కలిగిన వాడే రేపు భవిష్యత్తులో చక్కగా పని చేస్తాడనే ఉద్దేశంతో విద్య లేని వాడు వింత పశువు అనే ఆలోచనతో విద్యావిధానాన్ని మెరుగుపరచడానికి, అధికశాతం మన బడ్జెటులో ఇవ్వడం జరిగింది. ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యావిధానానికి ఈరోజు రూ.14,692 కోట్లు ఇవ్వడం జరిగింది. గతంలో శ్రీ ఎస్.చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు

జన్మభూమి కార్యక్రమంలో ప్రతి గ్రామానికి వచ్చినప్పుడు,మధ్యంతరంగా బడి వదిలిన పిల్లలను మళ్లీ బడికి పోదాం రండి అనే ఒక కాన్సెప్ట్‌తో బ్రిడ్జి స్కూల్ కట్టించారు. ఈ రోజుకి కూడా ఆ బ్రిడ్జి స్కూళ్లు ఉన్నాయి. ఆ పిల్లలందరిని కూడా చక్కగా చదివించడం జరిగింది. మరొకసారి 'అందరికీ విద్య, బడి పిలుస్తోంది' అనే కార్యక్రమాల ద్వారా ఈ రోజు విద్యావ్యాప్తి చేయడానికి ప్రభుత్వం పూనుకొన్నది. సర్వశిక్షాఅభియాన్ ద్వారా పేద పిల్లలకు యూనిఫామ్స్, పుస్తకాలు, మధ్యాహ్నభోజన పథకం ఇటువంటి వన్నీ కూడా ప్రాథమిక విద్యా విధానంలో ఉంచి, ఆ పిల్లలందరినీ కూడా చక్కగా చదివించి భవిష్యత్తులో మంచి పిల్లలుగా తయారు చేయడానికి అనేక పథకాలు ప్రవేశ పెట్టడం జరిగింది. ఇంటర్మీడియట్ విద్యావిధానంలో ఈ రోజు రూ.525 కోట్లు కేటాయించడం జరిగింది. ఇప్పుడు గమనిస్తే సుమారు 444 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు గానీ,130 ఎయిడెడ్ కళాశాలలు గాని ఇంటెన్సివ్ జూనియర్ కాలేజీ పథకం ద్వారా ప్రవేశపెట్టడం జరిగింది. ఉన్నత విద్యకు రూ.3049 కోట్లు కేటాయించడం జరిగింది. నాణ్యమైన ప్రమాణాలతో ఈ విద్యావిధానం పెంచుతూ, బీదవర్గాలకు చెందిన ఎస్.సి., ఎస్.టి. వర్గాలకు చెందిన పిల్లలు విదేశాలు వెళ్లడం కోసం, వారిని ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో అంబేద్కర్ విద్యాయోజనను ప్రవేశపెట్టడం జరిగింది.

గతంలో ఎస్.సి., ఎస్.టి. స్టడీ సెంటర్లు ఉండేవి. రానురానూ ఆ స్టడీ సెంటర్లు కూడా మూతపడిపోయి ఎస్.సి., ఎస్.టి. వర్గాల పిల్లలకు విద్యావిధానంలో చేయూతనిచ్చే కార్యక్రమం నిలిచిపోయింది. ఈనాడు తిరిగి ప్రవేశపెట్టి చక్కని విద్యావిధానం ద్వారా ఆ పిల్లలందరికీ మేధస్సును పెంచి ముందుకు తీసుకురావాలనే మంచి ఉద్దేశంతో ఈ రాష్ట్రప్రభుత్వం ఉంది. స్వర్గీయ రాజీవ్‌గాంధీగారు టెక్నాలజీని తీసుకువచ్చారని నిన్ననే ఒక గౌరవసభ్యులు చెప్పారు. నిజమే కానీ దానిని రూపొందించి ఆ టెక్నాలజీని పటిష్టపరిచింది ఎవరు? ఈయన హైటెక్ ముఖ్యమంత్రిగారు అని ఆనాడు అందరూ మెచ్చుకున్నారు. ఈనాడు చూస్తే, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతుకుటుంబాల పిల్లలు బెంగుళూరులో, మద్రాసులో, బొంబాయిలో, హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తూ తల్లిదండ్రులకు సహాయం చేయడం జరుగుతోంది. పెట్టుబడి పెట్టి వారు భూములు కొని, ఇంటివద్ద ఉన్న అన్నదమ్ములంతా వ్యవసాయరంగంలో ముందుకు వచ్చి ఆర్థిక పరిపక్వం చెందుతున్నారంటే కారణం ఏమిటంటే, ఆరోజుల్లోనే అనేక కంపెనీలకు కావలసిన రాయితీలిచ్చి శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు గారు హైటెక్ సిటీనే ఏర్పాటుచేసి అనేక కంపెనీలను ఇక్కడకు తీసుకువచ్చి యువకులందరికీ ఉద్యోగావకాశాలు కల్పించి ఈరోజు ఒక ఉన్నతస్థాయికి హైదరాబాదును తీసుకెళ్లడం జరిగింది. అటువంటి హైటెక్‌సిటీని ఈనాడు ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించాలంటే సాధ్యమా? ఆరోజు మాట్లాడిన పెద్దమనుష్యులు నేడు ఢిల్లీకి వెళ్లి ప్రత్యేక హోదా క్రింద మన రాష్ట్రానికి అన్నీ తీసుకురావచ్చు కదా? అవన్నీ ఏమీలేవు. ఊరికే అంటూ ఉంటాము. వారు పడుతూ ఉంటారు. మేము నవ్వుతూ ఉంటామనే విధానం కాదు. మా చిన్నప్పుడు హైదరాబాదు, సికింద్రాబాదు అని రెండు నగరాలు మాత్రమే ఉండేవి. కానీ, శ్రీ చంద్రబాబునాయుడు గారు అధికారంలోకి వచ్చిన తర్వాత హైటెక్ సిటీని ఏర్పాటు చేయడం వల్ల సైబరాబాద్ అనే ఒక ప్రత్యేక నగరాన్నే సృష్టించడం జరిగింది. సుందర పట్టణంగా తీర్చిదిద్దడం వల్ల ప్రపంచ నేతలంతా హైదరాబాదుకు రావాలి. హైదరాబాదు నగరాన్ని చూడాలి. శ్రీ చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను చూడాలని బిల్ క్లింటన్ లాంటి మహానుభావులందరూ ఇక్కడకు రావడం జరిగింది.

ఆ రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న డ్వాక్రా మహిళలు కూడా హలో బిల్ క్లింటన్ గారూ! బాగున్నారా! అనే విధంగా శ్రీ చంద్రబాబునాయుడు గారు ఈ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం జరిగింది. అటువంటి పరిపాలన మన ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ రావడం కోసం ఈనాడు మనమంతా సమైక్యంగా ఆయనకు చేయూతనివ్వడానికి ఆలోచించాలి గానీ సుధాకర్‌గారి లాగా లేచి నిలబడడం కాదు.

ఆ రోజుల్లోనే మహానుభావుడు స్వర్గీయ శ్రీ ఎన్.టి.రామారావు గారు నోటి నుంచి "ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం" అని వచ్చింది. రూ. 2 లకే కిలోబియ్యం, సబ్సిడీ ధరకే బట్టలు, బలహీనవర్గాలకు గృహనిర్మాణం చేపట్టడం జరిగింది. అదే పంథాలో నేడు కూడా చేనేత వర్గాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషిచేయడం జరుగుతోంది. అప్పట్లో విక్టోరియా మహారాణికి ఒక అగ్గిపెట్టెలో చీరను తీసుకెళ్లడం జరిగింది. అంత ప్రావీణ్యం కలిగిన మన చేనేత కార్మికులకు తిరిగి వారందరినీ అప్పులఊబినుంచి బయటకు తీసుకురావడానికి, వారందరికీ మంచి జీవితం కల్పించడానికి రూ.469కోట్లు కేటాయించడం, మరమగ్గాలు, సహకారసంఘాలు ఏర్పాటుచేయడం జరిగింది. పేదవాళ్లందరికీ రూపాయికే కిలోబియ్యం పథకం అమలుచేయడం జరుగుతోంది. మొన్ననే సంక్రాంతి పండుగ సందర్భంగా సంక్రాంతి చంద్రన్న పథకం ద్వారా ఆరు నిత్యావసర వస్తువులను పేదవారికి అందజేయడం జరిగింది. ఈనాడు సంక్రాంతి పండుగను ప్రతి పేదవాడు సంతోషంగా జరుపుకోవడం జరిగింది. రేషన్‌కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేయడం జరిగింది. గత ప్రభుత్వాన్ని పరిశీలిస్తే, ఆర్థికంగా బాగా ఉన్నవారి వద్ద కూడా ఒక్కొక్కరి వద్ద 10 రేషన్‌కార్డులున్నాయి.

మ. 12.30

పేదవారికి ఎటువంటి రేషన్ కార్డులు లేవు. ఒక్కొకరి దగ్గర సుమారు 10, 12 ఉన్నత వర్గాల దగ్గర ఉండిపోయాయి. అందువలననే ఈ రోజు ఆధార్ కార్డును అనుసంధానం చేసి అందులో ఇపిఒస్ యంత్రాలను చౌకధరల దుకాణాలలో పెట్టి వీటినన్నింటిని క్రమబద్ధీకరించడానికి మన ప్రభుత్వం ముందుకు వస్తున్నది. అంతేకాదు, ఆరోగ్య విధానంలో కూడా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య విధానాన్ని మెరుగుపరచి, అందరికీ వైద్యం అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ రోజు ఇంత మహోన్నతమైన పథకం ద్వారా రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెడుతుంటే, శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు గారిని అభినందించలేకపోతున్నాము. అటువంటి నాయకునికి, అటువంటి ఆలోచన కలిగినవారికి మంచి సలహాలు ఇచ్చి, చక్కగా ఈ యొక్క విధానాన్ని నడిపించే నాయకత్వానికి మనము కూడా చేయూతనిచ్చి బలోపేతం చేయాలి కానీ ఏదో అనాలంటే అనాలి, పెట్టాలంటే పెట్టాలి అనేది కాదు. గతాన్ని ఇప్పటికి గమనిస్తే మరి ఎలాంటి విధానం లేకుండా ఆరణ్యావాసంలో ఉంటున్న ఈ ఆంధ్రను నవ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడానికి, స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడానికి దేవుడు ఆయురారోగ్యాలు మన ముఖ్యమంత్రిగారికి ఇవ్వాలనీ, ఈ యొక్క ఆర్థిక విధానాలను మరింత బలోపేతం చేయాలనీ నేను కోరుతూ, విరమించుకుంటున్నాను.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : శ్రీ బసవ పున్నయ్యగారు మీ గొంతు వినాలని అందరూ అనుకుంటున్నారు.

శ్రీ సింగం బసవ పున్నయ్య : చివరన మీరు అనుమతి ఇస్తే అప్పుడు మాట్లాడుతాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారు ప్రవేశపెట్టినటువంటి 2015-16 బడ్జెట్‌కు సంబంధించి మాట్లడే అవకాశం కల్పించినందుకు మీకు నా ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 2015-16 సంవత్సరానికి సంబంధించినటువంటి బడ్జెటును ఒకసారి మనము చూసినట్లయితే నిరుపేదలకు ముఖ్యంగా రైతాంగానికి, బలహీనవర్గాల వారికి చాలా అనుకూలమైనటువంటి ప్రగతి శీలమైనటువంటిదిగా ఉందని నేను అభినందిస్తున్నాను. 2015-16 బడ్జెట్‌కు సంబంధించి బడ్జెట్ యొక్క గణాంకాలను పరిశీలిస్తే ఈ బడ్జెట్ మొత్తం రూ.11,349కోట్లుగా ఉంది. గడచిన సంవత్సరానికి సంబంధించినటువంటి బడ్జెట్ చూసినట్లయితే రూ.1,11,823కోట్లు ఉన్నది. అంటే గడచిన సంవత్సరానికి, ఈ సంవత్సరానికి

సంబంధించి ఆ వ్యత్యాసం గానీ, పెంపుగానీ చూసినట్లతే 1.1 శాతం వెనుక ఉందని ఈ గణాంకాలు మనకు తెలియజేస్తున్నాయి. ఈ సంవత్సరం ప్రణాళికా బడ్జెట్ చూసినట్లయితే రూ.34,148 కోట్లుగా ఉంది. అదేవిధంగా, గడచిన సంవత్సరం చూసినట్లయితే రూ.26,678 కోట్లుగా ఉంది. అంటే ఈ రెండింటి యొక్క వ్యతాసం చూసినట్లయితే, ప్రణాళిక వ్యయం యొక్క పెంపు చూసినట్లయితే ఈ సంవత్సరానికి సుమారు 29.0 శాతం అత్యధికంగా ఉంది. ఇది ఖచ్చితంగా అభినందించవలసినటువంటి విషయము. ఇక ప్రణాళికేతర వ్యయానికి సంబంధించినది చూసినట్లయితే రూ.78620కోట్లు ఇది కాస్త తగ్గిన విషయము వాస్తవము. ముఖ్యంగా చూసినట్లయితే.... ఈ బడ్జెట్‌లో సామాన్యునికి ఏ విధమైనటువంటి భారంలేకుండా వారికి ఎక్కడ నష్టం కలిగించే విధంగా లేకుండా రూపొందించినటువంటి అత్యంత చక్కని బడ్జెట్‌గా నేను భావిస్తున్నాను. ముఖ్యంగా గడచిన సంవత్సరం వచ్చినటువంటి అనేకమైనటువంటి విపత్తుల వలన కానీ ఒక పక్క చూసినట్లయితే కరువుకాటకాలు, తుఫానులు, హుద్‌హుద్ తుఫానులు వచ్చినప్పటికి కూడా ముఖ్య రంగాలైనటువంటి వ్యవసాయం కానీ, పారిశ్రామికరంగం, సేవారంగంలోగానీ అభివృద్ధిని మనము చూసినట్లయితే ప్రోత్సాహకరంగా ఉన్నట్లు చెప్పవచ్చు. గడచిన సంవత్సరం 2014-2015 సంవత్సరానికి ఆహార ధాన్యాల ఉత్పత్తి అంచనా ప్రకారం ఒక కోటీ పదకొండు లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేయాలనీ అనుకున్నప్పటికి కాస్త 4.5 శాతం తగ్గిన మాట వాస్తవము. వ్యవసాయ రంగం అభివృద్ధి చూసినట్లయితే 5.95శాతంగా ఉంది. అదే విధంగా, పారిశ్రామిక రంగం చూసినట్లయితే 5.25శాతం ఉంది. సేవారంగం చూసినట్లయితే 8.48శాతం ఉంది. పారిశ్రామిక రంగం పెంపు జరగకపోవడానికి కారణాలు కూడా ఉన్నాయి. ఈ రాష్ట్రం విభజన ఏ పరిస్థితులలో జరిగింది. ఎందుచేత ఈ రాష్ట్రం ఈ విధమైనటువంటి ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యిందనేటువంటిది ఒకసారి మనము ఆలోచించవలసి ఉన్నది. దానిలో ముఖ్యంగా రెవెన్యూ లోటు చూసినట్లయితే ఈ సంవత్సరం రూ.7,300కోట్లుగా ఉంది. అదేవిధంగా fiscal deficit చూసినట్లయితే రూ.15584 కోట్లు ఉంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఈ రాష్ట్రానికి రెవెన్యూ లోటు రూ.16,000 కోట్లు ఉండటం వల్ల ఈ రాష్ట్రం ఆర్థికంగా చాలా వెనుకబడి ఉంది. కనీసము రాజధాని కూడా ఏమిటి, ఎక్కడ అని తెలియకుండా రాష్ట్రవిభజన చేసినప్పుడు మరి అశాస్త్రీయంగా చేసి మరి సాంకేతికంగా చేయలేనటువంటి దుస్థితిలో ఈ రాష్ట్రప్రభుత్వం ఈతిబాధలను ఎదుర్కొంటున్న పరిస్థితిలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబునాయుడు గారు గడచిన రెండు సంవత్సరాల క్రితం ఆయన చేసినటువంటి సుదీర్ఘమైనటువంటి పాదయాత్ర యావత్ భారతదేశంలోనే 3వేల కి.మీ. పాదయాత్ర చేసినటువంటి నాయకుడు ఉన్నాడా అంటే మరి లేరు అని చెప్పగలను. ఆ విషయములో చూసినట్లయితే గ్రామాలలో తిరిగినప్పుడు అక్కడ ఉన్నటువంటి రైతుల ఈతిబాధలు కానీ, పేదలయొక్క ఆలోచనా సరళి కానీ అక్కడ ఉన్నటువంటి వాళ్ల ఆవేదనను దృష్టిలో పెట్టుకొని మరి రైతాంగానికి మనం తప్పనిసరిగా ఏదో విధంగా సహాయం చేయాలని, ఋణగ్రస్తులైనటువంటి రైతులకు ఏదో ఒకటి కల్పించాలని ప్రతిజ్ఞ చేసినటువంటి వాగ్దానాలలో భాగంగానే వారికి మొదటి దశలోనే ఈ సంవత్సరం సుమారు రూ.5,000 కోట్లు ప్రాథమిక దశలో చేయడం జరిగింది. దాని ద్వారా సుమారుగా నలభైలక్షల ఇరవై ఆయిదు వేల రూపాయల లోపు ఉన్నటువంటి వారికి లబ్ది చేకూరుతుంది . రెండవ దశలో కూడా కొంతమందికైనా లబ్ధి చేకూర్చాలనే ఆశయంతో ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో కూడా ఆర్థికంగా మనకు లోటు ఉండి, కేంద్రము నుంచి రావలసిన నిధులు వస్తాయని అనుకున్నప్పటికి, అది జాప్యం జరుగుతున్నప్పటికి ఇక్కడ ఉన్నటువంటి రైతాంగం యొక్క దుస్థితి గానీ, అప్పుల ఊబిలో కూరుకుపోయినటువంటి పరిస్థితిగురించి NSSO ఆధ్వర్యంలో సర్వే చేయడం జరిగింది. 93 శాతం మంది ఈ రాష్ట్రంలో రైతాంగం అప్పుల్లో కూరుకుపోయిందని వారు వ్యక్తం చేయడం జరిగింది.

మ. 12.40

ఇటువంటి పరిస్థితులలో వారికి ఏదోవిధంగా చేదోడు వాదుడుగా ఉంటూ, ఊరట కల్గిస్తూ, అప్పుల బాధ నుంచి రైతాంగాన్ని పైకి తీసుకురావాలనే ఉద్దేశంతో చేసిన ఈ ప్రక్రియను మనం హేళనగా మాట్లా డడం సబబు కాదని నేను ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను. పార్టీలకు అతీతంగా సహాయం చేయకపోతే ఇంత ఊబిలో ఉన్న ఈ రైతాంగం భవిష్యత్తులో వ్యవసాయం చేయలేకపోతుందేమోనన్న భావన కూడా కలుగుతోంది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా వాసిగా, ఒక రైతు బిడ్డగా నేను ఇదే సభలో గొంతెత్తి ఘోషించిన సంఘటనలు చెపుతున్నాను. రైతాంగాన్ని ఎట్టి పరిస్థితులలో ఆదుకోవాలి. ప్రభుత్వం రైతాంగం యొక్క సంక్షేమం చూడకపోతే చాలా కష్టమైపోతుంది. సుమారు 65 శాతం మంది ఎక్కువగా వ్యవసాయం మీద ఆధారపడిన వారే ఉన్నారు. రైతాంగం అంతా కుదేలైపోయే పరిస్థితికి వస్తుందనేది మనందరికీ తెలుసు.

ఈరోజున వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలకు సుమారు రూ.14,184కోట్లు బడ్జెటులో కేటాయించారు. అందులో మత్స్య పరిశ్రమ, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, మీట్ మొదలైనవి ఉన్నాయి. అలాగే ఉద్యానవన పంటలు చూసినట్లయితే, సుమారు 45 లక్షల ఎకరాల పంటలు మన రాష్ట్రంలోనే ఉన్నాయి. వాటి ఉత్పాదకత కూడా పెరిగింది. ఈ రోజు రాష్ట్ర ఆర్థిక వృద్ధిలో వ్యవసాయ రంగం వాటా సుమారు 28.97 శాతం ఉంది. వీటి ఉత్పత్తిలో రైతులందరూ భాగస్వాములు అవుతున్నారు.

అదేవిధంగా, మత్స్య పరిశ్రమకు సంబంధించి చూసినట్లయితే, యావత్ భారతదేశంలోనే మన రాష్ట్రం రెండవ స్థానంలో ఉందని తమ ద్వారా తెలియజేస్తున్నాను. మత్స్య పరిశ్రమలో చేపలు, రొయ్యల వలన సుమారు రూ.26,000కోట్లు మన దేశం నుంచే ఎగుమతి అవుతున్నాయి. అందులో సుమారు రూ.13,000కోట్లు మన ఆంధ్రప్రదేశ్ నుంచి ఎగుమతి అవుతున్నాయంటే, మన రైతాంగం యొక్క శ్రమ, కృషి, పట్టుదలలేనని ఈ సందర్భంగా చెప్పకతప్పదు. ఇటువంటి పరిస్థితులలో రైతాంగం ఎక్కడైతే ఇబ్బంది పడుతున్నారో, ఆరుకాలం కష్టించి పని చేసిన రైతాంగం గిట్టుబాటు ధరలు లేక ఈ రోజు 'అలో రామచంద్రా' అని బాధపడుతున్నారు. వారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతో ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మత్స్య రంగానికి సంబంధించిన గిడ్డంగులు, శీతల గిడ్డంగుల విషయంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా ఉండాలని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. పాల ఉత్పత్తిలో యావత్ భారతదేశంలోనే మన రాష్ట్రం ద్వితీయ స్థానంలోను, మాంసం ఉత్పత్తిలో కూడా దేశంలోనే ద్వితీయ స్థానంలో ఉంది. అలాగే, దేశంలో తయారయ్యే సుమారు 5 గుడ్లలో ఒకటి ఈ రాష్ట్రంలోనే తయారయ్యింది అంటే ఈ రాష్ట్రం పౌల్ట్రీ రంగంలో ఎంతగా అభివృద్ధి చెందుతోందో ఆలోచించాలని కోరుతున్నాను. అలాగే, వ్యవసాయ అనుబంధ రంగాలలో ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది కాబట్టి, వీటిని ఇంకా ఏ విధంగా అభివృద్ధిలోకి తీసుకురావాలో సరైన ఆలోచన చేయాలని ఈ ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. అలాగే, వారికి కావలసిన రవాణా మద్దతుధర, గిట్టుబాటు విషయంలోను, మరియు వారు పండించిన పంటలను నిల్వ చేసుకునే సదుపాయాలను కూడా కల్పించాలని తమ ద్వారా ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. పై కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయకపోతే రైతాంగం కుదేలైపోయే పరిస్థితి వస్తుంది కాబట్టి, ఆ విధంగా జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని వారిని ఆదుకోవాలని తమ ద్వారా కోరుతున్నాను.

ఇటువంటి పరిస్థితులలో మనకు ఎక్కడ నుంచి ఉత్పత్తులు వస్తాయి, ఎక్కడ ఉత్పత్తులు పెరగాలో అక్కడ ఖచ్చితంగా రీసెర్చ్ అండ్ డెవలప్ మెంటు కూడా తప్పనిసరిగా ఉండాలి. వాటి వలన క్రొత్త వంగ డాలను తీసుకురావాలి. అలాగే చేప పిల్లలు పెంపకం విషయంలో కూడా విస్తృత పరిశోధనలు జరగడం

వలన రైతాంగానికి చేయూతను ఇవ్వగలుగుతాం. ఈ విధంగా పరిశోధనలు చేయడం వలన యావత్ భారతదేశంలోనే మనరాష్ట్రం వ్యవసాయ రంగంలో అగ్రగామిగా ఉండాలని తమ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

నీటిపారుదల రంగానికి సంబంధించి ఒకసారి పరిశీలించినట్లయితే, మన రాష్ట్రంలో ఉన్న 5 జీవన దులు–కృష్ణా, గోదావరి, పెన్నా, నాగావళి, వంశధార ఇవన్నీ ఈ రాష్ట్రానికి వరదాయకంగా ఉన్నాయి. ఈ 5 జీవ నదుల ద్వారా సుమారు ఒక కోటి, ఒక లక్ష, ఎకరాలు సాగులోకి తీసుకురావడం ద్వారా ఈరోజు ఆంధ్ర ప్రదేశ్ అన్నపూర్ణగా భాసిల్లుతుందని తెలియజేస్తున్నాను. వ్యవసాయరంగంలో సుమారు 14,85,000 మంది రైతాంగానికి ఉచిత విద్యుత్తును కూడా ఈ ప్రభుత్వం ఇస్తోంది. దీనికి సంబంధించి సుమారు రూ.3,000కోట్లు ఈ బడ్జెటులో కేటాయించడం జరిగింది. దీనివలన ఈ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఏ విధమైన తోడ్పాటు నందిస్తుందో అర్థమవుతోంది. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగారు ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్ళదలచుకున్నారో, దానికి ఇదే దృష్టాంతం, తార్కాణమని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టును కేంద్రం తీసుకుని, ఒక పోలవరం అథారిటీని పెట్టి, ఆ ప్రాజెక్టుకు శ్రీకారం చుడతామని చెప్పి, అందుకు సంబంధించిన డబ్బులను వారే ఖర్చుపెడతామని చెప్పడం జరిగింది. దీనికి సంబంధించి సుమారు రూ.16,000కోట్లు కావాలి. ఇప్పటికే రూ.5,000కోట్లు రాష్ట్రప్రభుత్వం ఖర్చు పెట్టింది. మిగిలిన ఆ సొమ్ము అంతా వీలయినంత త్వరలో వచ్చినట్లయితే, ఈ ప్రాజెక్టు త్వరిత గతిన పూర్తవుతుంది. లేకపోతే తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలలోని రెండవ పంటకు నీటి ఇబ్బంది ఎదురవుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఎందుకంటే, రబీ సమయంలో ఆయకట్టు చివరి ప్రాంతంలో ఉన్న పంట పొలాలకి నీరు అందక ఇప్పటికే రైతాంగం చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ఈ మధ్యనే రాష్ట్ర ముఖ్యమంత్రిగారు వరదల సమయంలో జూన్ నుంచి సెప్టెంబరు వరకు సుమారు 3,000 టిఎంసిల నీరు సముద్రంలో కలిసిపోతోంది. ఆ నీటిని ప్రభుత్వం ఏ విధంగా ఉపయోగించుకోవాలనే ఆలోచన చేసింది. అందుకోసం పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా దానిని లిఫ్ట్ చేసి, కృష్ణా నదిలోకి అనుసంధానం చేయడం ద్వారా రాయలసీమ, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకి నీటిని పంపించేవిధంగా తగిన చర్యలు తీసుకుంటున్నందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నాము. అక్కడ త్రాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజల ఈతిబాధలను తొలగించడానికి ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని అక్కడకు తరలించడానికి అవకాశం ఉంటుంది. పై కార్యక్రమాలకు సంబంధించి ఇతరులు ఏ విధంగా చెపుతున్నారో ఒకసారి చూడండి.

ఈ ప్రాజెక్టులు లేకపోతే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో రెండవ పంటకి ఖచ్చితంగా ఇబ్బంది ఉంటుంది. కానీ, వారికి ఏ ఇబ్బంది లేకుండా, ఎప్పుడైతే వరద నీరు వస్తుందో, ఆ వరద నీటిని తప్ప వేరే ఏ నీటిని కూడా లిఫ్ట్ చేయనని ముఖ్యమంత్రిగారు ఖచ్చితంగా, కరాఖండిగా చెప్పినప్పటికీ దానికి చాలామంది వక్రభాష్యాలు చెప్పి, ఈరోజు ఆయనని అవహేళన చేసే రీతిలో ఉన్నారు. ఇది యదార్థం కాదని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మరికొంతమంది గోదావరి నదికి వరదలు వస్తే, కృష్ణా నదికి కూడా వరదలు వస్తాయని చాలామంది అంటున్నారు. అది కాదు. ఇక్కడ జూన్ నుంచి సెప్టెంబరు వరకు వస్తే, అక్కడ సెప్టెంబరు తరువాత వస్తాయి కాబట్టి, ఆ నదులకు ఏ విధమైన ఇబ్బందులు ఉండవని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇటువంటి పరిస్థితులలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రిగారి మీద ఇటువంటి

మాటలు మాట్లాడడం అన్యాయం. ఆయనను గాయపరచే మాటలు మాట్లాడడాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. ఆయన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకి ఇబ్బంది లేని విధంగా చేస్తానని అన్నప్పుడు వారి మాటలను కూడా నమ్మవలసిన ఆవశ్యకత ఉంది. మన సోదరులైన రాయలసీమ వాసులకు కూడా సాగునీరు, త్రాగునీరు ఇవ్వడానికి ఈ వరద నీటిని తరలించాలనే ఆలోచనతో ఉన్నందుకు మీ ద్వారా ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను.

ఈ రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల జనాభా సుమారు 17.1శాతం ఉన్నారు. ఎస్టీలు 5.5శాతం ఉన్నారు. మొత్తంగా చూసినప్పుడు ఈ రాష్ట్రంలో 22.6 శాతం ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని మన గణాంకాలు తెలియజేస్తున్నాయి. దామాషా ప్రకారం ప్రణాళిక బడ్జెటులో వారికి 22.6శాతం నిధులు కేటాయించడం, వారి అభివృద్ధి కోసం విద్యా, వైద్య రంగంలో కాకుండా, సామాజిక అభివృద్ధి పరంగా వారిని పైకి తీసుకురావాలనే ఒక సదుద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఈ పథకాలు ఉన్నప్పటికీ అవి సరిగ్గా అమలుకాని పరిస్థితులు ఉన్నాయి. ఎందుకంటే, గతంలో ఉద్యమ పరిస్థితుల వలన ఈ రెండు రాష్ట్రాలు కూడా ఘర్షణ వాతావరణంతో కూడుకుని పథకాలను అమలుచేయలేకపోయాయి. కనీసం ఈ సంవత్సరమన్నా, దీనిని ఖచ్చితంగా చేయాలన్న ఒక సదుద్దేశంతో ఈ రాష్ట్రప్రభుత్వం ఎస్సీలకు సుమారుగా రూ.5,878కోట్లు, ఎస్టీలకు రూ.1,904కోట్లు కేటాయించడం అభినందనీయమని ఈసందర్భంగా తెలియజేస్తున్నాను.

విద్య, వైద్య రంగాలకు సంబంధించి ఈ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని తమ ద్వారా తెలియజేస్తున్నాను. "విద్య లేని వాడు వింత పశువు" అని ఇంతకుముందే సోదరీమణి ఒక మాట చెప్పారు. విద్య మనిషి సాధికారతకు, అభివృద్ధికి, ఆర్థిక అవసరాలకు ఎంత పాటుపడుతుందో చెప్పనవసరం లేదు. ఇటువంటి పరిస్థితులలో ప్రాథమిక విద్యకు సంబంధించి సుమారుగా రూ.14,962కోట్లను ఈ రాష్ట్రప్రభుత్వం కేటాయించడం జరిగింది. ప్రాథమిక విద్య ఎక్కడైతే పటిష్టంగా ఉంటుందో, అక్కడే తదుపరి మాధ్యమిక, ఉన్నత విద్య పటిష్టంగా ఉంటుందని విశ్వసించే వారిలో నేను ఒకడిని.

'బడి పిలుస్తోంది' అనే కార్యక్రమంలో ఈ సంవత్సరం సుమారు 6,33,000 మందిని పాఠశాలల్లో చేర్చుకోవడం జరిగింది. వారందరికీ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నిరుపేదలు అందరికీ, వారు చదువుకుంటే ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, తద్వారా కుటుంబం, వారి యొక్క ఆర్థిక పరిపుష్టి వలన ఈ దేశం కూడా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని ఆ దిశగా ఈ రాష్ట్రప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా మనవిచేస్తున్నాను.

ఇక విద్యుత్‌కు సంబంధించి చూసినట్లయితే, ఈ రాష్ట్రప్రభుత్వం ఆశాజనకంగానే ఉంది. జెన్‌కో ద్వారా సుమారు 4,560 మె.వా. విద్యుత్తును ఈ రాష్ట్రప్రభుత్వం ఉత్పత్తి చేస్తోంది. అలాగే హైడల్ ద్వారా సుమారు 3,500 వరకు విద్యుదుత్పత్తి వస్తోంది. రేషియో ప్రకారం జెన్‌కో నుంచి 61శాతం ఉన్నట్లయితే, హైడల్ ద్వారా 38 శాతం, పవన విద్యుత్తు ద్వారా కేవలం ఒక్క శాతం మాత్రమే ఈ రాష్ట్రానికి విద్యుత్తు వస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ముందు చూపు ఉన్న వ్యక్తిగా, శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు కేంద్రంతో సంప్రదించి మన రాష్ట్ర ప్రజలకు 24 గంటలు విద్యుత్తు రావడానికి కృషి చేశారు. ఈ ఘనత మన ముఖ్యమంత్రిగారికే దక్కుతుంది కాబట్టి, ఖచ్చితంగా మనమందరం ఆయనకు జేజేలు పలకాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మ. 12.50

అంటే 24 గంటలూ విద్యుత్ లేకపోతే, రాబోయే రోజుల్లో పారిశ్రామిక రంగం గానీ, సమాచార–సాంకేతిక రంగాలు గానీ, వ్యవసాయ రంగం గానీ అభివృద్ధి చెందవు, పురోభివృద్ధి ఉండదనే విషయం మనకందరికీ తెలుసు. మౌలిక వసతుల్లో ముఖ్యమైనది విద్యుత్. కాబట్టి, దానిపై శ్రద్ధ వహించి, ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో 24 గంటల పాటు విద్యుత్ ఇవ్వడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. దాన్ని ఖచ్చితంగా అమలు చేస్తుందని, ఇది నిర్వివాద అంశమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అదేవిధంగా నాణ్యమైనటువంటి, ఎఫ్పోర్డబుల్ ప్రైసెస్‌తో క్వాలిటేటివ్ విద్యుత్‌ని ఇవ్వాలనే ఆలోచనతో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉంది, ఖచ్చితంగా దాన్ని అమలు చేస్తుంది. ఈ రాష్ట్ర ప్రభుత్వం కాస్తో, కూస్తో విద్యుత్ ఉత్పత్తి తగ్గుతుందనే ఆలోచనతో, మన పక్క రాష్ట్రాల నుండి ముందే విద్యుత్‌ని బుక్ చేసుకోవడం ద్వారా, మనకు గత సంవత్సరమంతా ఎటువంటి ఇబ్బంది లేకుండా గడిచిపోవడం చక్కని ఉదాహరణ. ముఖ్యమంత్రి గారి ఆలోచనా సరళిని ప్రతిబింబించే విధంగా తీసుకున్న నిర్ణయమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మరో విషయమేమంటే, పౌర సరఫరాల గురించి కొంతమంది సభ్యులు మాట్లాడుతున్నారు. చంద్రన్న సంక్రాంతి కానుక ఏమిటి? ఏమిచ్చారు మీరు? 6 వస్తువులిచ్చారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రూ.250 కోట్లు ఎందుకు ఖర్చుపెట్టారని కొందరు మాట్లాడుతున్నారు. నాకేమీ అర్థం కావడం లేదు. ఈ రోజు రాష్ట్రంలో ఉన్న కోటీ ఇరవై లక్షల మంది తెల్లరేషన్ కార్డులున్న బీదలు, బలహీన వర్గాల వారు ఎవరైతే ఉన్నారో, వారికి కనీసం పండుగ రోజైనా కొంచెం తీపి తినిపించాలన్న ఉద్దేశంతో ఆలోచన చేస్తే, దానికి కూడా వక్రభాష్యం చెప్పే పరిస్థితుల్లో మనం ఉన్నట్లయితే, మనం ఎక్కడున్నామనేది ఒక్కసారి ఆలోచన చేసుకోవాలని మనవి చేస్తున్నాను. ఈ రాష్ట్ర విభజన తరువాత ప్రజానీకమంతా ఒక అయోమయ స్థితిలో ఉండి, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేటటువంటి పరిస్థితుల్లో ఉన్న సమయంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం, అధినేతగా ఉన్న శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు పాదయాత్రలో చూసినటువంటి ఇక్కట్లను దృష్టిలో ఉంచుకుని, ఈ విధమైన ఒక నిర్ణయం తీసుకుంటే, అవాకులు, చవాకులూ మాట్లాడితే సభ్య సమాజం ఏవిధంగా ఫీలవుతుందో ఆలోచించండి.

అధ్యక్షా, మనకు అప్పులుండొచ్చు, ఇబ్బందులుండొచ్చు. కానీ, భోజనం చేయడం మానివేయడం లేదే! ఏదో ఒకటి తినాలి కదా. కానీ, ఈ ప్రజానీకం కోసం, ఈ రాష్ట్రంలోని కోటీ ఇరవై లక్షల మంది కుటుంబాలకు తీపి తినిపిస్తే కూడా ఈ విధమైన వ్యాఖ్యలు చేసే పరిస్థితి, దుస్థితి ఉంటే సమాజం క్షమించదని తెలియజేస్తున్నాను. దీనికి సంబంధించి, రూ.2,459 కోట్లతో పౌర సరఫరాలు ప్రత్యేకంగా కేటాయించడమనేది ఈ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం 2013లో ప్రవేశపెట్టిన ఆహార భద్రత చట్టాన్ని తూ.చ. తప్పకుండా రాష్ట్రంలో అమలు చేయాలన్న ఉద్దేశంతో చేసిన కృషిలో భాగమని ఈ సందర్భంగా చెప్పకతప్పదని మనవి చేస్తున్నాను.

అదేవిధంగా క్యాపిటల్ విషయానికి వస్తే, ఈ రాష్ట్ర విభజన జరిగిన తరువాత మనకు రావాల్సిన అనేకమైనవి కోల్పోయి, ఎక్కడికి వెళ్లాలో దిక్కుతోచని, దయనీయమైన స్థితిలో ఉన్న ఈ రాష్ట్ర ప్రభుత్వానికి.. నాడు రాష్ట్రాన్ని విభజించినప్పుడు మేమందరం కూడా వ్యతిరేకించినవారిలో మొదటి వరుసలో ఉన్నాము. ఈ రోజున మా పక్కన ఉన్న పెద్దలు మీరు ఏ పార్టీలో ఉన్నారని అడుగుతున్నారు. నేను పార్టీ మారడానికి కారణం కూడా ఆ రోజున తీసుకున్న నిర్ణయమనే సమాధానంగా చెబుతున్నాను. ఆ రోజున మా గొంతెత్తి ఘోషించాము. రాష్ట్ర విభజనంటూ జరిగితే, సమూలంగా ఇబ్బందులుంటాయన్నాము. రాష్ట్రంలో రెవిన్యూ లోటు ఉంటుందని చెప్పాము. రాజధాని విషయంలో గానీ, మరో విషయంలో గానీ ఇది వరలో రాష్ట్రాల విభజనలు జరిగినప్పుడు, కేంద్రం నుండి వచ్చిన నిధులు ఏవిధంగా ఉన్నాయి, ఆ నిధులు మనకు

తొందరగా రావని మేము ఆ రోజునే చెప్పడం జరిగింది. రాష్ట్రమంతా సమైక్యంగా ఉండాలనుకున్నప్పటికీ, కేంద్రంలోని ప్రభుత్వం, ఆనాడు పార్లమెంటులో చేసిన పరిస్థితి ఈనాడు దేశంలో ఉన్నటువంటి ప్రజానీకమంతా చూసి, ఎన్నికల్లో ఏవిధమైన తీర్పునిచ్చారనేది కూడా నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని అనుకుంటున్నాను.

ఏదిఏమైనప్పటికీ ఈ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు గారు 7 మిషన్లు, 5 గ్రిడ్లు, 5 క్యాంపెయిన్లు పెట్టడం జరిగింది. ఈ క్యాంపెయిన్లు చూసినట్లయితే – పేదరికంపై గెలుపు, బడి పిలుస్తోంది, పొలం పిలుస్తోంది, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ఇలాంటివన్నీ పెట్టడం జరిగింది. గ్రిడ్స్ విషయానికివస్తే, వాటర్ గ్రిడ్ గానీ, రోడ్ల గ్రిడ్ గానీ, గ్యాస్ గ్రిడ్ వంటివన్నీ అందులో పెట్టి, ఈ రాష్ట్రాన్ని ప్రగతిపథం వైపు ముందుకు తీసుకువెళ్లడానికి, 2022 నాటికి దేశంలో అభివృద్ధి చెందబోయే మొదటి మూడు రాష్ట్రాల్లో ఒక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని నిలపాలని అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి పార్టీలకు అతీతంగా అందరూ ఖచ్చితంగా అభినందనలు తెలియజేయాలని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అదేవిధంగా, 2029 నాటికి మన ఆలోచనా సరళి చూసినట్లయితే, ఆంధ్రప్రదేశ్ దేశంలో అక్షర క్రమంలోనే కాదు, అభివృద్ధిలో కూడా ముందుండాలనే ఆలోచన చేసి, 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ యావత్ భారత దేశంలోనే అగ్రగామిగా నిలవాలని, అనేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందీ రాష్ట్ర ప్రభుత్వం. అందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నాను. మరీ ముఖ్యంగా చూసినట్లయితే, రాజధాని విషయానికి వచ్చినప్పుడు, రాజధానిని ఎక్కడ పెట్టాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం వారు శివరామకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేశారు. వారందరూ సర్వే చేశారు. వారి అభిప్రాయాలు చెప్పారు. ఈ రోజు విజయవాడకు సమీపంలో ఉన్నటువంటి రాజధాని ఖచ్చితంగా అక్కడే ఉండాలని నేను ఆ రోజున ఆ పార్టీలో ఉన్నప్పుడే చెప్పాను. ఈ రోజు కూడా చెబుతున్నాను. ఎందుచేతనంటే, అది అన్ని ప్రాంతాలకూ కూడా మధ్యలో ఉంది. మౌలిక వసతులు ఉన్నాయి. నీటి వసతి ఉంది. అటు ఎయిర్‌పోర్టు విషయంలో గానీ, సీపోర్టుకు దగ్గరగా ఉన్నటువంటి పరిస్థితిలో ఆ ప్రాంతం అనుకూలమైనదని అందరూ భావించే నిర్ణయం తీసుకున్నారని భావిస్తున్నాము.

ఇకపోతే, ల్యాండ్ పూలింగ్ విషయంలో కూడా నేను ఆ ప్రాంతానికి వెళ్లాను. అక్కడి ప్రాంతవాసులు గానీ, గ్రామాల్లోని వారందరితో మాట్లాడటం జరిగింది. మేము అక్కడికి వెళ్లినప్పుడు, 85 శాతం మంది ఆ రోజునే భూములివ్వడానికి సిద్ధంగా ఉన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని వారు మాత్రం తమ భూములివ్వడానికి కాస్త ఇబ్బందిపడ్డట్టుగా అనిపించింది. వారికి కూడా ప్రభుత్వమిచ్చే రాయితీలు గానీ, కాంపెన్సేషన్ గానీ కాస్త పెంచినట్లయితే, వారు కూడా అంగీకరిస్తారని ఆ రోజునే చెప్పడం జరిగింది. ఈ రోజున రాష్ట్ర ప్రభుత్వం శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కల్పించిన వసతులు గానీ, మరీ ముఖ్యంగా చూస్తే, 1000 గజాల రెసిడెన్షియల్ సైటు గానీ, 450 గజాల కమర్షియల్ సైట్ గానీ చూస్తే, ఆ ప్రాంతవాసులు రాబోయే రోజుల్లో ఆర్థికంగా పరిపుష్టితో ఉంటారని తెలియజేస్తున్నాను. ఈ రోజు 32,000 ఎకరాలు సమీకరించడమన్నది అంత ఆషామాషీ వ్యవహారం కాదు. ఎందుచేతనంటే, ఆ ప్రాంతవాసులకి నమ్మకం కావాలి. వారు రాష్ట్ర ప్రభుత్వం మీద నమ్మకం పెట్టి, ఈ రాష్ట్ర అధినేత మీద అపారమైన నమ్మకంతో భూములిచ్చారు. దాన్ని కూడా చెడగొట్టాలని ప్రయత్నం చేసినటువంటి వాళ్లున్నారు. ఎందుకన్నానంటే, ఈ రాష్ట్ర విభజన అనేటటువంటిది ఈ రాష్ట్రానికి ఒక శరాఘాతంగా మారింది. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో కూడా ఈ రకమైన అడ్డంకులు కల్పించడం ద్వారా రాష్ట్రాన్ని అధోగతిపాలు చేయాలనే ఆకాంక్షతో మీరు ఇవన్నీ చేస్తున్నారా అని ప్రశ్నిస్తున్నాను. రాష్ట్ర పురోభివృద్ధికి బాటలు వేద్దామనే ఆలోచన కూడా మీరంతా చేయాలి. భూసమీకరణ ద్వారా వచ్చిన 32,000 ఎకరాలకు సంబంధించి, క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్

అథారిటీకి సంబంధించి రూ.3,168 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. భూములిచ్చిన రైతాంగానికి ఎకరాకు ఇవ్వాల్సిన రూ.30,000 కావొచ్చు, రూ.50,000 కావొచ్చు, ఆ రాయితీలన్నీ వారికివ్వడం ద్వారా యావత్ భారతదేశంలోనే ఇటువంటి ప్యాకేజీ లేదని చెప్పడానికి ఇదే దృష్టాంతమని నేను మీకు మనవిచేస్తున్నాను.

అదేవిధంగా, కేంద్రం నుండి రావాల్సిన రాయితీలన్నీ కూడా రావాలి. స్పెషల్ స్టేటస్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, అనేక పర్యాయాలు ముఖ్యమంత్రి గారు కేంద్రం వద్దకు వెళ్లి, ఇక్కడున్న సమస్యలన్నీ వారికి అర్థమయ్యేటట్లు చెప్పడం కూడా జరిగింది. వారు కూడా నిధులు ఇవ్వడానికి ఆలోచన చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కాస్త జాప్యం జరిగినప్పటికీ, ఖచ్చితంగా కేంద్ర నిధులు వస్తాయనే ప్రగాఢమైన విశ్వాసం మాకుందని ప్రభుత్వం అంటోంది. ఈ మధ్య కూడా ప్రత్యేకంగా దానికి సంబంధించిన మంత్రులు గానీ, ఎన్డీయేలో ఉన్న మంత్రులు ఇచ్చే ప్రకటనల ద్వారా ఖచ్చితంగా కేంద్రం నుండి వచ్చే నిధులు, రాబోయే రోజుల్లో నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి, సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ అంటే ఉషోదయ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడానికి తోడ్పడతాయని నమ్ముతూ, ఖచ్చితంగా కేంద్రం నుండి వచ్చే నిధులతోబాటు, మనమందరం కూడా సమిష్టిగా దానికి తోడ్పడినప్పుడే ఉషోదయ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి మార్గం సుగమమౌతుందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

మ. 1.00

ప్రత్యేక హోదా గురించి మేము పట్టుబడుతున్నాము. దానిని ఎవరూ విస్మరించవలసిన అవసరం లేదు. అది బిల్లులో లేదని కూడా కొంతమంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని ఆనాడు రాజ్యసభలో ఇచ్చిన హామీ సఫలీకృతం అవుతుందని విశ్వసిస్తున్నాను. వెనకబడిన జిల్లాలకు సంబంధించి పారిశ్రామిక రంగానికి సంబంధించి రాయితీలు కూడా ఉన్నాయి. రాయలసీమ, ఉత్తరాంధ్రకు చెందిన మూడు జిల్లాలకు ఇప్పటికే రూ.350 కోట్లు ఇవ్వడం జరిగింది. బిల్లులో పెట్టిన వాగ్దానాలను అమలు చేసినప్పుడే రాష్ట్ర పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతుందని మనవిచేస్తున్నాను. ఈ మధ్య రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేసిన తరువాత ఐటి రంగానికి సంబంధించిన అనేకమందితో కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టమని కోరినప్పుడు సుమారుగా రూ.4,500కోట్ల మేరకు రాష్ట్రంలో ఐ.టి. పరిశ్రమలు రాబోతున్నాయని చెప్పకతప్పదు. దానివల్ల సుమారు 24వేలమంది ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. రాబోయే రోజులలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతకు నైపుణ్యం పెంచడం ద్వారా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నేను ప్రత్యేకంగా చెబుతున్నాను.

ఈ రాష్ట్ర ప్రభుత్వం నిర్భాగ్యులైన వితంతువులు, వృద్ధులు, వికలాంగులు, గీత కార్మికులు, ఎయిడ్స్ వంటి వ్యాధులకు సంబంధించిన పేషెంట్స్ కావచ్చు వీరందరికీ రూ.200 నుండి రూ.1000లు పింఛనును పెంచింది. రాష్ట్రంలో ఉన్న సుమారు 41లక్షలమందికి పెన్షన్ ఇస్తున్నది. ఈ విధానం దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదని ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను. వారికి అయ్యే ఖర్చు సాలీనా రూ.5,000కోట్లు అవుతుంది. ఈ అయిదు సంవత్సరాలలో కేటాయింపులు చూసినట్లయితే రూ.25,000కోట్లు రాష్ట్రప్రభుత్వం నిర్భాగ్యులైన వితంతువులకు గానీ, వృద్ధులకు గానీ గౌరవప్రదమైన జీవితం కొనసాగించడానికి ఇది దోహదపడుతుందని ప్రగాఢంగా విశ్వసించే వ్యక్తిగా నేను తెలియచేస్తున్నాను. రాబోయే ఏప్రియల్, మే నెలల్లో ఎక్కడైతే పెండింగ్ ఉన్నాయో వాటిని 41లక్షలకు కలిపి 43 లక్షలు చేస్తామని చెప్పడం జరిగింది. ఇది ఖచ్చితంగా నిర్భాగ్యులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఊరట కలుగుతుంది, వారి కుటుంబాల్లో కాంతులీనుతాయని ఈ సందర్భంగా నేను తెలియచేస్తున్నాను.

ఇటువంటి అనేకమైన చక్కని కార్యక్రమాలు చేస్తూ, ఒకపక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెడుతూ అభివృద్ధి సంక్షేమాల సమాహారంగా చేస్తుందనేదానిని నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. పేదరికాన్ని నిర్మూలించాలి, దారిద్ర్యాన్ని నిర్మూలించాలి అనే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం ముందుకు వెడుతున్నది. అలాగే, విద్య, వైద్య రంగాలకు ప్రత్యేకంగా పెద్దపీట వేశారు. గడచిన సంవత్సరానికి ఈ సంవత్సరానికి పెంపు ఉన్నది. ఆనంద ఆంధ్రప్రదేశ్ చేయాలనే ఈ రాష్ట్రప్రభుత్వ ఆశయానికి సంబంధించి అందరూ ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో వైద్యరంగానికి పెద్దపీట వేశారు. గడచిన సంవత్సరం 3.92 శాతం కేటాయింపులు ఉంటే, ఈ సంవత్సరం 5.07 శాతానికి పెంచిన ఘనత ఈ రాష్ట్రప్రభుత్వానికే దక్కింది. విద్యా రంగానికి సంబంధించి ప్రాథమిక, మాధ్యమిక విద్య విషయంలో కాస్త తక్కువ ఉన్నా కానీ, ఓవరాల్‌గా ప్రాథమిక విద్యపై ప్రత్యేకమైన శ్రద్ధ చూపడం వల్ల అక్కడ కూడా గణనీయంగా పెరిగింది. గతంలో 11.26 శాతం ఉన్నది ఇప్పుడు 13.24కి అంటే సుమారు రెండు శాతం కేటాయింపులు పెంచడమైంది. ఈ విధంగా ఈ రంగానికి కేటాయిపులు పెంచడం వల్ల ఈ రాష్ట్రం విజ్ఞాన ఆంధ్రప్రదేశ్ దిశగా ముందుకు వెళ్లాలని రాబోయే రోజులలో భారతదేశంలోనే విజ్ఞానఖనిగా ఈ రాష్ట్రప్రభుత్వాన్ని నిలబెట్టాలనే ఉద్దేశంతో ఈ రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోందనడానికి ఈ రంగాలకు చేసిన కేటాయింపులే దృష్టాంతాలని తెలియచేస్తున్నాను.

సమాజంలో అందరికీ సమానమైన గౌరవం ఇవ్వాలి, ముఖ్యంగా పేదలకు ఆర్థిక పరిపుష్టిని తీసుకురావాలంటే పార్టీలకతీతంగా మనమందరం ప్రభుత్వానికి చేదోడువాదోడుగా ఉండాలని తెలియచేస్తున్నాను. ఈ రంగాలన్నిటికీ కేటాయించిన నిధులు సవ్యంగా సక్రమంగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా ఖర్చుపెట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు కృషిచేస్తున్నందుకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చిందుకు ధన్యవాదాలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : ఐలాపురం వెంకయ్య గారూ, మాట్లాడండి.

శ్రీ రెడ్డివారి రెడ్డప్పరెడ్డి : (నామినేటెడ్) సార్, లిస్ట్ ప్రకారం పిలుస్తున్నారా, లేదా పేర్లు ఏమైనా మారుతున్నాయా?

MR. DEPUTY CHAIRMAN: I am going according to the listed names only.

శ్రీ ఐలాపురం వెంకయ్య : (స్థానిక సంస్థల నియోజక వర్గం – కృష్ణాజిల్లా) అధ్యక్షా, ఆర్థికమంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను. మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి బిసిలమీద ఉన్న అభిమానం చెప్పడానికి వీలులేని విధంగా ఉన్నది అన్న సంగతి మనందరికీ తెలిసినదే. వెనకబడిన తరగతుల కోసం ఒక సమగ్ర ప్రణాళికకు రూపకల్పన చేయడం సంతోషంగా ఉంది. రానున్న కాలంలో ఈ ఉప ప్రణాళిక మరింత సమగ్రతను సంతరించుకోనున్నది. దీనిద్వారా నేత పనివారు, మత్స్యకారులు, వడ్డెర, ఇతర చేతివృత్తుల వారు, గొర్రెల కాపరులు, విశ్వబ్రాహ్మణులు, శాలివాహనులకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించడం జరిగింది. గత సంవత్సరం శాలివాహన సంఘాలకు సంబంధించినంతవరకూ రూ.25కోట్ల బడ్జెట్‌ను ఏర్పాటు చేయడం, అందరూ అప్లికేషన్లు పెట్టుకుంటే పంచే విధానానికి ప్రయత్నం చేయడం చాల సంతోషంగా ఉన్నది. ఈ సంవత్సరం బడ్జెట్‌లో కూడా రూ. 20కోట్లను శాలివాహన సంఘానికి కేటాయించడంపై వారంతా సంతోషం వ్యక్త చేస్తూ, బిసిలపై అభిమానం చూపిస్తున్న శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి ధన్యవాదాలు తెలియచేస్తున్నారు. బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ముని రిలీజ్ చేసి వారందరికీ

అందుబాటులోకి వచ్చి వారికి పంచేందుకు వీలుగా ఏర్పాటు చేసి సొమ్ము ఇప్పించే విధంగా చేయాలని కోరుకుంటున్నాను. జైహింద్.

శ్రీ రెడ్డివారి రెడ్డప్పరెడ్డి : లిస్టులో ప్రయారిటీ ప్రకారం ఈ సభలో మేము ఉండాలనుకున్నాము. కానీ, మధ్యలో లిస్టును మారుస్తున్నారు. లిస్టు మీకు వచ్చినప్పుడు మార్చడం that is not correct and it is not the procedure. Once it was decided it should not be changed. మమ్మల్ని చివరగా పెట్టినా ఇబ్బంది లేదు. ఆ విషయాన్ని ఇంటిమేట్ చేస్తే మేము సమయాన్ని అడ్జస్ట్ చేసుకుంటాము. నావేమీ రాజకీయ పొగడ్తలు, విమర్శలు ఉండవు. ఈ సభలో మేము మాట్లాడిన దానికి స్పెసిఫిక్ ఆన్సర్లు ఇస్తే చాలు. ఎందుకంటే, షార్ట్ డిస్కషన్లలో గానీ, గవర్నర్ అడ్రస్‌లో గానీ, బడ్జెట్‌పైన గానీ మాట్లాడితే generalized reply వస్తుంది కానీ, మెంబర్లు మాట్లాడిన దానికి సమాధానం రాదు. ఒకవేళ రిప్లై ఇచ్చేటప్పుడు అంత టైం లేకపోయినా మాకు వ్రాతపూర్వకంగానైనా ఏమి ఇష్యూ రెయిజ్ చేశామో దానికి రిప్లై స్పెసిఫిక్‌గా ఉంటే మేము మాట్లాడేదానికి అర్థముంటుంది. అధ్యక్షా, రాయలసీమలో చిత్తూరు జిల్లా పడమట ప్రాంతంలో త్రాగునీటికి విపరీతమైన సమస్య ఉన్నది. దానికి గాను గతంలో 54 టిఎమ్‌సిలు ఉండే కండలేరు ప్రాజెక్టు నుండి 11 టిఎమ్‌సిలు ఉండే డెడ్ రిజర్వాయర్‌లో 6 టిఎమ్‌సిలు చిత్తూరు జిల్లాలోని ప్రతిగ్రామానికి పైప్‌లైన్ల ద్వారా అందించే పథకం చేపట్టారు. సుమారు ఆరు, ఏడువేల కోట్ల రూపాయలతో ల్యాండ్ అక్విజిషన్ అయిపోయింది, కాంట్రాక్టర్లను ఫైనలైజ్ చేశారు, టెండర్లను పిలిచినట్లున్నారు, డబ్బులు కూడా కొన్ని కోట్లు ఖర్చు పెట్టారు. కానీ, ఇప్పుడు ఆ పథకం గురించే మాట్లాడడంలేదు. ఈనాడు పైప్‌లైన్లద్వారా గ్రామాలకు మంచినీటిని తీసుకువెళ్లడమే కరక్ట్ పద్ధతి. కానీ, ఆ పథకాన్ని ఎందుకు వదిలేశారు? అప్పటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డిగారు ఉన్నప్పుడు తెలంగాణా నాయకులు రాయలసీమకు ఇన్ని కోట్లు తీసుకువెడుతున్నారని విమర్శించడం జరిగింది. కాబట్టి, త్రాగునీటి విషయంలో ఆ పథకాన్ని ఎందుకు వదిలేశారు? దానికి కారణాలేమిటి అనేది తెలియచేస్తే బాగుంటుంది. హంద్రీనీవా ప్రాజెక్టు విషయానికి వస్తే, ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ అగస్ట్ నాటికి పుంగనూరు నీటిని తీసుకువస్తామని అన్నారు. చాలా సంతోషం. అక్కడ ప్రజలకు ఇప్పుడు త్రాగునీటికి మించిన సమస్య మరొకటి లేదు.

మ. 1.10

కానీ, బడ్జెట్ కేటాయింపులు మాత్రం హంద్రీ-నీవా ప్రాజెక్టుకు ఈవిధంగా కేటాయిస్తే ఎన్ని సంవత్సరాలైనా ఆ ప్రాజెక్టు పూర్తికాదు. పట్టిసీమ నీరు గురించి చాలామంది విమర్శలు చేశారు. అది రాజకీయంగా చేశారో, ఏవిధంగా చేశారోగానీ పట్టిసీమ నీరు ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణాడెల్టాకు తెస్తున్నారు. ప్రకాశం బ్యారేజిలో మిగిలేనీరు రాయలసీమకు తీసుకుపోవాలంటే హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలి. కాబట్టి మొదటి సంవత్సరం హంద్రీ-నీవా ప్రాజెక్టుకు బడ్జెట్‌నిచ్చి, ఆ తరువాత పట్టిసీమకు బడ్జెట్‌నిస్తే అప్పుడు నమ్మకముంటుంది.అది శాస్త్రీయంగా కూడా ఉంటుంది.

మిస్టర్ డెప్యూటి ఛైర్మన్ : జి.ఎన్.ఎస్.ఎస్. కూడా.

శ్రీ ఆర్.రెడ్డపరెడ్డి : అధ్యక్షా, అవును. జి.ఎన్.ఎస్.ఎస్. మరియు హంద్రీ-నీవా ప్రాజెక్టు. ఈ సంవత్సరం ఈ రెండు ప్రాజెక్టులకు బడ్జెట్ లేదు. రేపు మీరు కృష్ణాబేసిన్‌కు నీరు తీసుకుపోయినా కూడా కృష్ణానదిలో మిగిలే నీరు శ్రీశైలం నుంచి చిత్తూరు జిల్లాకు ఎట్లా తీసుకుపోతారు? కాబట్టి మనం బలంగా చెప్పడం కాదు. బడ్జెట్ కేటాయింపులను చూస్తే మనకు నమ్మకం కలుగుతుంది. ఈ బడ్జెట్ కేటాయింపుల వల్ల పూర్తిగా నిరుత్సాహంగా ఉంది. ప్రభుత్వానికి నా విజ్ఞప్తి ఏమిటంటే, ఎన్నో సంస్థలున్నాయి. ఆ సంస్థల నుంచి లేక విదేశీ నిధుల ద్వారా త్రాగునీటి విషయంలో ఇంకా నిధులను సేకరించి హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేయాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ప్రజాప్రతినిధులంతా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని అన్నారు. అది బాగానే ఉంది. ఇంతకుముందు కూడా నేను చెప్పాను. కొన్ని మీటింగులే రద్దుచేసేశారు. శాసనసభ్యులకు, శాసనపరిషత్ సభ్యులకు, పార్లమెంటు సభ్యులకు భయపడి ఒళ్లు దగ్గరపెట్టుకుని జిల్లా అధికారులు డి.డి.ఆర్.సి. మీటింగులకు ప్రిపేరై వస్తూ ఉండేవారు. శ్రీ యనమల రామకృష్ణుడు గారు ఇంతకుముందు సభలో మాట్లాడుతూ, జిల్లా పరిషత్‌లు ఉన్నాయి కాబట్టి డి.డి.ఆర్.సి.లు అవసరం లేదని చెప్పారు. జిల్లా పరిషత్ సమావేశాల్లో మేము మాట్లాడడానికి లేచి నిలబడితే, మీరు కౌన్సిల్‌లో మాట్లాడుకోండి, అసెంబ్లీలో మాట్లాడుకోండని ఈ జిల్లాపరిషత్ మాకోసం ఉందని జడ్.పి.టి.సి.లు గొడవచేస్తూ ఉన్నారు. అది కూడా 3 నెలలకు ఒకసారి జిల్లా పరిషత్ మీటింగులు జరిగేవి. ఈరోజు మనం దేనిగురించైనా జిల్లా అధికారులకు ఫోన్‌చేస్తే ఒక indifference కనిపిస్తూ ఉంది. ఎందుకంటే, వారిని ప్రశ్నించే ఫోరమ్ లేదని భయం పోయింది. డి.డి.ఆర్.సి. సమావేశాలు ప్రారంభంలో జరిగినపుడు, జాయింట్ డైరక్టరు, పశుసంవర్ధక శాఖగానీ, జాయింట్ డైరక్టరు, వ్యవసాయ శాఖగానీ, జాయింట్ డైరక్టరు, ఆరోగ్యశాఖ గానీ ఏదో ఒక సమాధానం చెప్పి వెళ్లిపోయేవారు. ఆ తరువాత, శాసనసభ్యులు ప్రశ్నిస్తూ ఉన్నారు, గట్టిగా మాట్లాడుతున్నారని ప్రాపర్‌గా ప్రిపేరై అధికారులు జవాబులను ఇచ్చేవారు. This is not a substitute for Zilla Parishad General Body Meeting. కాబట్టి ఆ డి.డి.ఆర్.సి. మీటింగులను మళ్లీ నిర్వహించాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని విజ్ఞప్తిచేస్తున్నాను.

ఎ.సి.డి.పి. నిధుల విషయానికి వస్తే, మేము అభివృద్ధిలో పాలు పంచుకోవాలంటే, ఎ.సి.డి.పి. నిధులు కావాలి. ఎందుకంటే, ఏదైనా పనులకోసం ఆ నిధులను ప్రజాప్రతినిధులను అడగడం ప్రజలు అలవాటుపడ్డారు. ఒక పాఠశాల ఫంక్షన్‌కో లేదా ఒక కళాశాల ఫంక్షన్‌కు వారు ప్రజాప్రతినిధులను పిలుస్తారు. శాసనసభ్యుడినో, శాసనపరిషత్ సభ్యుడినో రూ. 2 లక్షలు సి.సి.రోడ్డు పనులకోసం మంజూరుచేయండి, రూ. 1 లక్షలు బోర్‌వెల్‌కు ఇవ్వండి లేదా ఒక కమ్యూనిటీ హాలుకు ఇవ్వండని వారు అడుగుతారు. సంవత్సరాలుగా వస్తున్న ఆ ప్రాక్టీసును నిధులు లేవని దానిని తీసేశారు. ఒకవేళ ప్రభుత్వం వద్ద నిధులు లేకపోతే రూ. 1 కోటి ఇచ్చేచోట రూ. 50 లక్షలు ఇచ్చినా కూడా రేపు ఏదైనా ఫంక్షన్లు జరిగితే గౌరవం ఉంటుంది. ప్రజాప్రతినిధులుగా వెళ్లి ఆ ఫంక్షన్లు అటెండ్ అయితే వారికి గౌరవం ఉండేది. ఇప్పుడేమో ముఖ్యమంత్రి నిధి ఉందని అన్నారు. ఇదేమీ ఎన్నికల సంవత్సరం కాదు. ముఖ్యమంత్రి వద్ద ఎక్కువ నిధులు పెట్టుకోవడం ఎన్నికల సంవత్సరంలో అయితే ఒక అర్థం ఉంటుంది. ఆ పని శ్రీ ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి గారు కూడా చేశారు. ఆయన దగ్గర ఎక్కువ ఎ.సి.డి.పి. నిధులు పెట్టుకున్నా కూడా సభ్యులకు ఇవ్వకుండా ఏమీ అడ్డుపడలేదు. ఆ నిధులను సభ్యులకు మంజూరుచేస్తూ ఆయన వద్ద కొన్ని నిధులు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి వద్ద నిధులు పెట్టుకుంటే నేను ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లినపుడు మావద్ద నిధులేవీ లేవు, ముఖ్యమంత్రి మా నిధులు పెట్టుకున్నారని లెటర్లు ఇచ్చేస్తాము. రూ. 1 కోటి బదులు రూ. 10 కోట్లకు మేము లెటర్లు ఇస్తాము. అపుడంతా నింద ఎవరి మీదకు వస్తుంది? ముఖ్యమంత్రి నిధులు ఇవ్వడంలేదని మేము చెబుతాము. మాకు ఎ.సి.డి.పి. నిధులు ఇచ్చినపుడు రూ. 1 కోటి పంచాయితీలకు సర్దినపుడు, మీరు ఆ పంచాయితీకి ఇచ్చారు, మా పంచాయితీలకు ఇవ్వలేదని ఆ శాసనసభ్యునిపై వారికి కోపం ఉండేది. ముఖ్యమంత్రిగారు, ప్రభుత్వం ఈ పాయింట్‌ను కూడా గుర్తించాలి. నిధులు తక్కువగా ఉంటే, శాసనసభ్యునికి, శాసనపరిషత్ సభ్యునికి రూ. 50 లక్షల చొప్పున ఇవ్వండి లేదా ఇంకా తక్కువ అనుకుంటే, సంవత్సరానికి రూ. 25 లక్షలైనా ఇవ్వండి. ఈ విజ్ఞప్తిని కూడా గుర్తుపెట్టుకోవాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అవినీతిని నిర్మూలిద్దామని గత సంవత్సరం గవర్నరు గారి ప్రసంగంలో చెప్పారు. ఈసారి కూడా చెప్పినట్లున్నారు. మనందరికీ కూడా తెలుసు. ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా అవినీతి వల్ల

పేదప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వేరేవాళ్లు, పెద్ద పెద్ద కాంట్రాక్టర్ల సంగతి మనకు అనవసరం. ఈనాడు మండల రెవెన్యూ అధికారి కార్యాలయానికి వెళ్లినా, పోలీసుస్టేషన్‌కు వెళ్లినా, ఎక్సైజ్‌శాఖను చూసినా, ట్రాన్స్‌కో చూసినా అవినీతి మాత్రం ఏమాత్రం తగ్గలేదు కానీ పెరిగింది. ఆ మొత్తం కూడా పెంచుతూ ఉన్నారు. మొన్ననే నేను తోటి శాసనసభ్యునితో మాట్లాడుతూ, ఆయన నియోజకవర్గంలో ఒక చిన్న యూనిట్‌కు కనెక్షన్ కావాలంటే, ట్రాన్స్‌కో సంస్థలో ఇప్పటిదాకా రూ. 50 వేలు లంచం ఏ.ఈ., ఏ.డి.ఈ., డి.ఈ. మేమంతా కలిసి పంచుకునేవాళ్లం, ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ. 65 వేలకు పెంచామని చెబుతున్నారు. అదే విధంగా, భూముల విలువలు పెరిగాయి కాబట్టి చిన్న చిన్న సమస్యలుంటాయి. అవి సరిదిద్దడానికి వి.ఆర్.ఓ., ఆర్.ఐ., ఎమ్.ఆర్.ఓ. ముగ్గురూ కలిసి పంచుకుంటామని చెప్పి లక్షల రూపాయలు లంచంగా తీసుకుంటున్నారు. పోలీసుస్టేషన్ల విషయం గురించి చెప్పనక్కరలేదు. ఎక్సైజ్ శాఖలో వేలంపాట ద్వారా కొనుగోలు చేసినప్పటికీ వారికి సంబంధం లేకపోయినా వచ్చి వేధించి డబ్బు కలెక్ట్ చేస్తున్నారు. అందువల్ల, "స్వతంత్ర లోకాయుక్త" కావాలి. అన్నాహజారే ఉద్యమం తరువాత కేంద్రప్రభుత్వం స్పందించి ఒక లోక్‌పాల్ బిల్లు పెట్టారు. ఆ బిల్లులో ప్రతి రాష్ట్రంలో కూడా స్వతంత్ర లోకాయుక్త, appointed by independent Members రావాలి. రాష్ట్రంలో ముఖ్యమంత్రి అవినీతిపై పోరాడాలంటే అది చాలా అవసరం. ఎందుకంటే, ఈ అధికారులంతా ఎవరినో పట్టుకుని అక్కడకు వస్తారు. వారికి ఒక గాడ్‌ఫాదర్ ఉన్నారని వారి ఇష్టానుసారం ప్రవర్తిస్తూ ఉంటారు. క్షేత్రస్థాయిలో ఈ అవినీతి గురించి వాస్తవాలు మరియు గణాంకాలు చూస్తే ఒక పెద్ద పుస్తకం వ్రాయవచ్చు.

ఇసుక పాలసీ విషయంలో, రాయలసీమ ప్రాంతంలో ఉన్న వాగుల్లో, వంకల్లో ఇసుక ఉంది. ఆ ఇసుకనే మనం లోడ్‌చేసి, పంచుతూ ఉంటే పర్యావరణం దెబ్బతింటూ ఉంది. It acts like a sponge to absorb rainy water. బోర్లలో నీరు రావడానికి అవకాశముంది. ఆ ఇసుకను తీసేసే బదులు మీరు rock sand ను ప్రోత్సహించండి. రాయలసీమలో చాలాచోట్ల రాళ్లున్నాయి. Therefore, technically speaking, the strength of the rock sand is much more than the strength of the river sand. ఆ ప్రత్యామ్నాయంతో rock sand తయారుచేసి పెట్టి దానిని మీరు కావలసిన వారికి అమ్మితే బాగుంటుంది. ఎందుకంటే, కొన్ని మండలాల్లో కొన్ని వాగులను మహిళలకు కేటాయించినా కూడా అక్కడ రైతులు వారిని తీసుకోనివ్వలేదు. ఎందుకంటే, ఈ ఇసుకను ఎత్తేస్తే వర్షం వస్తే బోర్లులో నీళ్లు క్రిందకు పోతాయి. ఈ విషయాన్ని కూడా గమనించి rock sandని ప్రోత్సహించాలని నేను ప్రభుత్వాన్ని తమరిద్వారా కోరుతున్నాను.

సభలో రవాణాశాఖా మంత్రిగారు కూడా ఉన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. రహదారులు వెడల్పు చేసినపుడు ఆ రహదారుల పనులు పూర్తయిన వెంటనే బిజినెస్ ఎస్టాబ్లిష్‌మెంట్లు వస్తూ ఉన్నాయి. 4 లేన్ల రహదారులు వస్తున్నాయనుకోండి. జాతీయ రహదారి ప్రాపర్టీ అయిపోగానే బిజినెస్ ఎస్టాబ్లిష్ అవుతుంది. దానికి ఏదైనా ఒక పాలసీని పెట్టండి. ఇంత ట్రాఫిక్ ఉండే జాతీయ రహదారికి ప్రయివేటు ప్రాపర్టీ అయినా కూడా, ఇంత దూరంలో no business establishments should not come, though the property belongs to the private owners. They are opening the business establishments adjacent to the National Highways. ఆ పాలసీ గురించి ఏదైనా మీరు ఆలోచిస్తే భవిష్యత్తులో ఈ ప్రమాదాలను అరికట్టవచ్చు. జాతీయ రహదారుల ప్రక్కన కొన్ని షాపులు, టీ కొట్టును కూడా పెడతారు. అక్కడ ఒక వాహనం ఆపుతారు. పదిమంది వచ్చి అక్కడకు చేరతారు. Technically, it is the property of the private owners. But, there should be a buffer zone, between the business establishments and the National Highways. శాస్త్రీయంగా చేసినట్లయితే ఈ ప్రమాదాలను అరికట్టవచ్చు.

రాష్ట్ర విభజన విషయంలో కొన్ని హామీలను ఇవ్వడం జరిగింది. రాష్ట్ర విభజన అయిపోయిందని ఎన్నికలకు ముందే తెలుసు. అన్ని రాజకీయపార్టీలకు నవ్యాంధ్రప్రదేశ్‌లో ఆర్థిక ఇబ్బందులున్నాయని కూడా తెలుసు. ఆర్థిక ఇబ్బందులున్నాయని తెలిసి కూడా హామీలను ఇవ్వడం జరిగింది. I am not pointing out any particular political party. ఎన్ని హామీలిస్తే అన్ని ఓట్లు వస్తాయని ఇచ్చారు. అది వాస్తవం కూడా. ఇప్పుడు ఏమైందంటే, కొన్ని హామీలు అమలుచేయకపోవడం వల్ల సమస్యలేదు కానీ కొన్ని హామీలు ఇవ్వడం వల్ల కొన్ని వర్గాలకు చెందినవారు దెబ్బతిన్నారు. రైతాంగానికి, బ్యాంకులకు ఉండే సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బ్యాంకులు రైతులను శత్రువులుగా చూడడం జరుగుతోంది. ఋణమాఫీ కోసం రూ. 5 వేలకోట్లు ఇచ్చినామని, దీనికి కట్టుబడి ఉన్నామని మనం చెప్పవచ్చు. మనం ఈ పథకం కోసం రూ. 40 వేల కోట్లు లేదా రూ. 50 వేల కోట్లు సేకరించి ఇవ్వలేమని తెలుసు. కానీ, రైతులంతా కూడా defaulters అయిపోయి బ్యాంకులతో ఉండే సంబంధాలను కోల్పోయి, రూ. 3 లు లేదా రూ. 5 ల వడ్డీకి ప్రయివేటు లోన్లకు పోతూ ఉన్నారు.

ను.1.20

అదేవిధంగా, మహిళా స్వయం సహాయక సంఘాలు 1991 సంవత్సరంలో పి.వి.నరసింహారావుగారు పెట్టినప్పటినుంచి తెలుగుదేశం, కాంగ్రెస్ ఇలా అన్ని ప్రభుత్వాలు భాగస్వామ్యమ వడంతో అవి ఎదిగి ఒక స్థాయికి వచ్చాయి. కాబట్టి ఆ మహిళా సంఘాలకు ఒకప్పుడు మనం దురాశ చూపించాము. ఇప్పుడు వాళ్ళు కూడా ఋణాలు చెల్లించని వారైపోయారు. అసలు స్వయం సహాయక సంఘాలకు అవసరం లేకపోయినా పావలా వడ్డీ, వడ్డీలేని ఋణాలు ఇస్తున్నాం. వాళ్ళు హాయిగా దానిని మూడు రూపాయల వడ్డీకి తిప్పుకుని సంతోషంగా ఉన్నారు. అటువంటివాళ్ళకు కూడా మనం ఆశలు పెట్టి వడ్డీమాఫీ అని కాకుండా ఏదైనా ఉపయోగపడే పథకాలను పెట్టాలి. కానీ అది self-destructiveగా ఆశలు పెట్టడం వల్ల ఆ స్వయం సహాయక సంఘాలు, బ్యాంకుల మధ్య సంబంధాలు పాడైపోయాయి. 2019 సంవత్సరంలో మనం మన ఎన్నికల మేనిఫెస్టోలలో ఏ హామీలు పెట్టినా ప్రజలలో దానికి క్రెడిబులిటీ లేకుండా పోతుంది.

శ్రీ శిద్దా రాఘవరావుః అధ్యక్షా, ఇప్పుడు రైతు ఋణ మాఫీ గురించి మాట్లాడడం జరిగింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం వాటన్నింటినీ కూడా ఆలోచించింది. ఎక్కడా రైతులకు ఇబ్బందిలేకుండా చేశాం. రైతులకు, బ్యాంకులకు గ్యాప్ వచ్చిందని వారు చెప్పినమాట అవాస్తవం. ఎక్కడా ఆ విధంగా జరగలేదు. మొదటి దశ పూర్తిచేయగలిగాం. రెండవ దశ కూడా త్వరలోనే పూర్తిచేసి మేనిఫెస్టోలో అందరికీ ఏ మాట ఇచ్చామో తప్పకుండా దానిని పూర్తిచేస్తాం. కొన్ని విషయాలలో సంక్షోభం ఉండడంవల్ల కొంత ప్రాసెస్ మెల్లగా జరుగుతోంది. అంతకు మించి ఇంకేమీ లేదు. వాటిగురించి ప్రతిపక్ష సభ్యులు మాట్లాడడమనేది పద్ధతికాదు.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : అధ్యక్షా, అనుబంధం దెబ్బతిందన్నారే కానీ ప్రభుత్వం ఇవ్వలేదని చెప్పలేదు.

శ్రీ శిద్దా రాఘవరావు : సంబంధాలు ఎక్కడా దెబ్బతినలేదు. మాకు తెలిసి మా జిల్లాలో మేము పర్యటించినప్పుడు దీని గురించి ఎక్కడా చర్చలేదు. ఇంత సంక్షోభంలో కూడా ఆయన చేయగలుగుతున్నారని ఎక్కడకు పోయినా అభినందిస్తున్నారు.

శ్రీ ఆర్. రెడ్డపరెడ్డి : అధ్యక్షా, ఋణ మాఫీ గురించి మేనిఫెస్టోలో పెట్టిన అంశం ఒకటైతే, ఇప్పుడు జరుగుతోంది వేరేగా ఉంది. మీరు ఇస్తామన్నారు, ఇవ్వకుండా పొద్దుపుచ్చినారు. కానీ రైతులు ఆశించేది వేరేగా ఉంటుంది.. That is what I am pointing out. You have given. I cannot say that you have

not given. But, what was the expectation of farmer is totally different from what is being implemented. That pointed I wanted to make. May be some farmers are satisfied with what you have given. But, I am talking of general, ordinary small farmers.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : మామూలుగా రూ.50వేలలోపు రుణం ఉన్న వారు 65శాతం వరకు ఉన్నారు. వారందరికీ ఒకేసారి ఋణమాఫీ అయిపోయింది. They are also happy.

SRI R. REDDAPPA REDDY : We welcome if you satisfy the farmers. So, if the Government satisfies the farmers we welcome. నాలుగేళ్ళ తరువాత ఎన్నికలప్పుడు ఎలాంటి అంశాలుంటాయో కానీ, ఇప్పుడు మీరు వారిని సంతృప్తిపరిస్తే చాలా సంతోషం. వాళ్ళని సంతృప్తి పరచాలని కూడా కోరుకుంటున్నాం. So, there is no issue. We have reached a stage where we are concentrating more on individual benefits while neglecting budget allocations to other schemes which are beneficial to the community in general. అదేదో ఎన్నికల సంవత్సరంలో చేస్తే ఫరవాలేదు కానీ ఇప్పుడు రూ.350కోట్లు విడుదల చేశారు. సంక్రాంతికి ఎవరు ఇవ్వమని అడిగారు? అదే రూ.350కోట్లు వైద్య ఆరోగ్యానికి కేటాయిస్తే బాగుండేది. Cancer patients in my neighbouring villages are going as agriculture labour. మొన్న నేను శివాళి అనే గ్రామానికి పోతే తెలిసింది. వైద్యంకోసం ఏదైనా ఆసుపత్రికి పోవాలంటే ఒక టౌనులోని ప్రైవేటు ప్రాక్టీసు చేస్తున్న వైద్యుని పేరు చెప్తున్నారే కానీ ప్రభుత్వ ఆసుపత్రి పేరు చెప్పడంలేదు.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, ఈ కేన్సర్ అనేది దీర్ఘకాలిక వ్యాధి. ఆ వ్యాధి గ్రస్తులు కూడా ఈ సంక్రాంతికానుకలకు సంతోషించినారు.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : బీదవారు ఏది ఇస్తే అది తీసుకుంటారమ్మా.

శ్రీమతి పమిడి శమంతకమణి : ఏదైనా ఇచ్చినదాన్ని బీదప్రజలు తీసుకుని వారు సంతోషించడం చూసి మనం సంతోషపడాలి. అంతేకానీ, నువ్వు కేన్సర్ పేషంట్‌వి కాబట్టి నువ్వు ఏడ్చుకుంటూ ఉండు. నువ్వు బీదవాడివి కాబట్టి నువ్వు పండగే చేసుకోవద్దనేది ఎక్కడా లేదు.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు : ప్రతి పండక్కీ అలాగే ఇస్తే దాంట్లో నిజాయితీ ఉన్నట్లుగా ఒప్పుకుంటాము. ఒక్క పండక్కి ఇచ్చేసి ఏదో వాసన చూపిస్తే ఎట్లా?

శ్రీమతి పమిడి శమంతకమణి : పండగలన్నీ ఒకేసారి రావు కదా.

శ్రీ ఆర్. రెడ్డపరెడ్డి : రాష్ట్రప్రభుత్వ బడ్జెట్ సంతృప్తి కరంగా ఉన్నప్పుడు ఇస్తే మాకు సంతోషమే. ఇప్పుడు మేము కూడా కొన్ని పల్లెలకి పోతాం. ఏదో కొంత డొనేషన్లు అడుగుతారు. జేబులో ఉంటే ఇస్తాం. లేకపోతే లేదని చెప్తాం. లేనప్పుడు కూడా other serious issues are there. జేబులో ఉండే డబ్బుని ప్రాధాన్యతలేమిటో గుర్తించి వాటికి ఖర్చు చేస్తే బాగుంటుందని భావిస్తున్నాము.

MR DEPUTY CHAIRMAN: Reddapa Reddy garu, though I am in the Chair, నేనుకూడా ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో తిరిగాను. ఇప్పుడు రూ.250కోట్లు, రూ.300కోట్లవరకు బీదలకు పోయింది. అది వృథా అనేవిధంగా మీరంటున్నారు.

శ్రీ ఆర్. రెడ్డపరెడ్డి : వృథాకాదు సార్. ప్రాధాన్య క్రమంలో కేటాయించమంటున్నాం.

MR DEPUTY CHAIRMAN : Whatever it is. We are not thinking about వేల వేల కోట్లు ఖర్చుపెట్టే దానిగురించి మనమెవ్వరం కూడా సాహసం చెయ్యం. కానీ బీదవాళ్ళకి ఖర్చుపెట్టడం గురించి, my only feeling is, బీద వాళ్లకు ఏ లబ్ధి చేకూరినా let us not protest. When it is directly going to the

poorest sections, why should we worry. వేరే సెక్షన్స్‌కు ఎంతంటే అంత ఇచ్చినప్పుడు కూడా మనం మౌనంగా ఉండి, కానీ, గ్రామీణ ప్రాంతంలోని పేదవాడికి అది వెలుతున్నప్పుడు అభ్యంతరపెట్టడం, it is only heart burning. Though I am in the Chair, I am just making this comment because we should all be pro-poor. బీదవాడు ఎప్పుడైతే సంతోషంగా ఉంటాడో మనమందరమూ కూడా సంతోషపడాలి. Not at the cost of the poor person. ఎంతబాధ అవుతుందంటే కొంత కొంత మందికి కొన్ని కొన్ని వర్గాలకు ఎంతంటే అంత పెంచినాకూడా దానిగురించి మనం నోరు విప్పం. బీదవారికి వచ్చినప్పుడు మాత్రం అది అన్-ఆర్గనైజ్డ్ సెక్టార్ కాబట్టి దానిమీద దాడిచేయడమనేది I am just feeling that.........

SRI R.REDDAPPA REDDY: With due respect, I differ Sir. It is not a pro-poor measure. It is an anti-poor measure. While feeding them for that day, we are sacrificing their long term interest. You use that Rs.350 crore for the benefit of the poorest of the poor for their long term interest. You give it to their children. You identify such patients. You deposit it in their favour. రూ.350కోట్లు కాదు రూ.3500కోట్లు పెట్టండి. ఈరోజు మనం నిజంగా బీదవాళ్ళకి చేయాలంటే శాశ్వతమైన మార్గాలు ఆలోచించాలేకానీ ఆరోజు ఫీడింగ్‌తో తృప్తి పరిచేది కాదని నేను తెలియజేస్తున్నాను. Anyway I hope I have taken enough time. Kindly permit me one more minute, Sir.

MR DEPUTY CHAIRMAN: I will permit you one more minute. I think you have one question on Horsley Hills and that question did not come up and when it came up you were not there. What is that issue, can you focus on that?

శ్రీ ఆర్.రెడ్డప్పరెడ్డి: ముఖ్యమంత్రిగారు ఆంధ్రప్రదేశ్‌ను టూరిస్ట్ హబ్ చేస్తామంటున్నారు. చాలా సంతోషం. Horsley Hills is the highest hill station in Andhra Pradesh and tourists from Tamilnadu, Karnataka, Andhra Pradesh and all the States are visiting there. ముఖ్యమంత్రిగారు టూరిస్టు హబ్ చేస్తామన్నప్పుడు నేను హార్స్‌లీహిల్స్‌ను కూడా దృష్టిలో పెట్టుకుంటారని అనుకుంటున్నాను. ఎందుకంటే, he is also from the same District. అక్కడ త్రాగునీరు ప్రధానమైన సమస్య. There is a rift between Forest and Tourism Departments. దానిని పరిష్కరించాలి. ఎవరు పరిష్కరించాలని శాఖాపరంగా మనం ఆలోచిస్తే ముందుకుపోలేం. అందుకే సంబంధిత శాఖామంత్రిగారి దృష్టికి తీసుకెళ్తే అటవీశాఖవారు మా అడవిలో మీరు కొండ కింద బోరు వేయొద్దంటున్నారు దానిని పైన వేసుకొమ్మంటున్నారు. టూరిజం వాళ్ళేమో they have to cater to the tourists. ఏదైనా రూములున్నాయా అంటే నీళ్ళులేవు రూములున్నాయంటారు. ట్యాంకుల్లో నీళ్ళు తెచ్చిన తరువాత మీరు రండి అంటున్నారు. It is prestigious hill station in Andhra Pradesh. If this goes to the notice of the Hon'ble Chief Minister or if I get an occasion, I will also bring it to his notice.

MR. DEPUTY CHAIRMAN: I spent my childhood there. I studied 4th Class to 10th Class in Horsley Hills.

SRI R. REDDAPA REDDY: So, you can as well take this to the notice of the Hon'ble Chief Minister and solve the water problem and I will be very happy if you could do so. రాష్ట్ర విభజనలో ఎంత రాజకీయం ఉందో చూడండి. Outgoing UPA thought విభజన చేసేద్దాం, అన్ని హామీలు ఇచ్చేద్దాము. ఆ భారం తరువాతి ప్రభుత్వ నెత్తిన పడనీ అని వదిలేశారు. ఎందుకంటే, వాళ్లకు తెలుసు మేము మళ్లీ అధికారములోకి రామని. వీళ్ళేమో అప్పుడు ప్రతిపక్షంలో ఉండి విభజన చేసిన పాపం వాళ్ళకి వస్తుంది, సపోర్టు చేద్దాం, తరువాత మళ్ళీ చూసుకుందామని ఊరుకున్నారు. ఇప్పుడు యు.పి.ఏ వాళ్ళు ప్రతిపక్షంలోకి వచ్చి మా హామీలు అమలు చేయండంటున్నారు. They know that if they have to give 'special status' to any State, 50% of the total states have to approve it. … Due to their politics, four/five crore people of Andhra Pradesh are suffering. I think it is time that the Government of Andhra Pradesh has to identify as to who are A1, A2, A3 in this UPA and NDA and register a case against them. ఎందుకంటేభవిష్యత్తులో వేరే రాష్ట్రంలోని ప్రజలు ఈ విధంగా ఇబ్బంది పడకూడదు. Dividing a State is not an easy thing. Though it has been passed in the Parliament, Article 3 has been abused during election time for political reasons. If the UPA had

sincerity, why did they not divide the State two years before? 2014 సంవత్సరంలో ఎన్నికల ముందు మీరు విభజించే అవసరం ఏముంది? అంతా చేసేసి ఇప్పుడు ఈ ప్రభుత్వం చేయాలని ఇప్పుడు ప్రొటెస్టు చేస్తోంది.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

ఆ ప్రభుత్వానికి అంత చిత్త శుద్ధి ఉంటే ఈ విభజన 2011లో కానీ 2012లో కానీ చేసి, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, బయటకు వెళ్లండి, లేదా ప్రభుత్వానికి రండి. జాతీయ నాయకులు ఇలా చేస్తే, what is the message that we are sending to the future generations? This a serious thing. So, State Government should register a case in this regard, though I don't know I am talking irrationally. Anyway what happened has happened and we cannot undo the same. But, something has to be done for the future. Thank you for giving me this opportunity Sir.

మ. 01.30

శ్రీ పీరుకట్ల విశ్వప్రసాద రావు ః (స్థానిక సంస్థల నియోజక వర్గం – శ్రీకాకుళం) అధ్యక్షా, 2015–16 సంవత్సరానికి సంబంధించిన బడ్జెటు పై నాకు మాట్లాడే అవకాశం కల్పించినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెటు సుమారు రూ.1,13,048 కోట్లుగా పెట్టడం జరిగింది. ఈ బడ్జెటు పూర్తిగా అంకెలగారడిగా మాత్రమే ఉంది. ప్రాధాన్య రంగాలకు తక్కువ కేటాయింపులు జరిగాయి. అలాగే, ఎన్నికల హామీలో భాగంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి క్రింద రూ.100కోట్లు కేటాయించారు. ఇది కంటి తుడుపు చర్య మాత్రంగానే ఉంది. ఎంతో మంది నిరుద్యోగులు నిరుద్యోగ భృతికి అర్హులు అయ్యే వారు ఉన్నారు. నిరుద్యోగులకు ఏ ప్రాతిపదిక మీద వారి ఎంపికను మొదలుపెడతారు? ప్రభుత్వం వెంటనే అందుకు తగ్గ మార్గదర్శకాలను విడుదల చేయాలని తమ ద్వారా కోరుతున్నాను.

అలాగే, ఈ రైతులు ఋణమాఫీకి సంబంధించి బడ్జెటులో సుమారు రూ.4,300కోట్లు మాత్రమే కేటాయింపులు జరిగాయి. ఇవి కూడా అరకొరగా కేటాయించడం జరిగింది. దీనివల్ల రైతాంగం చాలావరకు నష్టపోవడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం చాలా కష్టాలలో ఉందని మాటిమాటికి బీద అరుపులు అరుస్తూ, బడ్జెటును పూర్తిగా సారం లేనిదిగా చేశారు. అలాగే, ఉద్యోగుల హెల్త్ కార్డు కేటాయింపులో కేవలం రూ.120కోట్లు కేటాయించడం జరిగింది. ఇది ఏ మాత్రం సరిపోదు. దానికి ఉద్యోగస్తులు చాలామంది బాధపడడం కూడా జరుగుతోంది. శాఖల వారీగా కేటాయింపులు చూస్తే బడ్జెటు అనుచితంగా కనిపిస్తుంది. మరి ఇతర శాఖల వారీగా ఈ బడ్జెటు కేటాయింపులు చూసినట్లయితే, ఈ సంవత్సరం హౌసింగ్‌లో సుమారు 2 లక్షల గృహాలను నిర్మిస్తామని చెప్పారు. దానికి సుమారు రూ.2,000కోట్లు బడ్జెటులో కేటాయించాలి. కానీ, ఈ ప్రభుత్వం బడ్జెటులో రూ.897కోట్లు మాత్రమే కేటాయించడం జరిగింది. ఇది పాత బిల్లుల చెల్లింపులకు కూడా చాలని పరిస్థితి ఈనాడు ఉంది.

ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి చూసినట్లయితే, ఇంతవరకూ ఏ ప్రాతిపదికన కూడా ఇళ్ళను కేటాయించడం జరగలేదు. ఇప్పుడున్న పరిస్థితి చూసినట్లయితే, ఇసుక, సిమెంటు ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు ఇళ్ళు కట్టుకోలేని పరిస్థితి ఉన్నది. చాలా మంది బిల్లులు చెల్లించలేక ఇబ్బంది పడే పరిస్థితి జిల్లాల వారీగా ఉంది.

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కేవలం రూ.379 కోట్లు మాత్రమే కేటాయించారు. కనీసం ఒక్క క్రొత్త పథకాన్ని కూడా వారి అభివృద్ధికి ప్రకటించ లేదు. మైనారిటీలకు చాలా నష్టం జరిగే విధంగా ఈ బడ్జెటు ఉంది. అలాగే, ఈ బడ్జెటులో ఆర్‌టిసికి ప్రణాళికేతర వ్యయం క్రింద రూ.218కోట్లు, ప్రణాళికా వ్యయం క్రింద సుమారు రూ.95 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆర్‌టిసికి రూ.2000కోట్లు

కేటాయించాలని చేసిన విన్నపాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అయ్యాయి. మీరు బడ్జెటులో కేటాయి ంచింది కేవలం క్రొత్త బస్సుల కొనుగోలుకు మాత్రమే వస్తుంది. శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువ బస్సులు కాలం చెల్లినవిగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్‌టిసికి సంబంధించిన విషయాలను ఈ రోజు ఉదయమే చాలా చర్చించుకోవడం జరిగింది. ఆర్‌టిసి బస్టాండులలో మౌలిక సదు పాయాలు, పారిశుధ్యం విషయంలో బడ్జెటులో ఎటువంటి కేటాయంపులు చేయలేదు. మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు బస్సులు లేక ఆందోళనలు చెందుతున్నారు. అలాగే, ఆ ప్రాంతాలలో నాన్ స్టాపు బస్సులు ఎక్కువగా ఉండడం వల్ల, గ్రామీణ ప్రాంత ప్రజలు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతాలలో కూడా ఆర్టీసీ ఆర్డినరీ బస్సులను నడిపించాలని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాము.

రాష్ట్రంలోని విద్యారంగంలో సమగ్రమైన, గుణాత్మకమైన మార్పులు తీసుకువస్తామని అన్న ప్రభుత్వం విద్యారంగానికి చెందిన కేటాయింపుల్లో భారీ కోత విధించారు. విశ్వవిద్యాలయాలకు, కళాశాల విద్యకు కోత విధించి, కొత్త నైపుణ్యాల అభివృద్ధికి, బడ్జెటు ప్రణాళిక పద్దు క్రింద సుమారు రూ.360కోట్లు ఇచ్చారు. హిందీ అకాడమికి రూ.20 లక్షలు కేటాయించిన ప్రభుత్వం తెలుగు అకాడమీకి కొంచెమైనా నిధులు కేటాయించలేదు. దీనికి ప్రభుత్వ చిత్తశుద్ధి, తెలుగు భాష పైన వివక్షత చూపిస్తోంది. మన రాష్ట్రంలో సుమారు 32.6 శాతం నిరక్షరాస్యులు ఉన్నట్లుగా సర్వేలో చెప్పారు. ఈ నిరక్షరాస్యులను విద్యా వంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళికలను రూపొందించాలి. అటువంటి ప్రణాళిక ఏదీ ఇప్పటివరకూ జరగలేదు.

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఫీజురీయింబర్సుమెంటుకు సంబంధించి చూసినట్లయితే, సుమారు 17,000కోట్లు బకాయిలు ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ కేటాయింపులు ఏ మూలకూ చాలదు. ఈనాడు విద్యాపరంగా వెనుకబడిన మండలాలలో సామాజికంగా వెనకబడిన బాలికలకు గుణాత్మకమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి 352 కస్తూరిబా గాంధీ పాఠశాలలను కేంద్రప్రభుత్వం ఇచ్చింది. ఈనాడు ప్రతీ మండలంలో కొన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

ఈరోజు విద్యుత్ రంగం చూసుకుంటే... ఈ రంగానికి కేవలం రూ.4,300 కోట్లు కేటాయించారు, ఇందులో రైతుల ఉచిత విద్యుత్‌కు రూ.3వేల కోట్లు కేటాయించారు, మిగిలిన రూ.1300కోట్లు పథకాల కోసం ఖర్చు చేయాలని ప్రతిపాదించారు. దీనిని బట్టి ఈ ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకానికి తిలోదకాలు ఇచ్చి, సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇస్తున్నది. రెవెన్యూలోటు భర్తీకి అంతర్గత చర్యలు చేపట్టాలని సూచిస్తూ కొన్ని వర్గాలకు రాయితీలు కుదించే దిశలో ప్రభుత్వం పయనిస్తున్నదని తెలుస్తున్నది. కొత్తగా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి అవకాశాలు, కొత్త విద్యుత్ ప్రాజెక్టులు గురించి బడ్జెట్‌లో చూపించలేదు. దీని వలన రాబోయే రోజులలో ఇబ్బంది చాలా ఉందని తెలియజేస్తున్నాము. అదే విధంగా ఈనాడు పౌర సరఫరాలో ఆహార భద్రతా పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో అర కొర నిధులను కేటాయించింది. ఇది కూడా రాబోయే రోజులలో చాలని పరిస్థితి ఉంది. రాబోయే ఏప్రియల్ మాసం నుండి ఆహార భద్రతా చట్టంను అమలు చేస్తామని చెప్పారు. దానికోసం రాష్ట్రప్రభుత్వంపై రూ.800కోట్లు అదనపు భారం పడుతుంది, ఈ భారాన్ని రాష్ట్రప్రభుత్వం ఏవిధంగా పూరిస్తుందో తెలియజేయలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో డ్వాక్రా రుణమాఫీ ప్రకటించి, ఈ బడ్జెట్‌లో మొండిచేయి చూపించింది. మరి ఈనాడు గతంలో మాదిరిగా ప్రతి డ్వాక్రా సంఘానికి రివాల్వింగ్ ఫండ్ ఇవ్వాలని నిర్ణయించి, ఈ సహాయానికి క్యాపిటల్ ఇన్ఫ్యులేషన్ అని పేరు పెట్టి చేయి దులుపుకుంది. దీనివలన గతంలో తీసుకున్న ఋణాలు డ్వాక్రా మహిళలే చెల్లించాల్సిన అగత్యం ఏర్పడింది. శ్రీ చంద్రబాబునాయుడు గారు డ్వాక్రా ఋణమాఫీ చేస్తామని చెప్పారనే భరోసాతో డ్వాక్రామహిళలు ఋణాలు చెల్లించలేదు. కానీ ప్రస్తుతం వడ్డీతో సహా

డ్వాక్రామహిళలు తీసుకున్న ఋణాలను బ్యాంకులకు కట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో దాదాపు 89లక్షల మంది డ్వాక్రా మహిళలు సుమారు రూ.8,900కోట్లు రివాల్వింగ్ ఫండ్ అవసరం కాగా, బడ్జెట్‌లో కేవలం రూ.1000కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది చాలా దారుణమైన పరిస్థితి. మహిళలకు ఇచ్చిన మాట ఎక్కడాకూడా నెరవేరని పరిస్థితి ఈ బడ్జెట్‌లో కనపడుతోంది.

మ 01.40

ప్రభుత్వం చేనేతరంగంపై చిన్న చూపు చూడడం జరిగింది. చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని వాగ్దానంచేసి ఈ ప్రభుత్వం కేవలం నలభై ఆరువేల కోట్ల రూపాయలు మాత్రమే ఈ బడ్జెటులో కేటాయించడం జరిగింది. పవర్‌లూమ్స్ దెబ్బతినడంవల్ల చేనేత కార్మికులకు తగిన భరోసా ఇవ్వలేదు. దీనివల్ల రాబోయే రోజుల్లో చేనేత కార్మికుల ఆకలి చావులు, ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతుంది. కానీ ఈ ప్రభుత్వం గ్రామీణ పరిశ్రమలను కంటతడి పెట్టించి, బడ్జెటు కేటాయింపుల్లో తీవ్ర నిరాశకు గురిచేస్తున్నది. చేనేత రంగంపై చిన్నచూపు చూడడంవల్ల చేనేతకార్మికులు చాలా ఇబ్బందిపడే పరిస్థితి ఉంది. పింఛను విషయానికి వస్తే రాష్ట్రంలో సుమారు నలభై ఒక్క లక్షలమంది పింఛనుదారులు ఉండగా, ఈ ఏడాది కేవలం ఐదువేల ఆరువందల కోట్లు అవసరమైతే, ప్రస్తుత బడ్జెటులో మూడువేల ఏడువందల నలభై ఒక్క కోట్లు కేటాయించారు. దీనిని చూస్తే రాబోయే రోజులలో పింఛనుదారులు ఇబ్బందిపడే పరిస్థితి ఉంది. మన రాష్ట్రంలో మరో లక్ష మందికి పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇవి కాక జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో మరో ఐదు లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇవికాకుండా గతంలో రద్దు చేసిన లక్షమంది అర్హులగురించి పరిశీలన జరుగుతుంది. నిజానికి అందరికీ పింఛన్లు ఇస్తే, సంవత్సరానికి ఆరు లక్షలమందికి పింఛను మంజూరు చేయవలసి ఉంది. కాబట్టి ప్రభుత్వం కొత్త వాటికన్నా, ఇచ్చే పాతవాటినే రద్దు చేస్తారేమోననే భయం పింఛనుదారులలో ఉంది.

వైద్యానికి సంబంధించి రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని రక్షించే శాఖగా ప్రతిపౌరునికి ఈ శాఖ అత్యవసరమైనది. ఈ శాఖకు సంబంధించి బడ్జెటులో మూడువేల ఏడువందల నలభై ఒక్క కోట్లు ప్రణాళికేతర వ్యయం గానూ, పంతొమ్మిది వందల ఇరవైనాలుగు కోట్లు ప్రణాళికా వ్యయంగానూ కేటాయించడం జరిగింది. అంటే దీనిలో ఎక్కువ భాగం ఉద్యోగుల వేతనాలకే సరిపోతుంది. మరి పేదవారికి ఆరోగ్య సేవలంటే 108గాని, అంబులెన్స్ పథకానికి కేవలం నలభైకోట్ల రూపాయలే కేటాయించారు. రాబోయే రోజులలో అంబులెన్స్ తిరగడానికి చాలా తక్కువ కేటాయింపులు జరిగాయి. మన రాష్ట్రంలో కొత్తగా ఆసుపత్రులుగాని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలుగాని పెట్టడానికి ఈబడ్జెటులో సరైన కేటాయింపులు జరుగలేదని తెలుస్తుంది. ఉద్యోగులకు ఆరోగ్యకార్డులు ఇవ్వడానికి గాను అరకొరగా నూట ఇరవై కోట్లు మాత్రమే కేటాయించారు. ఆరోగ్య కార్డులు జారీచేసినప్పటికీ అవి ఈ రోజుకీ అమలుకాలేదు. దీనిపైన మన రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తమ ద్వారా కోరుకుంటున్నాను. ముఖ్యంగా నీటిపారుదలకు సంబంధించిన విషయంలో – శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి వంశధార ఫేస్–1కు పద్దెనిమిది కోట్లు, వంశధార ఫేస్–2కి యాభైమూడు కోట్లు కేటాయించడం జరిగింది. ఈ రోజు ప్రాజెక్టులు పూర్తికావడానికి ఈ నిధులు ఎటూ సరిపోని పరిస్థితి ఉంది. ముఖ్యంగా మా జిల్లాకు సంబంధించి వంశధారగానీ, పాతపల్లిగానీ, వంశధార ఫేస్–2గానీ ఎప్పటి నుంచో రైతులు కన్న కలలు. నేటివరకు కూడా అక్కడున్న భూములు సాగులోకి రాకపోవడంవల్ల చాలా ఇబ్బందిపడే పరిస్థితి ఉంది. హుద్‌హుద్ తుఫాను మూడు జిల్లాల తీరాలను తాకడంవల్ల రైతులు పూర్తిగా నష్టపోయారు. ఆ రైతులకు సాగునీరు అందించడానికి కావలసిన నిధులు తక్కువగా కేటాయించడంవల్ల ఈ జిల్లాలోని రైతులు చాలా నిస్పృహతో ఉన్నారు. అదేవిధంగా, జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టుకి అవసరమైన నిధులు పదివేల ముప్పైరెండు

కోట్లు. కానీ కేంద్రం కేవలం వందకోట్లే కేటాయించింది. రాష్ట్రం రెండు వందల యాభై కోట్లు కేటాయిస్తే మిగిలిన ఏడువందల డెబ్బై ఏడు కోట్లు కేంద్రం నుంచి వస్తుందని చెప్పారు. కానీ కేంద్రం ఈనాడు మొండిచేయి చూపిన పరిస్థితి ఉంది. పోలవరం జాతీయ ప్రాజెక్టు. అంతేగాక, అది మన రాష్ట్రానికి ఎంతో అవసరం కాబట్టి కేంద్రం మీద ఒత్తిడి తీసుకువచ్చి, ఆ ప్రాజెక్టు సకాలంలో పూర్తిచేయాలని ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. ఈవిధంగా సాగునీటిరంగానికి కూడా సరైన నిధులు కేటాయింపబడలేదని మీకు తెలియజేస్తున్నాను.

వ్యవసాయరంగానికి వస్తే.... ఈ రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ బడ్జెటును ప్రత్యేకంగా రూపొందించడమనే కొత్త సంప్రదాయాన్ని ప్రవేశపెట్టింది. వ్యవసాయ బడ్జెటుకి పధ్నాలుగువేల నూట ఎనభై నాలుగు కోట్లు కేటాయించారు. ఇది చాలా తక్కువ. వ్యవసాయం ఈ రాష్ట్రానికి చాలా ముఖ్యమైనది అయినప్పటికీ అంకెలు అటుఇటు తిప్పి బడ్జెటు రూపొందించారేగానీ సరైన కేటాయింపులు బడ్జెటులో జరుగలేదు. ధరల స్థిరీకరణకుగానీ, ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి గిట్టుబాటు ధరలు బడ్జెటులో ప్రస్తావించలేదు. ఈ బడ్జెటులో ఉచిత విద్యుత్‌కి మూడువేల కోట్లు, రైతుల ఋణమాఫీకి నాలుగువేల మూడు వందల కోట్లు, ఉపాధిహామీకి రెండవేల ఏడువందల పద్ధెనిమిది కోట్లు కేటాయించి, మిగిలిన సుమారు నూట నలభై ఆరు కోట్లు వ్యవసాయానికి కేటాయించారు. ఇది వ్యవసాయరంగానికి చాలా తక్కువ. ఇన్‌పుట్ సబ్సిడీని పూర్తిగా తొలగించాలని నిర్ణయించడానికే ఈ బడ్జెటు రూపొందించినట్లు తెలుస్తుంది. గతంలో మా ఉత్తరాంధ్ర జిల్లాలకు తుఫానులు ఆనవాయితీగా రావడం జరిగింది. గత నాలుగైదు సంవత్సరాలుగా చూసుకుంటే పైలిన్ తుఫాను, లైలా తుఫాను, జల్ తుఫాను, నీలం తుఫాను, హుద్‌హుద్ తుఫానులు వచ్చాయి. ఈ తుఫానులవల్ల రైతాంగానికి చాలా దెబ్బతగులుతుంది. వ్యవసాయానికి అన్ని రకాల పెట్టుబడులు పెట్టిన తరువాత ఈ తుఫానులు రావడం వల్ల రైతాంగం చాలా దెబ్బతింటున్నది. ఉత్తరాంధ్రజిల్లాల వారికి సంబంధించి ఒక స్పెషల్ ప్యాకేజీని ప్రభుత్వం ఇస్తామన్నది కానీ, ఇంతవరకు ఈ స్పెషల్ ప్యాకేజీకి సంబంధించిగానీ, వారికి ఇతర బెనిఫిట్స్‌గానీ చూపెట్టకపోవడం చాలా విచారకరమని మనవిచేస్తున్నాను. అదేవిధంగా, ఈ తొమ్మిది తీరప్రాంత జిల్లాలకు తుఫాను తాకిడివల్ల, ముందుగానే హెచ్చరికలుచేసి, వారిని అప్పటికప్పుడు బడులలోగానీ, లేదా ఎక్కడో ఒకచోట ఉంచుతున్నారు. దాని వల్ల వారికి రక్షణ లేకుండా పోతున్నది. అంతేగాక సరైన మంచినీటి సదుపాయంగానీ, సరైన టాయ్‌లెట్స్ సదుపాయంగానీ లేకపోవడం జరుగుతుంది. తుఫాను బాధితులకు వసతి సదుపాయాలు కల్పించాలని మేము గతంలో కూడా కోరాము. తీరప్రాంతంలో ఉన్న తొమ్మిది జిల్లాలకు అవి అందుబాటులో ఉండేటట్లు చూడాలని కోరాము. ఎప్పుడు తుఫాను హెచ్చరికలు వచ్చినా అవి పర్మనెంటుగా, అన్ని సౌకర్యాలతో ఉండాలని ఈ ప్రభుత్వాన్ని తమద్వారా కోరుకుంటున్నాను. చివరగా ఈ బడ్జెటు అంకెలగారడీ అని చెప్పడం జరిగింది. రాజధాని నిర్మాణానికి సంబంధించి బడ్జెటులో నిధులు ప్రస్తావించలేదు. వైద్య, విద్య, వ్యవసాయరంగంలో కేటాయించిన నిధులు చాలా తక్కువగా ఉన్నాయి. నిరుద్యోగులకు భరోసా కల్పించే ఉద్యోగాలు ప్రస్తావించలేదు. వ్యవసాయ బడ్జెటు చాలా నిరాశాజనకంగా ఉంది. ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించిన వాటిలో ఒకటి కూడా పూర్తిగా ఆచరించబడలేదు. ఇంటికో ఉద్యోగం అన్నారు, బాబు వస్తే జాబు వస్తుందని అన్నారు. వీటి మీద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తమద్వారా కోరుకుంటున్నాను. అదేవిధంగా, ఈ బడ్జెటులో అన్ని రంగాలకు సరైన కేటాయింపులు లేకపోవడం, ముఖ్యంగా వ్యవసాయరంగానికి తక్కువ కేటాయింపులు ఉండడంవల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బడ్జెటు చాలాఅస్తవ్యస్తంగా ఉందని తెలియజేస్తూ మీకు నా హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

మ. 1.50

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ః సభ్యులు ఒకటి గమనించవలసినదిగా కోరుచున్నాను. పార్టీల వారిగా సమయం కేటాయించినప్పుడు the main speaker will be there. When the main speaker is given more time, then he will cover the entire subject. While it is coming to the second and the third speakers, the time is the essence. So, within a limited time any particular point that was not covered by the main speaker, the latter should be covered. Now, I request all the Members to follow that principle. The second and the third speakers can't make prolonged speeches. Now, the last speaker for the day is Mr. Singham Basava Punnaya Garu.

శ్రీ సింగం బసవ పున్నయ్య ః అధ్యక్షా, కోరమ్ లేనప్పుడు నేను ఏమి మాట్లాడాలి. ఒక కథ చెబుతాను. ఒక రాజుగారికి లేకలేక సింహాసనానికి ఒక వారసుడు పుట్టాడు. అదే రోజు రాజు గారి తల్లి మరణించింది. జనమంతా చూడటానికి వెళ్లారు. యువరాజు పుట్టాడని సంతోషపడదామని అనుకున్నారంటా, రాజు గారి అమ్మ మరణించి నేను బాధపడుతుంటే మీరు సంతోషపడతారా అని రాజు గారు అనుకుంటారేమో అని భయపడుతున్నారు. రాజుగారి అమ్మ చనిపోయిందనీ ఏడుద్దామంటే యువరాజు పుట్టినందుకు సంతోషించకుండా ఏడుస్తారా అని అంటారేమో అని ప్రజలకు భయం వేసింది. నేను ఇప్పుడేమి మాట్లాడలేను, నాకు ఆకలిగా ఉన్నది ఇంటికి వెళ్తాను.

DEPUTY CHAIRMAN: Now, the House is adjourned to meet again on 19th March, 2015 at 10.00 a.m.

(The House, then adjourned at 1.53 p.m. to meet again at 10.00 a.m. on Thursday, the19th 2015).

* * *